ప్రజాశక్తి

Vol. 6, no. 17

(Apr. 25, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 17

(Apr. 25, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486

0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 25-4-45 సంచిక 17

దినపత్రిక ఎప్పుడు?

— జాతీయ నాయకుల విడుదలకై ఎడతెగని ఆందోళన చేసేపత్రిక "ప్రజాశక్తి".

— దేశరక్షణకు, కరువుకాటకాల నిర్మూలనకు, జాతీయ ప్రభుత్వం అవసరమని ప్రచారంచేసే పత్రిక "ప్రజాశక్తి"

— ముస్లింజాతుల స్వయంనిర్ణయ హక్కుకై పోరాడే పత్రిక "ప్రజాశక్తి"

— ధరల కంట్రోలు, రేషనింగు జయప్రదంగా అమలు జరుగుటకు తోడ్పడేపత్రిక "ప్రజాశక్తి"

— స్థానికాధికారుల జబర్దస్తీలను ఎత్తిచూపే పత్రిక "ప్రజాశక్తి"

— పీడిత ప్రజాసామాన్యం యొక్క హక్కులకై పోరాడే పత్రిక "ప్రజాశక్తి"

అట్టి "ప్రజాశక్తి"ని దినపత్రికగా మార్చే ప్రయత్నానికి తోడ్పడవలసిందిగా ప్రజానీకాన్ని కోరుతున్నాం. ప్రజాందోళన తీవ్రతరమైనప్పుడే మా ప్రయత్నం ఫలిస్తుంది. తీర్మానాలు, జాబులు, టెలిగ్రాములు ఒక్కొక్క కాపీ చొప్పున క్రింది అడ్రసులకు పంపగోరెదము.

1. సెక్రెటరీ, ఇండస్ట్రీస్ అండ్ సివిల్ సప్లయిస్ డిపార్టుమెంటు, గవర్నమెంటు ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ.

2. పేపర్ కంట్రోలర్, గవర్నమెంటు ఆఫ్ ఇండియా, సిమ్లా.

3. ఛీఫ్ సెక్రెటరీ, గవర్నమెంట్ ఆఫ్ మెద్రాసు, ఫోర్టు సెంట్ జార్జి.

ప్రతికూల శక్తులకు పరాజయం!

గుంటూరుజిల్లా రైతుమహాసభ దృశ్యాలు

"ఇప్పట్లో వాన వెలిసే సూచన కనపడ్డంలేదు. దగ్గర గ్రామాలనుంచి రాదలచుకున్న ప్రజలు ప్రయాణం ఆపుచేసుకొని వుంటారు. దూర గ్రామాలనుంచి రాదలచుకున్నవారు మొన్నరాత్రి కురిసిన వర్షంతో ఆగిపోయి వుంటారు.....మహాసభ జరగడం యిక సాధ్యం కాదు."

—అంటున్నాడు కామ్రేడ్ బసవపున్నయ్య, ఆహ్వానసంఘ ఆఫీసులో కూచున్న కార్యకర్తలతో.

★

ఆకాశం కారుమబ్బులతో నిండివుంది. పైన జోరుసవాన. కింద నేలంతా బురద. తల దాచుకోవడం దుర్లభమవుతోంది. ఇదీదృశ్యం తెనాలిలో గుంటూరుజిల్లా రైతుమహాసభ యొక్క మొదటిరోజు మధ్యాన్నం.

మహాసభను ఆపుజేయాలని ఆహ్వానసంఘమువారు నిశ్చయించారు. కామ్రేడ్ జోషీ మాత్రం, వచ్చిన కొద్దిమంది ప్రేక్షకుల యెదుట అరగంట సేపు ఉపన్యసించాలని నిర్ణయం.

పోటీ సంఘంవాళ్ళ ఆనందం ఇంతాఅంతా కాదు. ప్రజలు సభకు రాకుండా వారనేక విధాల ప్రయత్నించారు! ఇప్పుడు "వరుణదేవుడు"కూడా తమకు తోడ్పడ్డాడని చంక లెగర వేశారు.

తొలిరోజు రాత్రినుంచి వస్తున్న రైతాంగం మాత్రం ఆశాభంగంతో కుంగిపోతున్నారు. నలుగురు వృద్ధస్త్రీలు వాలంటీరు శిబిరంలో కూచుని, యిలా విచారంతో చెప్పుకుంటున్నారు.

"పాపం, ఎంత కష్టపడి కట్టారో, యీ పందిళ్ళు - పాకలు! శ్రమంతా వృధాకావలసిందే కదా! నారాయుడికి కన్నుకుట్టింది, ఇదంతా చూసి!"

★

మధ్యాన్నం రెండున్నరయింది. కామ్రేడ్ అమ్మయ్య (ఆహ్వాన సంఘాధ్యక్షుడు) ఉపన్యాసవేదిక యెక్కాడు. వర్షంలో తడుస్తూ నిలబడ్డ ప్రేక్షకుల్ని సంబోధిస్తూ, మహాసభకు సర్వవిధాలా తోడ్పడ్డ జిల్లా రైతాంగాన్ని అభినందించాడు. వర్షంవల్ల సభ జరక్కుండా పోతున్నందుకు విచారం వెలిబుచ్చాడు.

క్రమంగా ఆకాశం తెరిపిచ్చింది. వానవెలిసింది. ప్రేక్షకుల ముఖాలు వికసించాయి. వాలంటీర్ల సంతోషం వర్ణించ శక్యంకాదు. నాయకుల్లో ఆశారేఖలు పొడసూపాయి.

●

అన్ని వేపులనుండి జనం చీమలబారుల్లా "రైతునగర్" చేరుకుంటున్నారు.

5 వేలతో ప్రారంభమైన సభ 10 నిమిషాల్లో 8 వేలయింది.

పతాకోత్సవం

పతాకోత్సవం జరపడానికి నిజాం ఆంధ్ర మహాసభాధ్యక్షులైన రావి నారాయణరెడ్డిగారు లేచారు. నైజాం ఆంధ్రుల ప్రజాఉద్యమానికి నాయకత్వం వహించిన ఒక వ్యక్తిని బ్రిటిష్ ఇండియా ఆంధ్రులు యిలా ఆహ్వానించడం, వారి సందేశాన్ని వినడం, ఒక కొత్తసాంప్రదాయమని చెప్పాలి. ఎర్ర జండానీడను రైతు సంఘాలు జాతీయోద్యమాన్ని ఎలా బలపరుస్తూ వచ్చాయో ఉదహరించారు. ఇది జాతీయపతాకానికి పోటీగా యేర్పడ్డ జండాఅంటూ వ్యతిరేకులు చేసే దుష్ప్రచారాన్ని ఖండించారు. "రంగా, కాశేశ్వరరావు ప్రభృతుల మద్దతుతో మారాష్ట్రంలోకూడా సంఘ విచ్ఛిన్నకులు బయల్దేరారు. ఆంధ్రమహాసభకు పోటీగా మరో సంస్థను పెట్టారు. జాగిర్దార్లు, దేశముఖులు వారికి సాయంచేస్తున్నారు మీరు మీరాష్ట్రములో సంఘవిచ్ఛిన్నకులకు సరియైన జవాబు చెబితే, మారాష్ట్రంలోకూడా ఐక్య ప్రజా ఉద్యమానికి చేయూతనిచ్చిన వారౌతారు"

అంటూ రెడ్డిగారు జయజయ ధ్వానాల మధ్య ఎర్రజండా నెగురవేశారు.

మధ్యాన్నం మూడున్నరయింది. స్త్రీలు-పురుషులు, బాలురు-వృద్ధులు, రైతులు-కూలీలు బిడ్డల్ని చంకబెట్టుకొని, తొందర తొందరగా నడిచి వస్తున్నారు. 15వేల మంది సభ నలంకరించారు.

ఆకాశం పూర్తిగా తెరిపి యిచ్చింది వర్షం ఆగిపోయింది.

కామ్రేడ్ జోషీ లేచి మైకువద్ద నిలబడాడు. "కామ్రేడ్ జోషీ జిందాబాద్!" "రైతుసంఘాలకు జై!" "కూలి సంఘాలకు జై!" "జిల్లా రైతుమహాసభకు జై!" మొదలైన నినాదాలతో దిక్కులు పిక్కటిల్లాయి.

ఇక మహాసభ దిగ్విజయంగా జరుగుతుందనే ధైర్యం అందరిలోను యేర్పడింది.

పోటీ రైతుసంఘాలు రైతుఉద్యమాన్ని యెలా దెబ్బతీస్తాయో జోషీ వివరిస్తూంటే, నిజమేనన్నట్టు ప్రేక్షకులు తలలూపారు. కమ్యూనిస్టులపై రంగా, కాశేశ్వరరావులుచేసే అబద్ధపు ప్రచారాన్ని ఖండిస్తూంటే, అంతా వారిని అపహ్యంచుకున్నారు. లాయర్లు, విద్యార్థికులు జోషీ వాగ్ధోరణిని మెచ్చుకున్నారు.

సాయత్రం 6 గంటలయేసరికల్లా 40 వేలమంది జనంతో మహాసభ కళకళలాడింది.

ఈ 40 వేల మందిలో స్త్రీలు అయిదారు వేలు ఉంటారు. అప్పుడప్పుడు తుంపరలు పడుతూన్నా, ప్రేక్షకులు యెవరి స్థానాల్లో వారు కూచునే ఉన్నారు. పసిబిడ్డల్ని చంకబెట్టుకు వచ్చిన స్త్రీలు, వృద్ధమాతలు, కదలకుండా కూచుని, ఉపన్యాసాన్ని శ్రద్ధతో వినడం ఒక ప్రత్యేకత.

మా విలేఖరి

బ్రిటిష్ సైనికుల సెల్యూట్

"రైతునగర్" రైల్వేలైనుకు సమీపంలో ఉండడంవల్ల, వచ్చేపోయే రైళ్లలో ప్రయాణం చేస్తున్న ప్రజలు మహాసభ దృశ్యాన్ని చూచి, ఉత్తేజితులయారు. ఒక స్పెషల్ ట్రెయిన్ నిండా బ్రిటిష్ సైనికులు ప్రయాణంచేస్తున్నారు. వారీ ప్రజా సమూహాన్ని చూచి సంతోషంతో జేజేలుకొట్టారు. ఎత్తుగా యెగిరే ఎర్రజండాకు సెల్యూట్ చేశారు. వీరంతా బ్రిటన్‌లో సామాన్య కార్మికులుగా ఉండి, ఎర్రజండా క్రింద అనేక పోరాటాలు సాగించిన వారై ఉండాలి! లోక కల్యాణమే పరమావధిగా పెట్టుకొని, యుద్ధ రంగంలో ప్రాణాలకు వెనుదీయకుండా వీరు పోరాడుతున్నారు. అట్టి బ్రిటిష్ సైనికులు రైతు పతాకానికి వందన మర్పించారంటే, ఆశ్చర్యం ఏముంది?

జోషీ ఉపన్యసిస్తూన్న సమయంలోనే, మహాసభ దృశ్యాన్ని చూడ్డానికి మిత్రవిమానమొకటి వలయాకారంగా ఎగురుతూ వెళ్ళింది. రెండోసారి మళ్ళీ వచ్చి, ఏటవాలుగా వొంగి, మిలిటరీ సెల్యూట్ ఇచ్చింది!

మన స్వాతంత్ర్యవాంఛపట్ల బ్రిటిష్ పాలకవర్గం ఎంత వ్యతిరేకత చూపుతున్నా, బ్రిటిష్ ప్రజాసామాన్యం మన పక్షాన్నే ఉన్నారనడానికి ఇంతకంటె తార్కాణంఏమికావాలి?

రాత్రి ఎనిమిదిగంటలకు కామ్రేడ్ జోషీ ఉపన్యాసం పూర్తయింది.

ప్రజాసంరంభం

మర్నాడు ఉదయమే కాఫీతాగి బయల్దేరాను, "రైతునగర్" చూడ్డానికి. సభాపరణకు నలుదిక్కులా నాలుగు ఎత్తైనగేట్లు. వాటిమీద సుత్తి - కొడవలి చిహ్నం; వ్యవసాయానికి సంబంధించిన అందమైన చిత్రాలు; "ఎక్కువ పంటలు పండించాలి!" "రైతు - కూలీ సామరస్యం కావాలి!" "జాతీయ నాయకుల్ని విడుదలచేయాలి!" మొదలైన నినాదాలు ఉన్నాయి. మొదటిగేటు "పల్నాటి హనుమంతుగేటు."

1920 లో జరిగిన పన్నుల నిరాకరణోద్యమానికనాయకత్వం వహించి, తుపాకిగుండ్లకు ఎరయైన ఆవీరయోధుని స్మారకచిహ్నంగా దీన్ని నిర్మించారు. రెండవగేటు, పశ్చిమ గోదావరిజిల్లా కాంగ్రెసు ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించి, జైల్లో ప్రాణాలు విడిచిన శ్రీ దండు నారాయణ రాజుగారి పేరుతో యేర్పరచారు. మూడవది "కె. ఎస్. గుప్త గేటు." నాల్గవది "కామ్రేడ్ సూర్యనారాయణ గేటు."

వాలంటీర్ శిబిరాలు, వంటశాల, భోజనశాలలు, ప్రదర్శనశాలలు - ఇవన్నీ సభావరణచుట్టూ నిర్మింపబడి వున్నాయి. వీటికికొంచము దూరంగా బళ్లు నిలబడ్డానికి విశాలమైన ప్రదేశం. అవశిష్టాలు తీర్చుకొనేవారు కొందరు; స్నానాలుచేసేవారు కొందరు; వంటలు వండుకునేవారు కొంతమంది; తలలు దువ్వుకునేవారు కొందరు - యిలా ఎవరి పనుల్లో వారున్నారు. అన్నితాలూకాలనుంచి మొత్తం 200 బళ్ళలో జనం వచ్చారు. తెనాలికి సమీపంగా ఉన్న గ్రామాలనుంచే కాకుండా, దాదాపు 100 మైళ్ళ దూరంలోవున్న పల్నాడు, సత్తెనపల్లి, వినుకొండ, ఒంగోలు తాలూకాలనుంచి కూడా బళ్ళు కట్టుకువచ్చారు. తోవలో 2సార్లు వర్షం కురిసింది. అయినా, ఉత్సాహంతో సాయంత్రానికి తెనాలి చేరుకున్నారు. 50 మైళ్ళ దూరంలోవున్న కోదూరు నుంచి మరి కొన్నిబళ్లు వచ్చాయి. గుంటూరునుంచి వచ్చిన బళ్ళలో ఒకబండికి పెద్ద కాంగ్రెసు జండా, ముస్లింలీగ్ జండా, ఎర్రజండా కట్టి, ముందు జాతీయనాయకుల చిత్రపటాలమర్చారు. కప్పుమీద "గుంటూరుజిల్లా రైతు మహాసభకు జై!" "జాతీయనాయకుల్ని విడుదల చేయాలి!" మొదలయిన నినాదాలతో ఎర్రనిగుడ్డ కప్పారు. దావులూరు వ్యవసాయ కూలీలు 90 బస్తాల (మిగతా 2 వ పేజీలో)

(1 వ పేజీ తరువాయి) బియ్యం పరిశుభ్రంగా బాగుచేసి. 50 బళ్ళమీద వేసుకొచ్చారు. అవి రైతులు సప్లయిచేసిన బళ్లు. నరసాయపాలెం ము-చి (బాపట్లతాలూకా) 3 పడవలలో 600 మంది స్త్రీ పురుషులొచ్చారు. పెదవడ్లపూడి రైతులొక పెద్ద ప్రభతో ఊరేగుతూవచ్చారు. నరసారావుపేట తాలూకానుంచి 600 మంది. సత్తెనపల్లినుంచి 500 మంది. పల్నాడునుంచి 200 మంది. వినుకొండనుంచి 30 మంది - యిలా దూర ప్రాంతాలనుంచి ప్రేక్షకులొచ్చారు.

వ్యతిరేకుల పన్నాగాలు

నరసారావుపేట తాలూకాలో రావిపాడు అనే గ్రామం ఉంది. అక్కడ రావిపాటి కామేశ్వర్రావు అనేవ్యక్తి తాలూకా కాంగ్రెసు అసెంబ్లీకి ఉపాధ్యక్షు డట. తన గ్రామం నుంచి ఒక్కడిని కూడా పోనీయనని "శపథం" తీసుకున్నాడట! కాని, అదే గ్రామం నుంచి 80 మంది రైతులు బయల్దేరి వచ్చారు. 13వ తేదీ రాత్రి కురిసిన వర్షం వల్ల మహాసభ పందిళ్ళు పడిపోయాయనీ, సభ జరగదనీ, రేపల్లె తాలూకాలో కొందరు కాంగ్రెసు వాదులు పుకారుచేశారు. మహాసభపై నిషేధం ఉంది కాబట్టి, జరగదని కొన్ని గ్రామాలలో పోలీసులు ప్రచారం చేశారు. తెనాలి తాలూకా గ్రామాలలో పోటీ సంఘంవారు గోడలపై అంటించిన కాగితాలు చింపించారు. వాటిపైన పేడ పూయించారు. గోవాడలో మరొక జిల్లామహాసభ జరుగుతుందనీ, పెద్దపెద్ద నాయకులు వస్తారనీ, కరపత్రాలు పంచిపెట్టారు. మహాసభ జరుగుతూన్న సమయంలోనే, పదిపదిహేను గురు వ్యతిరేకులు మేగఫోన్లతోవచ్చి, సరిగా పోలీసులు మకాంచేసినచోట గోవాడ సభను గూర్చి అరవడం మొదలెట్టారు. తమకూ - వలంటీర్లకూ మధ్య ఘర్షణ జరిగితే, పోలీసులు దాన్ని సాకుగా తీసుకొని సభను ఆపుజేస్తారని వీరి ఎత్తు! సభను చూడ్డానికి వెళ్ళిన వారందరిచేత మూకుమ్మడి బలవంతంగా అన్నంతినిపిస్తారని తెనాలిలో మరొక పుకారు పుట్టించారు. వెల్లూరునుంచి వచ్చిన ఒక సౌహార్ద్రప్రతినిధి తన మిత్రుని యింట భోంచేస్తూంటే, యిది విన్నాడు. ఆవార్త వచ్చి అబద్ధమని చెప్పాడు. సాయంత్రం ఆమిత్రుడుసకుటుంబంగా మహాసభకువచ్చాడు.

వ్యతిరేకశక్తులు యింత విజృంభించినా, హోరుమని వర్షం కురిసినా, మహాసభకు 50 వేలమంది వచ్చారంటే, రైతుసంఘం రైతుల్లో ఎంత అభిమానాన్ని చూరగొన్నదో తెలుసుకోవచ్చు. ఈ వ్యతిరేక ప్రచారమూ, ఈవాన, లేకపోయున్నట్లయితే, మహాసభకు ఇంకా యెంతమంది వచ్చియుండేవారో!

ప్రదర్శనాలు

భోంచేసి, తిరిగి ప్రదర్శనాలు చూడ్డానికి బయల్దేరాను. సోవియట్ చిత్ర ప్రదర్శన శాలలో 300 చిత్రాలున్నాయి. అక్కడి సమిష్టివ్యవసాయపద్ధతిని గూర్చి తెలియజేసే చిత్రాలుచూచి, రైతాంగం విస్మయంచెందారు. సోవియట్ ప్రజల సర్వతోముఖాభివృద్ధిని సూచించే చార్టులు ప్రేక్షకుల్లో ఆనందం కలిగించాయి.

ఆరోగ్య ప్రదర్శనంలో, ప్రజలు తమ ఆరోగ్యరక్షణకై తీసుకోవలసిన జాగ్రత్తలు చూపించారు. శరీర నిర్మాణానికి సంబంధించిన మైనపుబొమ్మలుకొన్నితీసుకొచ్చి చూపించారుఆరోగ్యశాఖవారు. గర్భిణీ స్త్రీయొక్క శరీరంలో శిశువు పెరిగే విధం, నాటుమంత్రసానికీ-తరిఫీదు పొందిన నర్సుకీ గలతేడా, యీ బొమ్మలలో చూపబడ్డాయి. ఎంతో ఆసక్తితో వీటిని స్త్రీలు చూచారు.

పశుప్రదర్శనంలో బహుమతులు

వ్యవసాయ వస్తుప్రదర్శన శాలలో, మంచి పసితనంతో కూడుకున్న చరణాకోళ్లు, పగ్గాలు, మోకులు, రైతుల్ని చాలా ఆకర్షించాయి. కుచ్చెళ్ళపాడు గ్రామంనుంచి (తెనాలితాలూకా) నానయ్య నాయుడుగారు సన్నని గడ్డితో 40 పేటలతాడు పేనుకు వచ్చారు. ఒక వెండికప్పు వీరికి బహుమతిగా ఈయబడింది. ఎడ్లపల్లి వాస్తవ్యులు, ఆలపాటి సాంబయ్యగారు, తమపొలంనుంచి రకరకాల చిక్కుళ్ళు, ఇంగ్లీషు కూరగాయలు, తేనెపట్టులు, మేలురకపు కోళ్ళు, తీసుకొచ్చి ప్రదర్శించారు. వీరికికూడా ఒక వెండికప్పు బహుమతిగా యిచ్చారు. జిల్లా పొగాకు మార్కెటింగ్ కమిటీవారు మంచిరకం పొగాకు పండించే పద్ధతులు, క్యూరింగు, మొదలైనవి చిత్రపటాలద్వారా చూపించారు. ప్రపంచ మార్కెట్టులో మనదేశపు పొగాకు ఆక్రమిస్తున్న స్థానాన్ని చార్టులద్వారా చూపారు. కడపజిల్లా రైతుసంఘం పంపిన మంచిమంచి వడ్లజాతులుకూడా ప్రదర్శింపబడ్డాయి. వ్యవసాయ శాఖవారు మేలురకపు విత్తనాలు, మరనాగళ్లు, గుంటకలు తీసుకొచ్చి చూపెట్టారు. ఫిషరీస్ డిపార్టుమెంటువారు మద్రాసునుంచి రకరకాల చేపలజాతులు తీసుకొచ్చారు. కాని వర్షంవల్ల తిరిగి వాటిని వెనక్కు తీసుకుపోయారు.

పశు ప్రదర్శనం

మహాసభకు ఎడ్లు, ఆవులు, కోడెలు, గిత్తలు, యితరపశువులు — మొత్తం 58 వచ్చాయి వివిధగ్రామాలనుంచి. ఒక్కొక్క జాతిలో మేలురకంపశువుకి బహుమతులిచ్చారు. ఒక సంవత్సరంలోపు వయసుగల కోడెలలో మొదటిబహుమతి గుర్రం అప్పయ్యగారికి (పొన్నెకల్లు) వచ్చింది. 1½ సంవత్సరం లోపు కోడెలలో మొదటిబహుమతి కోగంటి శివయ్యగారిది (తెనాలి). 2 పళ్ళువేసిన కోడెలలో మొదటిబహుమతి జి. వీరారెడ్డిగారిది (పెనుమోలు). 4 పళ్ళువేసిన గిత్తలలో మొదటి బహుమానం గుర్రం అప్పయ్యగారిది (పొన్నెకల్లు). 6 పళ్ళువేసిన గిత్తలలో మొదటి బహుమానం పి. వెంకటరెడ్డిగారిది (మామిళ్ళపల్లి). 8 పళ్లువేసిన గిత్తలలో మొదటి బహుమతి కొల్లా కృష్ణయ్యగారిది (కాకుమాను). ఎడ్లజతలలో అన్నిటికంటె అందమైనజత కాటసేని వెంకటకృష్ణయ్యగారిది (యాపూరు). వీరి జత దుక్కిదున్నేటప్పుడు ముకుతాడుగాని, మొదపట్టాగాని, తాళ్లుగాని, లేకుండా, మాటను బట్టి ఎడమపైపుకి - కుడిపైపుకి తిరగ్గలవు. ఇంతశిక్షణ వీటికి యెలా నేర్పారో ఆశ్చర్యం. అందులో మొదటిబహుమతిగా వీరికి 40 తులాల వెండిపళ్ళెం, గంట యిచ్చారు. ఇక, విడిమోతల్లో అందమైనది వేజెళ్ళ వెంకటకృష్ణయ్యగారివద్దు(పల్లెకోన).

దుక్కి పోటీలో మొదటి బహుమతి ఎస్. సాంబయ్యగారి జతకు వచ్చింది (పెదవడ్లపూడి). కోగంటి శివయ్యగారి(తెనాలి)గిత్తకు ప్రదర్శనం మొత్తంమీద మొదటి బహుమతి యిచ్చారు.

ఒక ఆవుపెయ్యకు, ఒక ఆబోతుకి, ఒక గుర్రానికి, ఒకదున్నపోతుకీ, ఒక పొట్టేలుకీ, కూడా వేర్వేరుగా బహుమతులిచ్చారు.

ఈ ప్రదర్శనంయొక్క ప్రత్యేకత ఏమంటే అంతిమ నిర్ణయాలమీద ఎవరూ అప్పీలుచేయలేదు.

తరవాత, పటమటలంక (కృష్ణా) నుంచి వచ్చిన ప్రొఫెసర్ పాండురంగారావుగారి బల ప్రదర్శనం ప్రేక్షకుల్ని ఉత్తేజపరచింది. బలిష్టమైన ఇనుపగొలుసును తెంచుట, మోచేతితో కొబ్బరికాయ పగల గొట్టుట, ముష్టియుద్ధం, కత్తిసాము, బాకుతో యుద్ధం, రకరకాల కుస్తీపట్లు, ఆసనాలు, పదిపదిహేను సెకండ్లు చేతినాడిని, హృదయ చలనాన్ని, ఆపుట - మొదలైనవి ప్రదర్శించారు.

సందేశాలు

సాయంత్రం 6 గంటలకు మహాసభ తిరిగి ప్రారంభమైంది. అధ్యక్షోపన్యాసం, కామ్రేడ్ చంద్రసింగు ఉపన్యాసం. పూర్తి అయాక ప్రముఖుల సందేశాలుచదివి వినిపింపబడ్డాయి. యు. పి. కాంగ్రెసునాయకుల్లో ఒకరైన శ్రీప్రకాశ్‌గారు, "గ్రామప్రజల జీవితం బాగుపరచుటకు మనమంతా కృషిచేయవలసినఅవసరం ఉంద"ని సందేశం పంపారు. "గుంటూరుజిల్లా పొగాకు అమెరికా పొగాకుతో పోటీ చేయగలదని, ఇంగ్లీషుమార్కెట్టును కూడా ఆక్రమించగలదని, అందుమూలంగా మీజిల్లా రైతులు లాభపడతారని" ఆశిస్తూ, అఖిల భారత కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ మాజీ సభ్యులైన సయ్యద్ మహమూద్‌గారు రాశారు. "అఖిల భారత రైతుసంఘ వేదికపై రైతాంగాన్నంతటినీ ఏకంచేసి, మీదేశభక్తియుత కర్తవ్యాన్ని నిర్వర్తించుతా"రని విశ్వసిస్తూ అ. భా. ట్రేడుయూనియన్ కాంగ్రెసు కార్యదర్శి ఎన్. ఎం. జోషిగారుతెలియజేశారు. "మనోనిబ్బరం చెడి, అంధకారం ఆవరించియున్న మనదేశంలో ఆత్మవిశ్వాసం కలిగించి, ఆశాజ్యోతిని వెలిగించుతున్న అఖిల భారత రైతుసంఘ నిర్ణయాలను మహాసభఆచరణలో పెట్టవలసింద"ని కోరుతూ బంకిం ముఖర్జీ (అ. భా. రైతుసంఘ కార్యదర్శి) రాశారు.

వీరుగాక, "అమృత బజార్" పత్రికా సంపాదకులైన మృణాళకాంతిబోసు, మద్రాసు మాజీ కాంగ్రెసు మంత్రి డాక్టరు రాజన్‌గారు మహాసభ విజయాన్ని కోరుతూ సందేశాలు పంపించారు.

తరవాత, రెండోరోజు కామ్రేడ్ జోషి ఉపన్యాసం వినడాని కవకాశం దొరకని ప్రేక్షకుల కోర్కెమీద రెండోసారి ఉపన్యసించారు. ఈ సారి 60 వేలమంది ప్రజాసామాన్యం జోషి ఉపన్యాసాన్ని పూర్తిగా విన్నారు.

భోజనాలయాక, తిరిగి వైజ్ఞానిక కార్యక్రమం ఆరంభమైంది. పూర్తయేవరకు ప్రేక్షకులు శ్రద్ధతో కూడుని విన్నారు.

వైద్యసహాయం

మహాసభ జయప్రదంగా జరగడానికి 9 గురు ప్రయివేట్ డాక్టర్లు, ఇద్దరు కంపౌండర్లు, ఇద్దరు నర్సులు ఆసుపత్రిలో ఉండి, చక్కని శిక్షణతో పనిచేశారు. గుంటూరునుంచి వచ్చిన ఒక హోమోపతి డాక్టరు హోమోపతి చికిత్సలు చేశారు. మొత్తం 1800 మందికి తలనొప్పికి, అజీర్ణానికి, విరేచనాలకు, చిన్నచిన్న దెబ్బలకు మందులిచ్చారు. జ్వరంతో బాధపడ్డవారు 6 గురు, ఎండదెబ్బవల్ల పడిపోయిన వారు 23 గురు, వాంతులు వచ్చినవారు 3 రు. హిస్టీరియాతో ఇద్దరు, బంక విరేచనాల వల్ల ఒకరు ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఉండి చికిత్స పొందారు. స్థానిక ఆరోగ్యశాఖవారు కూడా ఎంతో సహకారం చేశారు. రైతునగర్‌కి కొంచెం దూరంలో పాయఖానాదొడ్లు ఏర్పాటు చేయబడ్డాయి. మంచినీళ్లు పరిశుభ్రంగా ఉండడానికి మందుకలిపి యిచ్చేవారు.

వాలంటీర్ల శిక్షణ

గుంటూరుజిల్లా వలంటీర్లు 1300 మంది, కృష్ణాజిల్లానుంచి 1300 మంది, ఇతరజిల్లాలవారు 100 మంది, మొత్తం 2700 మంది వలంటీర్లు కామ్రేడ్ ముక్కామల నాగభూషణం నాయకత్వాన మహాసభకు చక్కని ఏర్పాట్లుచేశారు. వీరిలో 400 మంది వ్యవసాయ కూలీలు, 300 మంది పట్టణకార్మికులు, 200 మంది స్త్రీలు, 100 మంది విద్యార్థులు, ఉన్నారు. వంటశాలవద్ద ప్రత్యేకంగా 100 మంది స్త్రీవలంటీర్లు పనిచేసారు. రైతుమహాసభఅయినా, వివిధవర్గాల ప్రజలు, వివిధకులాలకుచెందినవారు ప్రజాఉద్యమాలకు ఎలా చేయూతనిస్తున్నారో ఇంతకంటె నిదర్శనం ఏమికావాలి! మహాసభకు 15 రోజులు ముందుగా కృష్ణాజిల్లానుంచి 130 మంది, గుంటూరునుంచి మరికొందరు, వలంటీర్లుగా వచ్చి పందిళ్ళు వేయడంలో కష్టపడి పనిచేశారు. గుంటూరుటౌన్‌నుంచి వచ్చిన 30మంది మ్యునిసిపల్ కార్మికులు పారిశుద్ధ్యపు ఏర్పాట్లకు ఉచితంగా సాయపడ్డారు.

13వ తేదీ రాత్రి, 15వ తేదీ మధ్యాన్నం కురిసిన వర్షంతో పాకలు, పందిళ్లు కొంత దెబ్బతిన్నాయి. కాని, వాలంటీర్లు వెంటనే వాటిని చకచక తిరిగి నిర్మించారు. ప్రేక్షకుల్ని సర్దడంలో వాలంటీర్లు ఎంతో మర్యాద, సహనం చూపెట్టేవారు. ఆవరణసమీపంలో ప్రజలు గలీజుచేయకుండా, దూరంగా నిర్మించబడిన ప్రదేశాలకు తోవచూపేవారు. సెంట్రీ డ్యూటీలో కునికిపాట్లుపడకుండా బహుజాగ్రత్తగా, తమవిధులను నెరవేర్చారు. వాలంటీర్ల శిక్షణ చూచి, ప్రభుత్వోద్యోగులు సహితం ఆశ్చర్యపడ్డారంటే, ఎంతచక్కగా వారు తమవిధులు నెరవేర్చారో బోధపడుతుంది.

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పెంట్రప్రగడ (కృష్ణా) బ్యాండ్‌సెట్‌వారు "రైతునగర్"లోను, తెనాలి టౌనులోను, జాతీయగీతాలు పాడుతూ కదంతొక్కుతూ, వస్తూంటే, రైతుబిడ్డలకు యీ విద్యలన్నీ ఎలా అబ్బాయా! అని ప్రేక్షకులు మురిసిపోయేవారు.

మహాసభకు మొత్తం రు. 20,000లు విరాళాలు వసూలయాయి. వస్తురూపేణా కూడా చాలమంది తోడ్పడ్డారు. మహాసభకు ఉపయోగపడ్డ కట్టెలు, తాటాకు, కూరగాయలు, పచ్చళ్లు ఉచితంగానే వచ్చాయి. సుత్తి, కొడవలి చిత్రంగల ముంతలు, గ్లాసులు కూడా ఉచితంగానే వచ్చాయి. ఈరెండురోజులూ మొత్తం 30వేల మందికి భోజనాలు పెట్టారు. పసందైనఅన్నం, రుచిగల పచ్చళ్లు చక్కని పులుసు, చిక్కటి మజ్జిగ-యీ భోజనాన్ని మెచ్చుకోకుండా యెవరుండగలరు!

కఠెవరంలో కైవల్యాశ్రమ స్థాపకులైన "బాలయోగి"గారు తమ సొంతఖర్చుతో ఆ రెండు రోజులు నాయకులకిచ్చిన ఆతిథ్యం, చూపిన ఆదరణ కొనియాడదగినది. ఈసారి తెనాలి తాలూకాలో (మిగతా 15 పేజీలో)

సప్రూకమిటీ సూచనలపై వివిధవర్గాల అభిప్రాయాలు

హిందూ - ముస్లిం సమస్యా పరిష్కారానికి సప్రూకమిటీ గావించిన సూచనలపై ముస్లింలీగ్ పత్రికలు, జాతీయ ముస్లిం పత్రికలు, కాంగ్రెసు పత్రికలు, హిందూ మహాసభ పత్రికలు వ్యాఖ్యానాలు ప్రకటించాయి.

"డాన్" (ముస్లింలీగు) ఇలా రాసింది :"సమిష్టి కుటుంబంలో యిద్దరు సోదరులు విడిపోయినట్లుగా విడిపోవడానికి గాంధీజీ అంగీకరించాడు. సప్రూకమిటీలోవున్న పెద్ద పెద్ద లాయర్లంతా కలిసి, అలా సోదరభావంతో విడిపోవడాని కవసరమైన పద్ధతులాలోచించడం కష్టమైన విషయంకాదు. అట్టి విభజన ఆచరణలో యెల్లావుంటుందో చూపుతూ కొన్ని సూచనలీయడం ఎంతో సులభమైన పని. కాని సప్రూకమిటీ అలా చేయలేదు." ఇందుకు కారణం చెబుతూ, గాంధీజీ ఒప్పుకున్న సూత్రాన్ని నామరూపాలు లేకుండా చేయడమే సప్రూకమిటీ యొక్క ఉద్దేశ్యమని "డాన్" తెలియజేసింది.

అంతేకాదు. రెండుమూడు స్వతంత్రరాజ్యాలుండడం భారతీయుల శాంతి భద్రతలకు ముప్పు తెచ్చిపెడుతుందనే సప్రూకమిటీ వాదనను తుత్తునియలు చేసింది. దేశరక్షణలోను, ఆర్థికవ్యవహారాలలోను, పాకిస్తాన్ - హిందూస్తాన్ రాజ్యాలమధ్య సమరసభావంఉండితీరుతుందని ప్రకటించింది.

"ఆర్థిక వ్యవహారాలలో హిందూస్తాన్ - పాకిస్తాన్ రాజ్యాలమధ్య ఒడంబడిక కుదుర్చుకోవడం ఎందువల్ల సాధ్యంకాదు? ఎగుమతి దిగుమతి సుంకాలు రెండురాజ్యాల అభివృద్ధికి అనుగుణ్యమైన విధంగా వేసుకోవచ్చు" అని కూడా "డాన్" రాసింది.

"అంజామ్" అనే మరొక లీగ్‌పత్రిక (ఢిల్లీ) యిలా రాసింది : "సప్రూ కమిటీ దేశానికి చాలా హానికలుగజేసింది. హిందూ రాజ్యాంగ వేత్తలమీద ముసల్మానులకు నమ్మకం లేకుండా చేసింది. బ్రిటన్‌పైపు దృష్టుల నిగిడ్చిచూచింది."

"ఖిలాఫత్" పత్రిక (బొంబాయి). "బాధ్యతగల జాతీయ నాయకులు (గాంధీజీ, జిన్నాలు, మాత్రమే భారతదేశ సమస్యను పరిష్కరించగలవారు; అంతేగాని అధినివేశ పరిపాలన (డొమినియన్ స్టేటస్) తో సంతృప్తపడు. తేజ్‌బహదూర్ సప్రూవంటివారు కారు" అని వ్యాఖ్యానించింది.

జాతీయ ముస్లిం పత్రికలు

ముస్లింలీగ్ పత్రికలేకాకుండా, జాతీయముస్లిం పత్రికలు సహితం సప్రూకమిటీ సూచనలపట్ల ఆమోదం ప్రకటించడం లేదు. "అన్సారీ" (కాంగ్రెసును బలపరిచే జమియత్-ఉల్ ఉలేమాల పత్రిక) యిలా రాసింది :

"ఇది (విడిపోయే హక్కు యివ్వకపోవడం, నియోజకవర్గాల సమస్యను తిరిగి పైకి తేవడం) ముసల్మానులలో విశ్వాసాన్ని కలిగించదు....ముసల్మానులుగాని, ముస్లింలీగ్ గాని ఆ కమిటీకి సహకారం చేయరు... కాంగ్రెసు-ముస్లింలీగ్‌ల మధ్య రాజీ కుదర్చడానికి యీ కమిటీ ప్రయత్నించియున్నట్లయితే, దేశానికి కొంతమేలు కలిగి యుండేది."

"రోషనాహింద్" ముస్లింలీగ్ రాజకీయాలతో తీవ్రమైన భేదాభిప్రాయాలుగల పత్రిక. అది సప్రూకమిటీ సూచనలపై యిలా వ్యాఖ్యానించింది." భారతదేశం అంతా ఏకఖండంగా ఉండాలని మా అభిప్రాయం. కాని, ముస్లిం ప్రజలు కోరినట్లయితే, వారు మెజారిటీగావున్న ప్రాంతాల్లో తమ సొంత ప్రభుత్వాన్ని, పాకిస్తాన్ రాజ్యాన్ని, ఏర్పరచుకునే హక్కు ఉండితీరాలి. అదే ప్రజాస్వామ్య విధానం."

హిందూమహాసభ పత్రికలు

ఈవిధంగా, పాకిస్తాన్ సూత్రాన్ని వ్యతిరేకించే ముస్లిం వర్గాలూ, లీగ్ పత్రికలూ కూడా సప్రూకమిటీ సూచనలపట్ల వ్యతిరేక వైఖరిని ప్రకటిస్తూంటే, హిందూమహాసభ ఘోషను చూద్దాం. ఒకవైపు, పాకిస్తాన్‌కోర్కెను సప్రూకమిటీ నిరాకరించినందుకు సంతోషం వెలిబుచ్చుతూ, మరొకవైపు జాతీయ ప్రభుత్వంలో హిందువులకు - ముస్లింలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలనడం హిందువులకు ద్రోహంచేయడం తప్ప మరొకటి కాదని వాదిస్తున్నారు. అంతకంటె బ్రిటిష్ పరిపాలనే మంచిదని "వీర" సవార్కార్ ప్రకటిస్తున్నాడు. ముస్లింలను సంతోషపెట్టడానికి చేసే యీ ప్రయత్నాలన్నీ హిందువులకు అరిష్టదాయకమే నంటూ "నేషనలిష్టు," "హిందూస్తాన్", "ట్రిబ్యూన్" మొదలైనహిందూమహాసభ పత్రికలు రాస్తున్నాయి.

దీన్నిబట్టి, ముసల్మాన్‌లను హిందువులు అణచియుంచడమే హిందూమహాసభ ఆశయమని తేటతెల్లమవుతోంది.

కాంగ్రెసువర్గాల ధోరణి

ఇక కాంగ్రెసు వర్గాల విషయం. గాంధీజీ అంగీకరించినంత వరకైనా ముస్లింజాతుల స్వయంనిర్ణయ హక్కును అంగీకరించనందుకు సప్రూ కమిటీని కాంగ్రెసు పత్రికలు ఖండించలేదు. "హిందుస్తాన్ టైమ్సు", "హిందు", "అమృతబజార్ పత్రిక", "బొంబాయి క్రానికల్" మొదలైన పత్రికలు, పాకిస్తాన్ సూత్రానికి ప్రత్యామ్నాయంగా సప్రూకమిటీ కొన్ని సిఫార్సులు చేసినందుకు అభినందించాయి. "హిందుస్తాన్" పత్రిక (ఢిల్లీ) మరొక అడుగు ముందుకువేసింది. సప్రూకమిటీ సూచనలను భారత రాజకీయ పక్షాలన్నీ అంగీకరించనైనా అంగీకరించాలి; లేదా మరొక కొత్త ప్రణాళికనైనా తయారుచేయాలి - ఏదీచేయకపోతే, బ్రిటిష్ పరిపాలనను అంగీకరించడం తప్ప గత్యంతరం లేదని రాసింది; సప్రూకమిటీ సూచనలను బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే ఆచరణలో పెట్టవలసింద"ని కోరుతూ "హిందుస్తాన్" (ఢిల్లీ) పత్రికయొక్క ప్రత్యేకవిలేఖరి రాస్తున్నాడు!

బ్రిటిష్ వర్గాలలో

"ఎకానమిస్టు" బ్రిటిష్ పెట్టుబడిదారుల పత్రిక. సప్రూకమిటీ సూచనలపై అదిచేసిన వ్యాఖ్యానం చూదాం. భారతదేశం ఏకఖండంగా వుండి, కేంద్రంలో బలమైన ప్రభుత్వమున్నపుడే ఆదేశాన్ని ఆర్థికంగా అభివృద్ధిచేయగలమని "ఎకానమిస్టు" రాసింది. భారతీయులు తమ సమస్యను పరిష్కరించుకొనగలరమకోడం వట్టి భ్రమట! బ్రిటిష్ ప్రభుత్వమే ఒక నిర్ణయానికి రావాలట!

ఇదే ధోరణిలో ఇతర బ్రిటిష్ టోరీపత్రికలు వ్యాఖ్యానిస్తున్నాయి. లండన్‌నుంచి ప్రతిరోజూవచ్చేవార్తలను బట్టిచూస్తే కూడా లండన్‌లో వేవెల్ సంప్రతింపుల ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వమొక ప్రకటన చేసేటట్లుంది. కాని మన దేశంలో కాంగ్రెసు - లీగు ఐక్యత కుదరనిదే ఆ ప్రకటన ప్రయోజనకారిగా వుండదని తెలుస్తోంది. అట్టి ప్రకటనతో బ్రిటిష్ ప్రభుత్వం ప్రపంచాన్ని మోసపుచ్చాలని ప్రయత్నించొచ్చు. ఈ యెత్తు పారకుండా చేయాలంటే, కాంగ్రెస్ - ముస్లింలీగ్‌లమధ్య ఒడంబడిక అవసరం. ముస్లింజాతుల స్వయంనిర్ణయ హక్కుని కాంగ్రెసు అంగీకరించినప్పుడే, అది సాధ్యమవుతుంది. శాన్‌ఫ్రాన్‌సిస్కో మహాసభకు మన ప్రజాప్రతినిధుల్ని పంపుకొనే శక్తికూడా అప్పుడే మనకు లభిస్తుంది.

('పీపుల్సు వార్' నుండి)

ముస్లిం వేసవి విద్యాలయం

చందోలులో మే 12 నుండి

ఆంధ్రరాష్ట్ర ముస్లిం వేసవి విద్యాలయం గుంటూరుజిల్లా చందోలులో 12-5-45నుండి ప్రారంభమై 10 రోజులు నడుపబడును. హైదరాబాద్, మద్రాసు, ఆలిఘర్ నగరాలనుండి ప్రముఖులైన ఉపన్యాసకులు వస్తారు. ఆంధ్రజిల్లాలలోని 11 లక్షల 30 వేల ముస్లిం ప్రజాసామాన్యంలో మన సాంఘిక, రాజకీయ సూత్రాలనుగూర్చి ప్రచారంచేయడానికి, ముస్లింల విజ్ఞానాన్ని పెంపొందించడానికి యీ పాఠశాల నడుపబడుతోంది.

ఇందులో చేరువారు 1-5-45 లోగా తమ దరఖాస్తులతో పాటు రు 5-0-0 లు ప్రవేశరుసుమును పంపాలి. 10 రోజులకు సరిపోవు నోటుపుస్తకాలు, దుస్తులు తెచ్చుకొనాలి. బస, భోజన సదుపాయాలు ఉచితం.

ముగింపురోజున ఇంగ్లీషు, ఉరుదు ఉపన్యాస పోటీలలో గెలుపొందినవారికి బహుమతు లివ్వబడతాయి. ముస్లిం విద్యార్థులు, యువకులు, లీగ్ వర్కర్లు తప్పక పాఠశాలలో చేరుటకు ప్రయత్నించాలి. ముస్లింసోదరు లెల్లరు మాకార్యక్రమం జయప్రదమయేలాగున సహాయపడవలెనని ఆశిస్తున్నాను.

చందోలు.— మద్రాసు-బెజవాడ రైలులో నిడుబ్రోలు రైలుస్టేషనుకు 6 మైళ్లలో ఉన్నది. బస్సు, జట్కా సదుపాయాలున్నవి.

ఇట్లు,

ప్రిన్సిపాల్,

యం. ఏ. సలాం, బి. ఏ. బి. ఎల్. గుంటూరు.

ఉత్తర ప్రత్యుత్తరాలకు :

యస్. మహబూబ్,

సెక్రటరీ, ఆర్గనైజింగుకమిటీ, జిల్లాముస్లింలీగ్,

చందోలు, గుంటూరుజిల్లా.

★ సంపాదకీయం

"మే" దినోత్సవం

ప్రపంచమంతటిని చుట్టబెట్టాలని బయలుదేరిన నాజీ రాక్షసుని రోజులు దగ్గరబడ్డాయి, ప్రపంచప్రజలకు విపత్తు ఘడియలు దాటిపోయాయి. మిత్రసైన్యాలు జర్మనీ నదిగడ్డపై ప్రవేశించి, నాజీ మృగాలను నాశనం చేస్తున్నాయి. రేపో మాపో ఎర్రసైన్యం బెర్లిన్ నగరంపై విజయపతాకం ఎగురవేయబోతూంది.

ఇలాంటి సమయంలో మనం 1945 మే దినోత్సవాన్ని జరుపబోతున్నాము. ప్రపంచమందలి కష్టజీవులు దాస్య విముక్తికొరకు సాగించిన ప్రథమ విప్లవ పోరాటాలకు చిహ్నమే మేదినోత్సవం.

మేదిన సందేశంలో చైతన్యం పొందిన కష్టజీవులు ప్రపంచంలో 6 వ భాగంలో కార్మిక - కర్షక రాజ్యాన్ని స్థాపించుకొన్నారు. ఈ కార్మిక కర్షక రాజ్యమే నేడు ప్రపంచ ప్రజలకు నాయకత్వం వహించి, లోకవిపత్తును తొలగించింది. ప్రజావిజయాన్ని సాధించబోతూంది.

గత 6 యేండ్ల యుద్ధఫలితంగా మనదేశంలో కార్మికులు అనేక యిక్కట్టుల పాలయ్యారు. ధరలు విపరీతంగా పెరిగాయి. కాని, జీతాలు, అధికధరల అలవెన్సులు మాత్రం ధరలతోపాటు పెరగలేదు. అందుచే కార్మికుని జీవితం దుర్భరమౌతూంది. ఐనప్పటికి భారత కార్మికులు తమ స్థానంలో నిలబడి పనిచేశారు. మాతృదేశానికి జపాను దుండగీడులవల్ల ఏర్పడిన ప్రమాదాన్ని పారదోలడానికి సహాయపడ్డారు.

భారతదేశ రైతులు, గ్రామప్రజలు పారిశ్రామిక వస్తువులు దొరకక బాధపడుతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంవల్ల బీదజనులకు మరీదొరకుటలేదు. బట్టలకరువు ఏర్పడింది. ఐనప్పటికి రైతాంగం కష్టాలకోర్చి, అధికంగా పంటలను పండించడానికి కృషిచేస్తున్నారు. అన్నదాతలై ప్రజలందరికి ఆహారం అందించుతున్నారు. కరువు పిశాచాన్ని పారదోలుతున్నారు.

నేడు కార్మికులు బట్టలు వగైరా వస్తువులను విరివిగా ఉత్పత్తి చేయాలి. రైతులు ఆహారధాన్యాలను విరివిగా పండించాలి. కంట్రోలు ధరలకు వాటిని అందజేయాలని కార్మికులు, రైతులు ప్రజలందరు ఆందోళన చేయాలి. అధికలాభాలకోసం దొంగవ్యాపారం సాగించేవారిని ప్రజా ద్రోహులుగా ఎంచాలి. ఈ ప్రజా ద్రోహులను, వారికి సాయపడే లంచగొండులైన ఉద్యోగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వంపై ఒత్తిడిచేయాలి.

ప్రపంచ ప్రజా విజయానికి 1945 మే దినోత్సవం నాంది కాబోతూంది. అందుచే భారతీయులం పై కర్తవ్యాన్ని నెరవేర్చుటతో మే దినోత్సవ సందర్భంలో ప్రజా విజయానికి కారణమైన సోవియట్ ఎర్రసైన్యానికి అభివందనాలుపంపాలి.

విముక్తదేశాలలో స్వాతంత్ర్యం పొందిన ప్రజలకు మన అభివందనాలు తెలుపాలి. వారివలెనే మనదేశంలో కూడా ప్రజలందరి ఐకమత్యాన్ని నిర్మించి, భారత స్వాతంత్ర్యాన్ని సాధించుతామని ప్రతిన బూనాలి. నాయకుల విడుదలకొరకు, జాతీయ ప్రభుత్వం కొరకు కృషిచేయాలి. స్వేచ్ఛా ప్రపంచములో స్వతంత్ర భారత్‌ను నిర్మించి, మానవ కల్యాణానికి అవుసరమైన నోషలిజం పైపు పురోగమించుతామని కష్టజీవులంతా ప్రతిజ్ఞచేయాలి.

★ యుద్ధ సమీక్ష

తాపీ మోహన్‌రావు

బెర్లిన్‌లో రెడార్మీ

★

అది బెర్లిన్. నాజీకాలకూట విషపుంజం. ఆస్ట్రియా, జకోస్లోవేకియా, పోలెండు, డెన్మార్కు, నార్వే, బెల్జియం, హాలెండు, ఫ్రాన్సు దేశాల ప్రజలను దుర్భర యాతనల పాల్జేసిన విషసర్పాల కది ఉనికిపట్టు. విశ్వ మానవజాతి స్వాతంత్ర్యాన్ని కబళింప నెంచిన కౄరత్రాచుకది ఆస్థానం.

నేడా బెర్లిన్ సివారుల్లోకి రెడార్మీ ప్రవేశించింది. హుంకరించి ముందుకురుకుతూంది. బెర్లిన్ నడిగడ్డకు రెండు మైళ్ళ దూరంలోనే సోవియట్ వీరుల కత్తుల తళతళ. సోవియట్ ఫిరంగిగుళ్ళు నాజీ రాక్షసుల గుండెకాయను పగులగొడుతున్నాయ్. ఈ శుభవార్తకోసమే ప్రపంచ ప్రజలు ఆరేళ్ళుగ ఎదురుచూచారు. ప్రపంచ శ్రేయోభిలాషులందరూ ఆశించిన దీఅంతిమ విజయ పరంపరలే. నాజీ కిరాతకులు పెట్టిన యమయాతనలను నాలుగేండ్లపాటు భరించగల శక్తిని అక్రమిత సోవియట్ ప్రాంతాల ప్రజలకిచ్చిందీ ఆశే. నేడా ఆశఫలిస్తూంది. అనతికాలంలో సోవియట్ విజయపతాకం, ప్రపంచప్రజల స్వాతంత్ర్యారుణపతాకం బెర్లిన్‌పైన సగర్వంగా మెగురుతుంది. నాజీ కాలకూట విషం అధఃపాతాళంలో పాతిపెట్ట బడుతూంది.

★

బెర్లిన్‌కి ఈశాన్యం, తూర్పు, దక్షిణ దిక్కులుగ, అర్ధచంద్రాకారంలో రెడార్మీ విజృంభిస్తూంది. ఈ దండయాత్రను మార్షల్ స్టాలినే స్వయంగా నడుపుతున్నాడని వదంతి. బెర్లిన్ సివారుల్లో 16 పేటలు రెడార్మీ వశమయాయి. దక్షిణ సివారులో ఉన్న ప్రధాన విమానాశ్రయం కూడా రెడార్మీ చేజిక్కింది. బెర్లిన్ని చుట్టుముట్టి నలగకొట్టడానికి రెడార్మీ వ్యూహం పన్నింది. ఈ దండయాత్రను నాజీలు మొండిగా ఎదుర్కొంటున్నారు. ఇతర రంగాలనుండి కూడా సేనల్ని ఇటు మళ్ళిస్తున్నారు.

ఇదేసమయంలో దక్షిణాన కాట్బస్ — గార్లిట్జ్ నగరాల మధ్య మార్షల్ కోనీవ్ సేనలు విజృంభించి, డ్రెస్డెన్ మీదికి పోతున్నాయి. ఆనగరానికి 14 మైళ్ళ దూరంలోకి వచ్చేశాయి.

డ్రెస్డెన్ రంగంలో ఇలా ముందుకురుకుతూన్న రెడార్మీకి 35 మైళ్ళ దూరంలోనే ఉన్నాయి అమెరికన్ సేనలు. అవి కూడా డ్రెస్డెన్ మీదికి వస్తున్నాయి. ఈమధ్యనున్న జర్మన్ ప్రదేశంలో ప్రతి అంగుళం కూడా ఎడాపెడా కురుస్తున్న గుండ్లవర్షానికాహుతి అవుతూందట. ఈ రంగంలో రేపోమాపో రెడార్మీ, అమెరికన్ సేనలు కరస్పర్శ చేసుకుంటాయంటే అతిశయోక్తికాదు.

వియన్నాను ఆక్రమించుకున్న మార్షల్ టాల్బుకిన్ సేనలు లిన్జ్‌నగరంమీదికి పోతున్నాయి. హిట్లరు తన కడపటి స్థావరంగా నిర్ణయించుకున్న బవేరియారాష్ట్రానికి నగరం ఒక సింహద్వారం వంటిది. మార్షల్ మాలినోవ్స్కీ సేనలు జెకోస్లోవేకియాలో ముందుకురుకుతున్నాయి.

అటు అమెరికన్ సేనలు జెకొస్లొవేకియా సరిహద్దునుదాటి ముందుకు వచ్చాయి. ఈ రంగంలోకూడా త్వరలోనే మిత్రసేనావాహినుల సంగమం జరగ గలదు.

మిత్రరాజ్య సేనలు కూడా ఈ వారంలో అమోఘ విజయాలు సాధించాయి. నాజీపార్టీ వార్షికసమావేశాలకు రంగస్థలమయిన నూరెంబర్గు అమెరికన్ల చేజిక్కింది. నాజీపార్టీకిపుట్టినిల్లయిన మ్యూనిక్ నగరం ఈ సేనలకు 50 మైళ్ళదూరంలోనే ఉంది. లీప్జిగ్, మాగ్డెబర్గు నగరాలు మిత్రసేనల వశమయాయి. ఉత్తరాన బ్రిటిష్ సేనలు హాంబర్గు రేవుపట్టణాన్ని ప్రవేశించాయి.

ఈ దృశ్యాన్నంతటినీ చూచి గోబెల్సు, "ఒక గొప్ప విషాదాంత నాటకంయొక్క కట్టకడపటి రంగంలో ఉన్నాము"ని బావురుమంటున్నాడు. నిజం. ఇది కట్టకడపటి రంగమే. అందుకనే, నాజీపార్టీమూలపురుషుల్లోఒకడూ, హిట్లరుని మొట్టమొదట పైకితెచ్చిన వాడూ అయిన పాపెన్ కావాలని అమెరికన్ సేనలకు పట్టుబడ్డాడు. జర్మన్ బ్యాంకుయొక్క మూలధనమంతా అతి సునాయాసంగా మిత్రసేనల వశమయింది. అందుకనే హిట్లరు, మొన్నటి తన ఉపన్యాసంలో మిత్రసేనలను ప్రతిఘటించవలసిన అవసరాన్నే పేర్కొనలేదు; రెడార్మీని మాత్రం దాపుకు తెగించయినా ఎదుర్కోవాలని బొబ్బరించాడు. ఇటు ఆస్ట్రియా, జకొస్లొవేకియా రంగంలో జర్మన్లు రోజుకు పదిసార్లుకూడా ఎదురుదాడులు చేస్తుంటే - అటురూర్ రంగంలో రోజుకి 45000 మంది చొప్పున తెల్లజెండాలెత్తి మిత్రసేనల ఖైదీ శిబిరాలకు చకచకా నడిచిపోతున్నారు. పశ్చిమరంగంలో ఒక్క 16వ తేదీనే 1,12,038 మంది జర్మన్ సైనికులు ఖైదీలయారంటే రెండు రంగాల్లోను పరిస్థితులెలా ఉన్నాయో ఊహించవచ్చు.

ఇది కట్టకడపటి రంగం అని గ్రహించే హిట్లరు ఇలా చేస్తున్నాడు. తనను సర్వనాశనం చేయ కంకణం కట్టుకొన్న రెడార్మీ అంతిమ యుద్ధం ప్రారంభించింది. ఆ రెడార్మీ నాయకులతో రాజీ అసంభవమని తనకు తెలుసు. కాని, ఇటు మిత్రరాజ్య పక్షంలో లోగడ తనకు జెకోస్లోవేకియాను, ఆస్ట్రియాను బలిదాన మిచ్చిన గ్రహాలింకా బాధ్యతగల స్థానాల్లో ఉన్నారని తెలుసు. ఈ పాపెన్ మొదలైనవారు పట్టుబడడం వీరితో రాయబారాలకోసమే; ఈ జర్మన్ మూలధనం అంత సులభంగా వప్పజెప్పడం వీరికి లంచం క్రిందనే. వీరి ప్రాబల్యంద్వారా తానూ, తన మూకా బ్రతికి బయటపడగలమని హిట్లరు కట్టకడపటి ఆశ. కాని, బ్రిటన్, అమెరికా, సోవియట్ ప్రజలమధ్య నున్న ఐకమత్య బలం ముందు ఈఆశలు అడియాశలుకాక తప్పవు. క్రిమియా నిర్ణయ ప్రకారం యావత్తు జర్మనీ మిత్రరాజ్యాల ఆక్రమణ క్రిందికి రాకతప్పదు. నాజీమూక సర్వనాశనం కాకతప్పదు. 28—4—1945

7 వ కృష్ణాజిల్లా మహిళా మహాసభ

కొటూరు : ఏప్రిల్ 29, 30

ఆధ్యక్షులు : డాక్టరు అచ్చమాంబ

ప్రారంభకులు : హాజరా బీగం

(అఖిల భారత మహిళాసభ కార్యవర్గ సభ్యురాలు)

పతాకోత్సవం : శ్రీమతి పెద్దాడ కామేశ్వరమ్మ

ఆరోగ్యశిశు ప్రదర్శన ప్రారంభకులు :

డాక్టరు ద్వారాకాబాయి యం. బి. బి. యస్.

లేడీహోప్ కాలేజీ (గుంటూరు) ప్రిన్సిపాల్ శ్రీమతి సరోజినీదేవిగారు శిశుప్రదర్శనంలోను, పాటల పోటీలోను గెలుపొందినవారికి బహుమతులిస్తారు. శిశుప్రదర్శనంతోపాటు గర్భిణీ స్త్రీలు పాటించవలసిన ఆరోగ్యవిధులు, శిశుపోషణ విధానం మొదలైనవి వివరించబడును. వైజ్ఞానిక ప్రదర్శనలుకూడా ఉంటాయి. సోదరీమణులు వేలకువేలు మహాసభకు రావాలి. వచ్చేవారు తమ తమ బళ్ళలో పెరుగు, పప్పులు, కూరగాయలు, విస్తళ్ళు తెచ్చి మహాసభకు తోడ్పవాలి.

— వె. అన్నపూర్ణాదేవి

5 వ కృష్ణాజిల్లా వ్యవసాయకూలీ మహాసభ

నిడుమోలు

★

మే 1 వ తేదీ మంగళవారం

అధ్యక్షులు : గుంటూరు బాపనయ్య

ప్రారంభకులు : చండ్రరాజేశ్వరరావు

పతాకోత్సవం : చల్లపల్లి నారాయణరావు

ఉపన్యాసకులు : పుచ్చలపల్లి సుందరయ్య

నండూరి ప్రసాదరావు

వైజ్ఞానిక ప్రదర్శనాలుంటాయి

నిడుమోలు 20—4—45 } కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీసంఘం.

గమనిక :— నిడుమోలు బందరు - బెజవాడ రోడ్డుమీద నున్నది. ప్రతినిధులు ఉదయం 7 గంటలకే చేరుకోవాలి.



కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు కలిసివచ్చేలాగ చేయవలసినది ప్రజలే

సప్తమ గుంటూరుజిల్లా రైతు మహాసభకు ప్రారంభోత్సవంచేస్తూ కామ్రేడ్ పి. సి. జోషి ఇలా అన్నారు :

రైతు సోదర సోదరీమణులారా !

కమ్యూనిస్టుపార్టీ తరపున — విప్లవ వర్గాలయిన కార్మిక కర్షకుల పార్టీతరపున ఇవే మీకు నా అభివందనాలు.

మేము అఖిలభారత రైతుమహాసభను చూచుకొని ఇప్పుడే వస్తున్నాం. అక్కడ వివిధరాష్ట్రాల్లో రైతుఉద్యమాన్ని పర్యాలోకించాము. ఏయేరాష్ట్రంలో రైతుసంఘం ఎంతెంత బలంగా ఉందో, అంచనావేశాం. బెంగాల్, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాలదే అగ్రస్థానం అని నిర్ణయానికి వచ్చాం. ఇంతబలమైన ఉద్యమాన్ని నిర్మించిన మీకు నావిప్లవాభివందనాలు.

ఈ రెండు రాష్ట్రాల్లోను రైతుఉద్యమం రెండు గడ్డు సమస్యల నెదుర్కొంది. బెంగాల్లో విలయనృత్యం చేసిన కరువుదేవత నెదుర్కొంది: దానివాతబడి విచ్ఛిన్నమైన గ్రామజీవనాన్ని పునర్నిర్మించడానికి నడుంబిగించింది. బెంగాల్ కరువులాంటి కరువు రాకుండా చేయడానికి ఆంధ్రరాష్ట్రంలో మీ రైతుసంఘం అహోరాత్రులు పాటుపడింది. కరువును తెచ్చిపెట్టగల దుష్టగ్రహాల ఆటలను ఆదిలోనే కట్టిపెట్టించడానికి కంకణం కట్టింది. ఈ కృషిలో రెండు రాష్ట్రాలూ బలిష్ఠమైన రైతు ఉద్యమాన్ని నిర్మించుకున్నాయి.

అధికపంటల ఉద్యమం

మీ రైతుసంఘం మీకిచ్చిన సందేశమేమిటి ? మీరు అన్నదాతలు - అధిక పంటలు పండిస్తే మీప్రజలను కరువుబాధల నుండి కాపాడుకోగలరు; కరువు వాతబడిన సోదర రాష్ట్రప్రజలకిన్ని మెతుకులు అందించగలరని విజ్ఞప్తిచేసింది. అది మీ పవిత్ర కర్తవ్యమని ఉద్బోధించింది.

ఇలా అధికాహారోత్పత్తికి ప్రోత్సహించి రైతుసంఘం మీకేమిచేసిందో చూదాం. గత సంవత్సరం మీరు సాగించిన ఆందోళన ఫలితంగా వేలకొంది యకరాల బంజరు సాగులోకి తీసుకొచ్చారు. సాధారణంగా రైతులు ఉన్న భూమి అంతా తమకే కావాలనుకోడం సహజం. కాని, ఈసారి రైతుల స్వలాభానికి కాకుండా వ్యవసాయ కూలీలకు, భూమిలేని బీదరైతులకు ఈ బంజరందింది. ఇది మీకృషి ఫలితం. అంతేకాదు. ఎస్టేటుల్యాండు చట్టాన్ని కూడా సవరింపించారు. ఈ ఉద్యమం ధనిక రైతుల స్వార్థంకోసంకాదని బీదరైతులూ, వ్యవసాయకూలీలు గుర్తించారు. అందువల్లనే వ్యవసాయకూలీ సంఘం ఈ ఉద్యమానికి చేయూత నిచ్చింది. ఇది రైతాంగ చరిత్రలో అపూర్వం. ఈ విధంగా మీరైతు సంఘంగావించిన అధికాహారోత్పత్తి ఉద్యమ ఫలితంగా, ఆహారపంట అధికం కావడం మాత్రమేగాక, మీగ్రామ జీవితంలో రైతు-కూలీ సామరస్యం, శాంతిభద్రతలు నెలకొనే అవకాశం కూడా కలిగింది. ఇదీ గత సంవత్సరం గాథ.

ఈఏడు మీరు మరోగొప్ప విజయం సాధించారు. మైళ్ళ పొడుగున కాలవలు తవ్వారు. వందలకొలది చెరువులు మరమ్మతుచేశారు. ఇదివరకెన్నడూ లేనంతగ రైతులు నీటిసౌకర్యాన్ననుభవించారు. ఇదంతా $1\frac{1}{2}$ లక్షకు పైగా సభ్యత్వం గలరైతుసంఘ కృషిఫలితం. రైతుల్ని, వ్యవసాయ కూలీలను కార్యదీక్షకు పురికొల్పింది. మీక్షేమంకోసం, దేశ సౌభాగ్యం కోసం కాలవలుతవ్వించింది.



పి. సి. జోషి

దీని ఫలితంఏమిటి? పి. డబ్ల్యు. డి. శాఖకు అసాధ్యమైన దానిని మీ రైతుసంఘం సాధించిందని ప్రజాసామాన్యం గుర్తించింది. తమ పి. డబ్ల్యు. డి. శాఖ చేయలేని దానిని ప్రజాసంస్థలుచేయగలిగాయని ప్రభుత్వమూగుర్తించింది. ఫలితం? ప్రభుత్వం 20 లక్షలకిమ్మతుగల ముసుగుకాల్వల కంట్రాక్టులను రైతుసంఘం తీసుకుంటే యివ్వడానికి తయారుగఉంది. ఎంత మార్పు! నిన్న మొన్నటివరకు నీటి వసతులు కలిగించడానికి పి. డబ్ల్యు. డి. వారు రైతులనుండి లంచాలు గుంజేవారు. నేడు ఆ రైతుల సంఘశక్తిని గుర్తించి దానిసహకారాన్ని అర్థిస్తున్నారు.

ఇంకా అనేక విజయాలను మీరు సాధించారు. గత సంవత్సరం రు. 4 లక్షల విలువగల ఎరువులు మాత్రమే మీరు పొందగలిగారు. మిగతాదంతా దొంగమార్కెట్టులోకి పోయింది. కాని, ఈఏడు రు. 14 లక్షల విలువగల ఎరువులు మీకందాయి. ఎరువుల దొంగ మార్కెట్లకి తాళంపడింది. ఒక్క ఎరువుల విషయంలోనేకాదు. ఇనుప పనిముట్ల విషయంలో కూడా దొంగమార్కెట్టును చాలవరకు అరికట్టగలిగారు. ఈనాడు రైతుసంఘపు మనుషులంటే దొంగవ్యాపారులకు సింహస్వప్నంగా ఉంది. ఇన్నివిధాలుగ మీ సంఘం మీకు సేవజేస్తూఉంది. మీ శత్రువుల నెదుర్కొంటూంది. సౌఖ్యప్రదమయిన నూతన జీవితాన్ని స్థాపించడానికి, మీకు మరింత భద్రత చేకూర్చడానికి పాటుపడుతూంది.

నూతన సంస్కృతి

ఇంతేకాదు. రైతుయువకులు యువజన సంఘాలక్రింద సంఘటితం కావడం మీరు చూస్తున్నారు. ఈ సంఘాల క్రింద వారు కొత్త జీవితాన్ని అలవరుచుకొంటున్నారు. నూతన సంస్కృతిని పొందుతున్నారు. ఆరోగ్య పద్ధతులను అభ్యసిస్తున్నారు. రైతులకు, ప్రజా సామాన్యానికి ఎలాంటి కష్టాలు వచ్చినా, నివారించడానికి తమ సర్వశక్తులను వినియోగించగల సేవాదీక్షను ఈ సంఘాలు మీ యువకుల్లో నూరిపోస్తున్నాయి. మీచిన్నతనంలో మీ రూహించలేనటువంటి విషయాలనెన్నిటినో మీబిడ్డలు నేడీ యువజనసంఘాలద్వారా నేర్చుకొంటున్నారు.

పూర్వం మీ గ్రామ జీవితంలో మీకు పనికివచ్చే విజ్ఞానదాయకమయిన వినోదాలంతగా ఉండేవికావు. మత మౌఢ్యాలకు మరికొంత ప్రాణంపోసే గేయాలు మాత్రమే అప్పటి గ్రామజీవితంలోని అంశాలు. కాని, నేడో! మీకొమాళ్లు కొమార్తెలు కొత్తపాటలను, కొత్తఆటలను మీ జీవితంలోకి తెచ్చారు. మీనిత్య జీవితాన్ని గురించి పాడుతున్నారు. దానిలోని సాధకబాధకాలను గురించి నృత్యం చేస్తున్నారు. ఉజ్వల భవిష్యత్తును మీకళ్ళ ఎదుట చిత్రిస్తున్నారు. నూతన జీవితాన్ని గురించి, స్వాతంత్ర్యము, సౌఖ్యాభివృద్ధులను గురించి ఈఆటలను, పాటలను యువజన సంఘాలు నేర్పాయి. విజ్ఞానదాయకములయిన ఈ కొత్తఆటలు, పాటలు మీగ్రామ జీవితాన్ని నైతిక పతనంనుంచి కాపాడాయి. నూతన వికాసానికి, నూతనచైతన్యానికి అవకాశం కలిగించాయి.

ఈ నూతన వైజ్ఞానిక జీవితం మీకు మరో మేలు చేకూర్చింది. అధికాహారోత్పత్తిద్వారా మీరు పట్టణ ప్రజల గౌరవాభిమానాలను చూరగొన్నారు. అంతకంటేకూడా ఎక్కువగా, మీ బిడ్డలు పాడే ఈ ఆటలు-పాటలు పట్టణప్రజల మన్ననలనుసంపాదిస్తున్నాయి. ఇంతవరకు పట్టణప్రజల విజ్ఞానమూ, సాహితీ కృషి అంతా తమసొత్తే అన్నట్లు ప్రవర్తించేవారు. 'పల్లెటూరివాళ్ళం'టూ మిమ్మల్ని చులకన చేసేవారు. కాని ఈనాడు వారి కలాలు తుప్పుపట్టిపోయాయి. నూతన జీవితం తొణికిసలాడే రచనలు సాగించేశక్తి వారిలో కనబడడంలేదు. కాని మీబిడ్డలా కొరతను తీరుస్తున్నారు. ఒకప్పుడు వైజ్ఞానిక రంగంలో తామే మార్గదర్శకులమని మిట్టిపడిన పట్టణ మేధావులు భవిష్యత్ స్వాతంత్ర్య జీవితాన్ని గురించి మీబిడ్డలు పాడుతూ, ఆడుతూ ముందుకురుకుతూంటే, వారు ఆదరానురాగాలతో చూస్తూ వెనుకవస్తున్నారు.

ఈనాడు మీరైతుసంఘం ఇంతబలిష్ఠమై, ఇన్ని ఘనకార్యాలు చేయగలుగుతూందంటే మీబిడ్డలు ప్రారంభించిన ఈ వైజ్ఞానిక కార్యక్రమం చాలవరకు కారణం. మీ బిడ్డల ఆటలు, పాటలు రైతుసేవకులను అధికతర కార్యదీక్షకు పురికొల్పాయి. తండోపతండాలుగ నూతన సభ్యులను సంఘంలోకి ఆకర్షించాయి. ముఖ్యంగా స్త్రీలను మీ ఉద్యమంలోకి, స్వాతంత్ర్యసమరంలోకి ఆకర్షించాయి.

గుర్తుపట్టలేనంత మార్పు

నేను చాలదూరంనుంచి ఎందుకువచ్చానో తెలుసా ? మీ రైతుసంఘం నాయకత్వాన మీరు ఎంతో మారిపోతున్నారు. మీ గ్రామజీవితంగుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ఇది మీకు బాగాతెలుసు. ఈ మార్పును చూడ్డానికి వచ్చాను. పది పన్నెండేళ్ళక్రితం ప్రజా సేవకులు అరుదు. నేడు వేలాదిగ ఉన్నారు. అప్పుడప్పుడు జైళ్ళకువెళ్ళడంతో తృప్తపడడం కాకుండా, తమ యావజ్జీవితాన్ని ప్రజాసేవకు స్వాతంత్ర్య పోరాటానికి అంకితంచేసి, అవసరమయితే ఆత్మార్పణ చేయడానిక్కూడా సిద్ధంగాఉన్న యోధులు వేలకొలదిగ ఉన్నారు.

అయిదారేళ్ళక్రితం మీ గ్రామజీవనం పార్టీ కక్షలతోనిండి ఉండేది. ఆ కక్షలను అవకాశంగా తీసుకొని మునసబులు, కరణాలు, పెత్తందార్లు మీమీద స్వారీ చేసేవారు. వాళ్ళ మాటే వేదంగా ఉండేది. కాని, నేడు రైతు సంఘాల ప్రభావంవల్ల కక్షలంతరించుతున్నాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తున్నాయి, రైతుసంఘాలు. వాటి మాటకు ఎదురులేదు. ప్రజాసేవ అనే ప్రాతిపదికపైని గ్రామంలోఉన్న మంచివారినందరినీ సంఘటితపరచడంవల్లనే రైతుసంఘాలకింత ప్రాబల్యం లభించింది. ఈ ప్రాబల్యంవల్ల గ్రామజీవితంలో సౌఖ్యప్రదమయిన నూతనదశ ప్రారంభమయింది.

నా విజ్ఞప్తిని కాలదన్నారు

ఇంతింతలు సాధిస్తున్నాయి మీ రైతు సంఘాలు. మీ గ్రామజీవితాన్ని ఒక్కొక్కమెట్టుగ పైకి తీసుకుపోతున్నాయి. చిత్తశుద్ధి గలవారందరూ దీనిని గుర్తిస్తున్నారు. కాని కొందరు దీనిని అంగీకరించడంలేదు. పైగా యీసంఘాలను విచ్ఛిన్నం చేయడానికి పూనుకొంటున్నారు. ముఖ్యంగా జైలునుండి విడుదలయిన కాంగ్రెసునాయకుల ధోరణి చాల శోచనీయంగా ఉంది. మనలో మనకున్నభేదాభిప్రాయాలను అలాఉంచి, దైనందిన సమస్యలపై ప్రజల క్షేమంకోసం కలిసి పనిచేదామని బెజవాడ మహాసభలో నేను వారిని ప్రార్థించాను. కాని ఆ నాయకులు నన్నో అంటరాని వానిగ చూచారు. నాతో మాట్లాడ్డానికి సరోజినీదేవికి, జవహర్లాల్ నెహ్రూకి, మహాత్మాగాంధీకి, ఎలాంటి అభ్యంతరం లేకపోయింది. కాని అయ్యదేవర కాళేశ్వరరావు వగైరాలకు నేనుఅంటరానివాడనయాను. పోనీ నేను పరాయిరాష్ట్రంవాడిని. మీ సుందరయ్య సంగతేమిటి? తనపదహారవ ఏటనుండీ ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొన్నాడతను. ఈ కాళేశ్వరరావు వగైరాల నాయకత్వంక్రిందనే అతనెంతో త్యాగంచేశాడు. కాని, ఆయనకూడా ఈ కాంగ్రెసువారికి పనికిరాలేదు. ఇలా ఎడమొగం పెడమొగంగా ఉండడం రైతాంగానికి, దేశానికి అనర్థదాయకమని బెజవాడ మహాసభలో లక్షమందిప్రజల యెదుట హెచ్చరికచేశాను. కాంగ్రెసువారికీ, మాకూ తల్లిదండ్రులయిన మీరు మమ్మల్నిద్దరినీ ఒక్క తాటిమీదికి తేవలసిన బాధ్యత ఉందని, దాన్ని నిర్వర్తించాలని ప్రార్థించాను.

కాంగ్రెసు : కమ్యూనిస్టుపార్టీ

మీ గుంటూరుజిల్లాలో కాంగ్రెసు చాల బలంగాఉంది. దాంతోపాటు రైతుసంఘమూ, కమ్యూనిస్టుపార్టీకూడా చాల బలంగా ఉన్నాయి. 1920 నుండి గుంటూరు ప్రజలు కాంగ్రెసునాయకత్వంక్రింద స్వాతంత్ర్యపోరాటంలో నిమగ్నులయి ఉన్నారు. నేటి కమ్యూనిస్టుపార్టీ సభ్యులందరూ ఈ ఉద్యమంలోంచి వచ్చినవారే. మీకందరకు తెలిసిన విషయమే ఇది. వీరు పార్టీలోకి వచ్చినప్పటినుంచి ఏంచేస్తున్నారు? (మిగతా 1? వ పేజీ)

వ్యవసాయాదాయాల పై పన్ను న్యాయసమ్మతమే

గుంటూరుజిల్లా రైతుమహాసభ తీర్మానాలు

గుంటూరుజిల్లా రైతుమహాసభ రెండవ రోజున, వివిధ తాలూకాలనుంచి వచ్చిన 150 మంది ప్రతినిధులు తీర్మానాలను చర్చించారు. సౌహార్ద్ర ప్రతినిధులుగా కృష్ణాజిల్లా నుంచి 10 మంది, పశ్చిమ గోదావరినుంచి ముగ్గురు, తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏగురు, కడపజిల్లానుంచి ఇద్దరు, చిత్తూరు నుంచి యిద్దరు, విశాఖజిల్లానుంచి 6 గురు, నిజాంరాష్ట్రంనుంచి ఒకరు, మలబారునుంచి ఇద్దరు కూడా సమావేశానికి హాజరయారు. ఈక్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి:

★

దేశసేవలోనూ, రైతుసేవలోనూ నిరంతరం కృషిచేస్తూ మరణించిన శ్రీ దండు నారాయణరాజు, కె. యస్. గుప్త, కామ్రేడ్ సూర్యనారాయణగార్ల మరణానికి సంతాపాన్ని వెలిబుచ్చారు. చీమూరు, అప్పి, కులశేఖరపట్నం, జాన్నూరు కేసుల్లో నిందితులపై ఉరిశిక్షలురద్దుచేయవలసిందని ప్రభుత్వాన్ని కోరారు. తెనాలిలో జరగవలసిన ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభనూ, గుంటూరు జిల్లాలో రాజకీయ ఊరేగింపులనూ, నిషేధించిన ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు:

వ్యవసాయాదాయాలపై పన్ను

పేదరైతులకు భారంగాఉన్న ప్రస్తుతభూమిశిస్తు విధానాన్ని పూర్తిగా మార్చవలెననీ, కనీస ఆదాయాన్ని మినహాయించి, ఆ పైన వచ్చు ఆదాయంపై వృద్ధిక్రమానుసారంగా పన్ను విధించవలెననీ, రైతుసంఘాలు చిరకాలంగా ఆందోళన చేస్తున్నాయి. అఖిలభారత కాంగ్రెసుసంఘమూ, ఇంకా అనేకమంది ఆర్థిక శాస్త్రవేత్తలూ యీ సూత్రాన్ని అంగీకరించే యున్నారు. ఈ సంవత్సరం మద్రాసు ప్రభుత్వం యీ సూత్రాన్ననుసరించివ్యవసాయాదాయంపై పన్ను విధించుటకు పూనుకొన్నందుకు సభవారు ఆమోదం తెలియపర్చారు.

కాని, అధికాదాయంపై పన్ను విధిస్తున్నా, ఆర్థికంగా లాభసాటిగాని వ్యవసాయంపై శిస్తును మినహాయించుటకు మద్రాసు ప్రభుత్వం పూనుకోనందువల్ల పేదరైతులపై పన్నులభారం ఆవిధంగానే ఉంటోంది. అందుచేత ప్రస్తుత భూమిశిస్తు విధానాన్ని పూర్తిగా మార్చవలెననీ, 250 రూపాయల నికరాదాయం గలవారిపై శిస్తును తొలగిస్తూ, అపై ఆదాయాలకు వృద్ధిక్రమానుసారంగా పన్ను విధించవలసిందని ప్రభుత్వాన్ని కోరారు.

వ్యవసాయాదాయంపై విధించు పన్నును వ్యతిరేకిస్తున్న రంగా, రామచంద్రారెడ్డిగార్ల చర్యను సభవారు ఖండించారు. వీరి ప్రకటనలు రైతాంగంయొక్క అభిప్రాయాన్ని వ్యక్తీకరించుటలేదనికూడ తీర్మానంలో తెలియపర్చారు.

రాజకీయ తీర్మానం

తర్వాత రాజకీయ పరిస్థితులపై తీర్మానం గావిస్తూ, కాంగ్రెసునాయకుల విడుదల విషయంలో అమెరీ, మూడీల వైఖరిని ఖండించారు. సరిహద్దురాష్ట్రంలో కాంగ్రెసు మంత్రివర్గస్థాపనకూ, అస్సాంలో సంయుక్తమంత్రివర్గస్థాపనకూ, సంతోషంవెలిబుచ్చారు. రోజురోజుకు విషమిస్తున్న ప్రజల ఆర్థిక జీవనాన్ని పునరుద్ధరించుటకై ప్రజా విశ్వాసం చూరగొన్న ప్రభుత్వం ఎంతేని అవసరమనీ, కాబట్టి కాంగ్రెసు నాయకుల విడుదలకొరకూ, కాంగ్రెసుపై నిషేధం తొలగించుటకూ తీవ్రాందోళన చేయవలసిందిగా ప్రజలను హెచ్చరించారు.

వివిధ రాష్ట్రాలలో జైళ్ళనుంచి విడుదలైన కాంగ్రెసు మంత్రులూ, అసెంబ్లీసభ్యులు తిరిగి మంత్రివర్గాలను ఏర్పర్చుటకై చేసే ప్రయత్నాలను బలపరిచారు. ఇలా ఏర్పడే మంత్రివర్గాలు రాష్ట్రంలోని వివిధపక్షాల సహకారం సంపాదించవలెననీ, ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించుటకూ, ప్రజలందరికీ తిండి, గుడ్డ దొరికేటట్టు చేయుటకూ పూనుకోవాలనీ అన్నారు.

కాంగ్రెసు - లీగులమధ్య ఐక్యత పునాదిగా భులాభాయి - లియాకత్ అలీఖాన్ గార్లకు జరిగిన తాత్కాలిక ఒడంబడికకు సభవారు హర్షించారు. సప్రూ సామరస్యసంఘంవారి సూచనలు సమంజసంగా వున్నాయన్నారు. గాంధీ - జిన్నా సంభాషణలు తిరిగి ప్రారంభించవలెననీ, స్వయంనిర్ణయ సూత్రంపైనా, రాజకీయాధికారం భారత ప్రజల హస్తగతం చేసుకొనే సూత్రంపైనా, ఒడంబడిక కుదుర్చుకొనుటకు దృఢనిశ్చయంతో పని చేయవలెననీ అన్నారు. అప్పుడే అమెరీముఠావారి అడ్డు అరికట్టగలమన్నారు.

పోటీ సంఘాలు

పోటీసంఘాలను గురించిన తీర్మానంలో కాంగ్రెసు అసెంబ్లీల తప్పుడుసంఘాను, రంగాముఠా పెచ్చిన్న చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ విచ్ఛిన్నప్రయత్నాలు జాతీయోద్యమాన్ని మరింత బలహీన పరుస్తాయన్నారు. రైతుల శ్రేయస్సునుగోరే ప్రతివారికి రైతు సంఘాలలో స్థానమున్నది కాబట్టి దేశభక్తులెల్లరూ రైతుసంఘాలలోచేరి ఐక్య రైతుపుద్యమాన్ని నిర్మించవలసిందిగా కోరారు.

ఆహారసమస్య

పల్నాడు, వినుకొండ, ఒంగోలు మున్నగు తాలూకాల్లో ఆహారపరిస్థితి ఒడుదుడుకులుగా ఉందనీ, మిగులు ప్రాంతాల్లో ధాన్యాన్ని సేకరించు విషయంలోగాని, తరుగు ప్రాంతాల కవసరమైన ధాన్యాన్ని సప్లయి చేయు విషయంలోగాని ప్రభుత్వ విధానం అసంతృప్తికరంగా ఉందనీ, తీర్మానంలో వెల్లడించారు.

ధాన్యానికి సక్రమమైన ధరలను నిర్ణయించటం, మిగులు ప్రాంతాల్లోని రైతుల నుండి ధాన్యాన్ని సరాసరి ప్రభుత్వమే కొనటం, ఈ ధాన్యాన్ని సక్రమంగా కొరత ప్రాంతాలకు పంపు యేర్పాట్లు చేయటం మొదలైన రాజబాటనువదలి, మిల్లుయజమానుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడుతున్న ప్రభుత్వ విధానం ప్రమాద భూయిష్ఠమైనదనీ, స్వేచ్ఛావ్యాపారాని కవకాశం కల్గించినచో దొంగవ్యాపారం తప్పకుండా హెచ్చుతుందనీ, రైతులకు సామాన్యమైన ధర గిట్టుబాటు కాకపోవటం, కొనుగోలుదారులుకూడ విపరీత ధరలను పెట్టవలసి రావటం సంభవిస్తున్నదనీ తీర్మానంలో తెలియపర్చారు.

ప్రభుత్వం మిగులుధాన్యాన్ని సేకరించుటకై జోనల్‌స్కీము నేర్పాటుచేసింది. మిల్లులకు ధాన్యపు సప్లయిలనూ, ప్రభుత్వానికి మిల్లుల వాళ్ళివ్వవలసిన బియ్యపుకోటాను గ్యారంటీ చేయుటకు యీ జోనల్‌స్కీము ఉద్దేశింపబడ్డప్పటికీ, స్వేచ్ఛా వ్యాపారానికి భంగం కల్గుతుందని దొంగవ్యాపారులూ, మిల్లుయజమానులూ చేసిన వ్యతిరేకాందోళన వల్ల ప్రభుత్వం ఆస్కీము నమలు పర్చుటలేదు. మిల్లులకు సప్లయి ప్రాంతాలనే నిర్ణయించింది కాని, మిగులు ధాన్యమంతా ప్రభుత్వానికే చేరునట్లు ఏర్పాటు చేయలేదు. అందువల్ల రైతులూ, కొనుగోలుదారులూ మిల్లుయజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తోంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే యీ క్రిందిచర్యలు తీసుకోవల్సిందిగా సూచించారు.

జిల్లాకలెక్టరు నిర్ణయించిన రు 11-11-0 ధర రైతుకు ఖచ్చితంగా గిట్టుబాటయ్యేటట్టు ప్రభుత్వం హామీయివ్వాలి.

జోనల్‌స్కీము నమలుపర్చాలి. ధాన్యసేకరణ సక్రమంగా జరుగుటకూ, మిల్లులకు సప్లయిచేసే ధాన్యానికి సరిపడు బియ్యాన్ని ప్రభుత్వమే తీసికొనుటకూ యేర్పాట్లు చేయాలి. ఈతనిఖీకై ప్రజాఆహారకమిటీలకు కూడ అధికారమివ్వాలి. మాగాణి, మెట్ట ప్రాంతాల సరిహద్దుల్లోఉన్న మిల్లులు ప్రభుత్వానుమతి లేనిదే కొనుగోలు, విక్రయం జరపకూడదని నిషేధించాలి. బియ్యంలో వడ్లు గడ్డలు లేకుండా చేసేబాధ్యత మిల్లులపైనే పెట్టాలి. ఆహారకమిటీలు సూచించిన వ్యాపారులనే బియ్యం అమ్మకానికి ఉపయోగించాలి. ఆహారకమిటీలు ధాన్యం కొని నిల్వచేయుటకు సంసిద్ధమైనచో లైసెన్సు లివ్వాలి. సేల్సుటాక్సు లేకుండా చేయాలి; మెట్టతాలూకాల్లో పిర్కాకు 6 కోఆపరేటివ్‌స్టోర్సులు స్థాపించి, వాటి ద్వారానే ఆహారధాన్యాలు సప్లయి చేయాలి. స్థానికంగా స్టోర్సు ఉన్నచోట్ల చిల్లర అమ్మకం కూడ స్టోర్సుకే ఇవ్వాలి. పేరు ధనం వెయ్యిరూపాయలున్న ప్రతిచోటా స్టోర్సు స్థాపన కనుమతించాలి. జిల్లా ప్రజాఆహారకమిటీకి ఆహారకొన్సిలులో ప్రాతినిధ్యం యివ్వాలి. ఆహారసమస్య విషమించకుండా తగు జాగ్రత్తలు తీసికొనుటకుగాను స్థానిక రైతుసంఘాలు యీ క్రింది కార్యక్రమంనిర్వర్తించవలసిందిగా తీర్మానించారు:

ప్రతి గ్రామంలోనూ ఆహారకమిటీలు స్థాపించాలి. గ్రామాల్లో మిగులు, తరుగు ధాన్యం లెక్కలుతీసి, ప్రభుత్వం మిగులు ధాన్యాన్ని కొనునట్లూ, తరుగు ధాన్యాన్ని తెప్పించునట్లూ కృషిచేయాలి. ప్రతి గ్రామంలోనూ ధాన్యంపండు పనూలుచేసి, నాము లేకుండా పేదరైతులకు, వ్యవసాయ కూలీలకూ అప్పులిచ్చునట్లుచూడాలి; దొంగవ్యాపారాన్ని తీవ్రంగా ఎదుర్కొనాలి. కొత్తకోఆపరేటివ్‌స్టోర్సు స్థాపించుటకూ, ఉన్నవాటిని సక్రమంగా పనిచేయించుటకూ తీవ్రప్రయత్నాలు చేయాలి.

అధికాహారోత్పత్తిని గురించి తీర్మానం కావిస్తూ దేశంలో కరువు కాటకాలు నానాటికీ వృద్ధి అవుతున్న యీరోజుల్లో, జపానుపై తిరుగుదాడి ప్రారంభంకానున్న యీక్లిష్టసమయంలో, ఆహారసమస్య విషమించకుండా దేశాన్ని కాపాడుటకై రైతాంగం పంటల నెక్కువ పండించడానికి మరింత తీవ్రంగా కృషి చేయవలసిందిగా హెచ్చరించారు. బంజరుభూమిని సాగులోకి తెచ్చుటకూ, ఎక్కువ ఎరువులు తెప్పించి రైతులకందజేయుటకూ, ఇనుము వ్యాపారంలో జరిగే అక్రమాలను పూర్తిగా నిరోధించుటకూ, తీవ్రముగా కృషిచేయాలని తీర్మానంలో తెలియపర్చారు. జలాధారాల మరమ్మతుకూ, నూతన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసినగ్రాంటులనుపూర్తిగా వినియోగపర్చునట్లు చూడవలెనన్నారు. ప్రభుత్వోద్యోగుల అశ్రద్ధను, లంచగొండితనాన్ని ఎదుర్కొని పనులన్నీ పూర్తయ్యేటట్టు చూడవలెనని రైతాంగాన్ని హెచ్చరించారు. నూతన వ్యవసాయ పద్ధతులను, మేలురకం విత్తనాలనూ, ఉపయోగించాలన్నారు.

అధికాహారోత్పత్తి కార్యక్రమం జయప్రదంగా సాగించాలంటే, రైతుకూలీ సామరస్యం చాల అవసరం. కూలీల న్యాయమగు కోర్కెలను రైతులు సఫలపర్చుటద్వారానూ, కూలీలు శ్రద్ధగా నేర్పరితనంతో పనిచేయుటద్వారాను, వ్యవసాయాభివృద్ధి కాగలదు. కాబట్టి రైతుకూలీ సామరస్యానికై విశేషంగా కృషిచేయాలన్నారు.

అధికాహారోత్పత్తి కార్యక్రమం జయప్రదంగా కొనసాగుటకై ప్రభుత్వం యీక్రింది కోర్కెలను నెరవేర్చవలసినదని తీర్మానించారు.

సాగుకు నీలయిచ్చే చెరువు పథకాలు, బోరంబోకలు వ్యవసాయ కూలీలకు, పేదరైతులకు యుద్ధానంతరం వరకూ శిస్తుమాఫీగా ఇవ్వాలి.

బంజరు సాగుచేసేవారికి మొదటిసంవత్సరము ఎరువులనూ, విత్తనాలనూ వుచితంగా యివ్వాలి.

ప్రతి పిర్కాలోనూ డిపోలనుపెట్టి ఎరువులు పంచాలి. వ్యవసాయపు అప్పులకుగాను యీజిల్లాకు పదిలక్షల రూపాయలను మంజూరు చేయాలి.

రాగిపైరుకూ, కూరగాయలకు అమోనియా సల్ఫేటును వ్యవసాయశాఖద్వారా కంట్రోలు రేటుకు అమ్మించాలి.

ఎరువులూ, వ్యవసాయ పరికరాలు సక్రమంగా పంపడానికి ప్రతి కేంద్రంలోనూ రివిన్యూ, వ్యవసాయశాఖ, రైతుసంఘ ప్రతినిధులుగల జాయింటుకమిటీలను ఏర్పర్చాలి.

జిల్లాలకు కనీసం ఏనిమిదివందల టన్నుల ఇనుప పనిముట్లనైనా వెంటనే సప్లయి చేయాలి

పైరిపేటు వర్తకులకు వచ్చు యినుమును వ్యవసాయ శాఖవారి పర్మిట్లు పొందినవారికే యిచ్చునట్లూ, వర్తకులు తమ స్టాకు లిస్టులను ప్రతిరోజూ ప్రకటించునట్లూ ఏర్పాటుచేయాలి.

ఎస్టిమేట్లు తయారైన కంద్లేరు, ఇసుకవాగు, కర్లపాలెం సైఫన్, బమ్మలమడక, మొదలగు ప్రాజక్టుల నిర్మాణానికి వెంటనే పూనుకోవాలి. కట్లపల్లి, నాగులేరు, చంద్రవంక, గుండ్లకమ్మ, ముసి, తుంగభద్ర, భట్టిప్రోలు డ్రైనేజిస్కీములకు వెంటనే ఎస్టిమేట్లు వేయాలి. జలాధారాల మరమ్మతులకై యివ్వబడే కంట్రాక్టు రేట్లను 50% పెంచాలి. జమీందారీ (మిగతా 14వ పేజీలో)

"ఐక్య రైతు ఉద్యమమే స్వాతంత్ర్య పోరాటానికి బలం"

గుంటూరుజిల్లా రైతుమహాసభలో కడియాల గోపాలరావుగారి అధ్యక్షోపన్యాసం

సోదర సోదరీ మణులారా!

గత మూడేళ్ళనుంచి ఆంధ్రదేశంలో మన రైతుఉద్యమం యెన్నో అవాంతరాలను గడిచి, ముందుకు నడిచింది. ఆహారసమస్యా పరిష్కారానికి పాటుబడింది. బెంగాలులో వలె ఆంధ్రలో కరువు వ్యాపించకుండాచేసి విశాఖజిల్లాను, రాయలసీమను కాపాడుటకు ముందునుంచీ తీవ్రకృషి చేసింది. ఈనాడు అత్యవసరమైన అధిక పంటలు పండించడానికి రైతుల్లో పనిచేస్తూంది. బంజరు భూముల్ని సాగులోకి తీసుకురావడంలోనూ, చెరువులనూ, కాల్వలనూ, మరమ్మతు చేయించడంలోనూ, వ్యవసాయ పరికరాలను కంట్రోల్ ధరలకు రైతుల కందించుటలోను, ఆదర్శ కృషిచేసింది. రైతులు తమంతట తామే కాల్వల మరమ్మతు చేసుకోవడంద్వారా అధికోత్పత్తిపట్ల తమ దీక్షను ప్రకటించారు. ఒక్క కృష్ణకాల్వలమరమ్మతువల్ల 40 వేల యకరాల భూమిసాగులోకి వచ్చింది. అన్నిజిల్లాల్లోను ఇర్రిగేషన్, ప్రాజెక్టులు, మురుగునీటి స్కీములపై తీవ్రాందోళన చేసి, చాలాభాగం 'ఎస్టిమేట్లు' తయారు చేయించగలిగింది. ఈనాముల అక్టుసవరణకై ఆందోళన జరిపి 3,000 గ్రామాలలో రైతుల జిరాయితీ హక్కును కాపాడగల్గింది. గత సంవత్సరం బెజవాడలో చారిత్రాత్మకమైన అఖిలభారత రైతుమహాసభను దిగ్విజయంగాజరిపి చరిత్రకెక్కింది. గ్రామాల్లో రైతు-కూలి సామరస్యానికి ఇతోధిక కృషి చేస్తూ, రైతుఉద్యమంతోపాటు, వ్యవసాయ కూలీ ఉద్యమ నిర్మాణానికి తోడ్పడింది. జాతీయ నాయకుల విడుదలకొరకు ఆందోళనచేస్తూ మారు మూలలనున్న గ్రామాలకు సైతం స్వాతంత్ర్య సందేశాన్ని అందజేసింది. ఇన్నివిధాలుగా ఆంధ్ర ప్రజాజీవితంలో మన రైతుసంఘం ప్రధాన ప్రజాసంస్థగా అభివృద్ధి చెందింది. 11 జిల్లాలలో, 52 తాలూకాల్లో, 2300 గ్రామాలలో 2 లక్షలవరకు సభ్యత్వం కలిగిఉంది. రైతుల జీవితంలో నిత్య సంబంధంకలిగి, రైతుల హక్కులకై పనిచేస్తోంది.

అట్టి రాష్ట్ర రైతుపుద్యమంలో మీ జిల్లా రైతుపుద్యమం ప్రధానభాగంగా అభివృద్ధి చెందింది.

పోటీసంఘాలు


కాని, మన సంఘాలకు వ్యతిరేకంగా పోటీసంఘాలుపెట్టి రైతుపుద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

1942లో ఆచార్య రంగాగారు రైతుసంఘాలను రద్దుచేసి రైతుఉద్యమాన్ని వెన్నుపోటు పొడిచారు. ఆ 42 లోనే విధ్వంసక కార్యక్రమం కాంగ్రెసే ఇచ్చిందని దాకాపూదిన అమెరీ వాదంతో ఏరు వంతగలిపారు. ప్రారంభంనుంచీ కాంగ్రెస్‌కి పోటీగా వాయకత్వంకోసం కృషిచేస్తూ వచ్చిన రంగాగారు నేడు పోటీ సంఘాలకు నాయకమ్మన్యులై నిలబడ్డారు.

రైతుపుద్యమానికి సంపూర్ణ వ్యతిరేకి ఐన అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారు వీరికి పూర్తిగా సహాయం చేస్తున్నారు.

రైతుసంఘం స్వతంత్ర వర్గ సంస్థగా ఉంచనవసరంలేదు. రైతులకు ప్రత్యేకంగా జండా ఉండనవసరంలేదు. ప్రతి రైతుసంఘ సభ్యుడూ కాంగ్రెసులో సభ్యుడై యుండాలి.

మనరైతుసంఘం 1928 లో పుట్టిన లగాయతు స్వతంత్ర వర్గసంస్థగానే అభివృద్ధి



పశ్చిమగోదావరిజిల్లా రైతుమహాసభలో పశుప్రదర్శనం

చెందుతూ వచ్చింది. నాటినుంచీ నేటివరకూ స్వతంత్ర వర్గసంస్థగా ఎన్నో పోరాటాలను నడిపి, రైతుల హక్కులను సాధించింది. రైతుల రక్తమాంసాలు పీల్చి పిప్పిచేసే జమీందారీ విధానాన్ని నాశనం చేయడమే రైతు సంఘాల ఆశయం.

1938 లో కాంగ్రెసుకూడా రైతుసంఘాలు పెట్టుకునే హక్కును గుర్తిస్తూ తీర్మానం చేసింది. 1937 లో కాంగ్రెసు అధ్యక్షుడైన పండిట్ నెహ్రూ 'దేశంలో సజీవమైన ఉద్యమం ఉండటానికి రైతుసంఘాల ప్రాముఖ్యతను' చెబుతూ ఒక దీర్ఘప్రకటన చేశారు. ప్రతి కిసాన్ సభ్యుడూ కాంగ్రెసు సభ్యుడై ఉండాలనడం సబబుకాదని పండిట్ నెహ్రూ స్పష్టీకరించారు. ఇప్పుడు రైతులకు స్వతంత్ర సంఘం అవసరంలేదనే వాదనను ఏరైతుగానీ, ఏరైతుశ్రేయోభిలాషిగానీ అంగీకరింపజాలడు.

అందరు రైతులకూ, రైతు సేవకులకూ ఈ రైతుసంఘంలో స్థానముంది. రైతుసంఘంలో చేరుటకు రాజకీయాభిప్రాయాలతోగాని, కుల మత విచక్షణతోగాని నిమిత్తం లేదు. ఏఒక్క రాజకీయ పార్టీకి తోకగాగాని, అనుబంధ సంస్థగా కాని రైతుసంఘాలులేవు. ముస్లింలీగ్ అనుచరులూ, కాంగ్రెసు అనుయాయులు, కమ్యూనిస్టుసభ్యులూ, హిందూ మహాసభ ఆశయం కలవారూ ఇందులో వున్నారు. ఉదాహరణకు: బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలలో హిందూ - ముస్లిం - సిక్కు రైతులు లక్షలాదిగా వున్నారు.

రంగా, కాశేశ్వరరావుగార్ల నినాదంప్రకారం ప్రతి కిసాన్ సభ్యుడు విధిగా కాంగ్రెసుసభ్యుడయి యుండాలనేది ఆచరణలో రైతుసంస్థకి ఎలాంటి బలహీనతను కల్గిస్తున్నదో ఆలోచించాలి. విధిగా కాంగ్రెసుసభ్యుడై వుండాలనే నియమము వస్తే, ఇతరరాజకీయపార్టీ అనుయాయులు, రైతులు, రాజకీయ చైతన్యంలేని రైతులు జారిపోవలసిందేకదా: ఇలా రైతుసంఘంలో చేరడానికి రాజకీయ పార్టీల ప్రణాళికను అంగీకరించాలనే షరతు పెడితే, ఒకొక రాజకీయపార్టీకి ఒకొక రైతుసంఘం ఏర్పడే పరిస్థితి కలుగుతుంది. ఒకే గ్రామంలో వివిధ రైతు సంఘాలుండవలసి వస్తుంది. ఇంతవరకూ నిర్మించిన ఐక్యరైతుపుద్యమం ముక్క చెక్కలౌతుంది. ఈనాడు మనం సాధించు కొంటూన్న ఏఒక్క విజయాన్ని మనంసాధించలేము. ఇలాబలహీనమైపోయిన ప్రజాసంస్థ జాతీయఉద్యమానికి ఎలా దోహదం చెయ్యగలుగుతుంది? ఐక్య రైతుపుద్యమమే స్వాతంత్ర్యపోరాటాన్ని ముందుకు తీసుకుపోగలుగుతుంది. గత 50 సంవత్సరాల జాతీయోద్యమ చరిత్రలోనూ, గత 10 సంవత్సరాల రైతుఉద్యమ చరిత్రలోను ఆహుతియైన వీరయోధులూ, అజ్ఞాతవీరులూ, మనకిచ్చిన మహోజ్జ్వల సందేశం ఏమిటి? ప్రజా ఉద్యమాలను నిర్మించడం, ఐక్యతను సాధించడం. ఇదే మన స్వాతంత్ర్య దీక్ష!! వారి సంతతి అయిన మనం ఐక్య ప్రజాఉద్యమాన్ని నిర్మించాలి. కాంగ్రెసు సత్సాంప్రదాయానికి విరుద్ధంగా, ప్రజా ఉద్యమాలకువ్యతిరేకంగా, పోటీసంఘాలను నిర్మించడం అంటే, మన రైతాంగానికి ద్రోహం చేయడం గాదా?

అందుచే రైతుసోదరులంతా యీ ప్రయత్నాన్ని ప్రతిఘటించాలి.

కమ్యూనిస్టుల పాత్ర

యీ పోటీసంఘాలనే పెట్టాలను ప్రముఖులు మన సంఘాలను కమ్యూనిస్టు సంఘాలనీ, కూలీల లాభాలకై మాత్రమే పనిచేసే సంఘాలనీ దుష్ప్రచారం చేస్తున్నారు. నేడాంధ్రదేశంలో ఉన్న దాదాపు 2 లక్షల రైతుసంఘ సభ్యులలో 3 వేల కమ్యూనిస్టులున్నారు. ఈ 3 వేలమంది కమ్యూనిస్టులు రైతుబిడ్డలు. ఆదర్శ యుతంగా రైతుసంఘ నిర్మాణానికి తీవ్రకృషి చేస్తున్నారు. ఐక్య ప్రజాఉద్యమాన్నినిర్మించుతూ రైతుల్లోస్వాతంత్ర్య ప్రబోధం చేస్తున్నారు. తమ యావత్ శక్తినీ, కాలాన్నీ, రైతు శ్రేయస్సుకొరకే వినియోగించుతున్నారు. కమ్యూనిస్టులు చేసే యీ కృషివల్ల రైతుసంఘం ఆర్థికంగాను, రాజకీయంగాను, ముందుకు పోతూంది. దీన్ని చూచి రైతుఉద్యమ వ్యతిరేకులు తమవిచ్చిన్న చర్యలకు తావులేదనీ, రైతు ఉద్యమం తమ చేయి దాటిపోయిందనీ, గాభరాపడి దుష్ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఈనాడు రైతుసేవకుల్లో ఎక్కువ కమ్యూనిస్టులువున్నా, అందరికీ అంగీకృతమైన రాజకీయతీర్మానాలే రైతుసంఘం చేస్తున్నది. కమ్యూనిస్టుపార్టీ ముస్లింలీగ్ కోరుతూన్న స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించినా, యింతవరకూ రైతుసంఘములో ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టలేదు. రైతుసంఘంలో ఐక్యతను నిర్మించడమే కమ్యూనిస్టుల ఆశయం: అందుచే మన రైతుసంఘం కమ్యూనిస్టుల రైతుసంఘమని వ్యతిరేకులు చేసే ప్రచారంలో ఏ మాత్రం సత్యంలేదు.

ఈనాడు వ్యవసాయకూలీ ఉద్యమం మన రైతుసేవకుల ప్రోత్సాహంతో గుంటూరు, కృష్ణా, గోదావరిజిల్లాల్లో 30 వేల సభ్యత్వం కలిగివుంది. క్రిష్టియన్ మిషనరీల వలలో పడిపోయి జాతీయోద్యమానికి యింతవరకు వ్యతిరేకంగావున్న వీరు యిప్పుడు జాతీయోద్యమంలో భాగస్వాములుగా చేరడం, జాతీయ నాయకుల విడుదలకై పాటుబడడం, రైతులతో తమకున్న భేదాభిప్రాయాన్ని పోగొట్టుకొని సోదరభావంతో మెలగడం-జరుగుతోంది. ఇదంతా రైతులకు వ్యతిరేకమా? కాంగ్రెసుకు వ్యతిరేకమా?


ఆహారసమస్య : రంగాముఠా

ఇక ప్రజల్లందరిని పీడించుతున్న ఆహార సమస్య విషయంలో రంగాముఠా యేదృక్పథం అవలంబించుతూందో చూదాం. బస్తా రూ. 12 వుండాలని మిగులు ప్రాంతాల్లో అంటున్నారు. కరువు ప్రాంతమైన విశాఖ జిల్లాలో రూపాయి 1కి 5 శేర్లు యివ్వాలంటున్నారు. డెల్టా ప్రాంతాలలో హెచ్చుఖరీదులు వస్తేగాని అమ్మవద్దంటున్నారు. కరువుప్రాంతంలో అర్థశేరు రేషన్ చాలదని, శేరుకావాలనీ, ప్రచారం చేస్తున్నారు. ఈ విధంగా ఆహారపదార్థాల కంట్రోలు, రేషనింగులను భగ్నంచేసే ప్రయత్నాలకు రంగాముఠావారు దోహదం చేస్తున్నారు. కరువు కాటకాలతో మాడుతున్న ప్రజల రక్షణకు పూనుకోవడం లేదు.

వీరి ప్రజావ్యతిరేక ప్రచారం ఇంతటితో ఆగలేదు. ప్రపంచమంతా మెచ్చుకొంటున్న సోవియట్ ప్రజారాజ్యాన్ని దుమ్మెత్తిపోస్తున్నారు. సోవియట్ భూమిలో రైతులను కష్టపెడుతున్నారని వీరు అబద్ధప్రచారం చేస్తున్నారు కాని వాస్తవమేమిటి? సోవియట్‌యూనియన్‌లో రైతాంగం ప్రపంచమంతటిలో నురెచ్చటాలేనిసౌకర్యాలు అనుభవించుతూంది. శాస్త్రీయవిజ్ఞానంపొంది, యంత్రాలను ఉపయోగించుతూ, అధిక పంటలను పండించుతున్నారు. అచట రైతు సగటున రోజుకు 15 రూ. ఆదాయం గడించుతున్నాడు. నేడు ఎర్రసైన్యం విముక్తిచేసిన పశ్చిమ యుక్రైన్, పోలెండు, రుమేనియా దేశాలలో చూడండి: జమీందారుల ఎస్టేటులను రైతులు లాక్కొంటున్నారు. రైతులకు యిలాభూమినియివ్వడం రైతుల శ్రేయస్సుకు విరుద్ధమని ఎవరనగలరు? జమీందారుల ఏజంట్లుమాత్రమే అలా అనగలరు.

తెలుగుదినపత్రికలుకూడ నామమాత్రంగా వున్న పోటీ (మిగతా 13 వ పేజీలో)

లక్షమంది రైతాంగంలో విప్లవజ్యోతిని వెలిగించింది!


పశ్చిమ గోదావరిజిల్లా రైతుమహాసభ ఊరేగింపు

మా విలేఖరి
పశ్చిమగోదావరిజిల్లా

నిరుడు మన బెజవాడలో జరిగిన అఖిలభారత కిసాన్ మహాసభ దృశ్యాలు ఇంకా కళ్లకు కట్టినట్టు కన్పడుతూనే వున్నాయి. కాలచక్రంలో ఒక సంవత్సరం గిర్రున తిరిగి పోయింది. భారత రైతుపుద్యమాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను సింహావలోకనం చేసుకొని, పరిష్కార మార్గాల నన్వేషించుటకు తొమ్మిదవ అఖిలభారత కిసాన్ మహాసభ ఏప్రిల్ 8, 9 తేదీల్లో మైమనసింగ్ జిల్లాలోని నేత్రకోనలో జరిగింది. రైతుపుద్యమ పితామహుడైన కామ్రేడ్ ముజఫర్ అహమ్మద్ అధ్యక్షతవహించారు.

మైమన్‌సింగ్ జిల్లా జాతీయోద్యమానికీ, రైతు పుద్యమానికీ పెట్టింది పేరు. బహువిశాలమైన జిల్లా అవటంచేత వివిధ ప్రకృతులుగల జాతులతో నిండివుంది. కొండలూ, వాగులూ, బ్రహ్మపుత్ర, జమ్నా మున్నగు నదులూ, మహా నదులు ఉంటంవల్ల, పచ్చటి పైరుళ్లతో కళకళలాడుతూం దీది ఆజిల్లా.

అసలు బెంగాలే బంగారపుగడ్డ. అందుకనే,

"బంగ్లార్ మాటీ - బంగ్లార్ జల్
ధన్యాహోక్ - ధన్యాహోక్ హే భగవాన్"

("ఓ భగవంతుడా: మా వంగభూమినీ, మా వంగ దేశపు జలాన్నీ ఆశీర్వదించు")

"అమార్ సోనార్ బంగ్లా
ఆమి తోమాయ్ భాలోబాసి"

("ఓ బంగారపు వంగభూమి! నిన్ను మనసార ప్రేమిస్తున్నాను.") అని

విశ్వకవి రవీంద్రుని గీతాలను గానంచేసే బెంగాలుదేశం-

"మరణ్ సీరే దలాదలి
కరెతెమానె బంచితె బోలో"
"సోనార్ బాంగ్లా హోలో స్మశాన్"

("మృత్యుముఖంలో చిక్కుకున్న మనం ఒకరితో ఒకరు కలహించుకొంటే, ఎలా జీవించగలం? మన బంగారపు వంగభూమి స్మశానం అయిపోతోంది.")

అంటూ కరువు గీతాలతో ఘోషిల్లుతోంది.

★

కరువుతో 3 లక్షలమంది మరణించారు

ఒక్క మైమన్‌సింగ్ జిల్లాలోనే 1943 - 44 లో భయంకరమైన కరువూ, అంటువ్యాధులూ వ్యాపించి, మూడు లక్షలమందిని పొట్టనపెట్టుకొన్నాయి. చిన్న చిన్న వృత్తులపై జీవిస్తున్న ప్రజల జీవనాధారాలు దొంగవ్యాపారుల గుప్పెళ్ళలోకిపోయాయి. కలరా, మశూచి మున్నగు అంటువ్యాధులతో సగానికి సగంమంది రైతులు మరణించారు. అందువల్ల వ్యవసాయం క్షీణించింది. పొట్టకోసం తమ సర్వస్వాన్ని అమ్ముకొని, అనేకమంది రైతులు చెట్టుకొకరూ, పుట్టకొకరూ ఎగబడి పోయారు. "అకలి-అకలి" అనే ఆర్తనాదం అన్నిమూలల ప్రతిధ్వనించింది. కుటుంబాలకు కుటుంబాలు విచ్ఛిన్నమై పోయాయి. పొట్టకై కన్నబిడ్డలనూ, చివరికి మానాన్ని అమ్ముకొనే దుస్థితిలో పడ్డారు స్త్రీలు. వ్యభిచారం మితిమీరిపోయింది. ఎక్కడ చూచినా దొంగవ్యాపారమే. సాంఘిక జీవనమంతా దొంగవ్యాపారుల, లంచగొండుల చేతుల్లో పడిపోయింది. నైతికజీవనం పతనమైంది. ఔదార్యమూ, పరోపకారదృష్టి, మంటకలిశాయి. "స్వంతలాభం కొంతమానుకు పొరుగువాడికి తోడుపడవోయ్" అన్న దేశభక్తి,సోదరభావమూ, బుగ్గిపాలయ్యాయి.

దేశసేవలో పేరెన్నికగన్న మణిపూసలాంటి బెంగాలు రాష్ట్రం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే దొంగవ్యాపారుల, లంచగొండుల చేతుల్లోపడి నలిగిపోయింది.

ఈ దుస్థితినుంచి ప్రజానీకాన్ని రక్షించటానికి రాష్ట్రరైతు సంఘం కంకణం కట్టింది. పంటలు బాగాపండించటానికీ, దొంగవ్యాపారాన్ని అరికట్టుటకూ, గ్రామాలను స్వయంపోషకంగా చేయటానికీ, నైతిక జీవితాన్ని పునరుద్ధరించుటకూ, అంటువ్యాధుల నరికట్టుటకూ, గ్రామాల్లో ఐక్యత నేర్పరచుటకూ ఎంతో కృషిచేసింది. ప్రజల అభిమానాన్ని, గౌరవాన్ని చూరగొంది.

నానావిధలకుగురియై నలిగిపోతున్న అట్టిబెంగాలు ప్రజకు యితరరాష్ట్రాలు సాయపడకపోతే మొత్తం భారతదేశమే ఎంతటి హీనదశకు పోవాల్సివస్తుందో వివిధ ప్రాంతాల ప్రతినిధులు తెలుసుకోడానికి యీ అఖిలభారత కిసాన్‌సభ నేత్రకోనలో ఏర్పాటుచేయబడింది.

మహాసభా సన్నాహాలు

మహాసభకు ముందుగా 700 దళాలు రెండువేల గ్రామాలలో మహాసభను గురించి ప్రచారంచేశాయి. 50 వేల రూపాయల విరాళాలు వసూలయ్యాయి. మహాసభను జయప్రదం చేయటానికి రైతాంగం, ముఖ్యంగా అధికభాగమైన ముస్లిం రైతులు, సర్వవిధాలా సహాయపడ్డారు. మొత్తం విరాళాలలో సగం కలకత్తాలో వసూలయ్యాయంటే, గ్రామీణ ప్రజానీకానికా, పట్టణ కార్మికులకు మధ్య సౌహార్ద్రభావం ఎలా పెంపొందుతోందో, కరువు నివారణకై రైతుసంఘం చేసినకృషి పట్టణప్రజలనుఎలాకదలించివేసిందో స్పష్టమౌతుంది.


కలకత్తాకు నేత్రకోన మూడువందల మైళ్లుంది. వివిధప్రాంతాలనుంచి నాయకులూ - ప్రతినిధులూ రైల్లో వస్తూంటే, 80 మైళ్ళ దూరంలోవున్న జగన్నాథగంజ్ స్టేషన్ నుంచి నేత్రకోన వరకూ ప్రతి స్టేషన్‌లోనూ రైతులు స్వాగతాలిస్తూ వచ్చారు.

"సారా భారత్‌కృషక్‌సమ్మేళన్ జిందాబాద్"అనేనినాదాలతో ప్రతి ప్లాటుఫారమూ మార్మోగింది.

చుట్టుప్రక్కల గ్రామాల్లో కూలీ - నాలీ చేసికొనే రైతులు హిందూ - ముస్లిం విభేదాలు లేకుండా రైతు ఉద్యమంపై గల గాఢాభిమానంకొద్దీ కిసాన్ నగరనిర్మాణానికి రాత్రింబగళ్ళు కృషిచేశారు. వారంరోజుల్లో నగర నిర్మాణమంతా పూర్తిఅయింది.

సింహద్వారానికి దగ్గరలో, జీవకళ ఉట్టిపడుతున్న ఒక రైతు విగ్రహం ఏర్పాటు చేయబడింది. దాస్యశృంఖలాలచే బంధింపబడ్డ రైతు తన కొడవలితో మహాఉద్రృతంగా బయలుదేరి, చేతుల సంకెళ్ళను తెగ్గొట్టిపారేశాడు. కాళ్ల సంకెళ్ళనుకూడా నరికివేయటానికి ఉద్యుక్తుడౌతున్నాడు. "అదురూ బెదురూ లేక అడ్డదియును లేక" సాగిపోవాలన్న దీక్ష ఆ విగ్రహంలో మూర్తీభవించి ఉంది. దాన్ని చూచిన ప్రతివాడూ శిల్పకారుని కళానైపుణ్యానికి, ఆ విగ్రహంలోని భావగాంభీర్యానికి ముగ్ధుడైపోయాడు.

ఆ ప్రతిమను నిర్మించినది, కళాశాలల్లో చిత్రకళ నభ్యసించి పట్టాలు పొందిన విద్వాంసుడు కాదు ఒక సామాన్య రైతుయువకుడు, కామ్రేడ్ లోకిపాల్; వయస్సు 25 ఏళ్లు. చిన్నప్పటినుంచీ చిత్రకళపై అభిరుచి ఉంటం మూలంగా, అతడు స్వయంకృషితోనే, ప్రథమ శ్రేణికి చెందిన శిల్పి అయ్యాడు.


రైతునగరం సింహద్వారం

8 వ తేదీనాడు తెలతెల్లవారుతుండగానే "కిసాన్ సభ జిందాబాద్!" "చోర్ బజార్ (దొంగమార్కెట్టు) ధ్వంస్ హో!", "సభాపతి ముజఫర్ జిందాబాద్!" అనే వినాదాలతో దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. ఎటు చూచినా, బారులుతీరి తండోపతండాలుగా రైతులు వస్తున్నారు. దూర దూరాన్నుంచి కాలినడకను స్త్రీలు, పురుషులు పిల్లలూ, వృద్ధులు రైతు యాత్రలు చేసుకుంటూ, నేత్రకోనకు చేరుకుంటున్నారు.

ఈ యాత్రల్లో హజాంగ్, సుజాంగ్, కిశోర్‌గంజ్ యాత్రలను ముఖ్యంగా పేర్కొనవలసి వుంటుంది. హజాంగ్ రైతులు 84 మైళ్ళదూరంనుంచి 3500 మంది స్త్రీలు, పిల్లలతో తరలివచ్చారు. హజాంగ్ జాతివారంతా కొండప్రాంతాలవారు. అక్కడి జమీందారు రైతులనువేధించటంలోనూ, హింసించటంలోనూ మన మునగాల, వెంకటగిరి జమీందార్లను తలదన్నిన మొనగాడు. 1937—38 లో జిల్లారైతుసంఘాధ్యక్షుడైన కామ్రేడ్ మణిసింహా నాయకత్వాన అక్కడి రైతులు బ్రహ్మాండమైన పోరాటం సాగించారు. శిస్తుల భారం తగ్గాలని, శిస్తులు ధాన్యరూపంలో కాక ధనరూపంలో వసూలు చేయాలని వినాదాలిచ్చారు. జమీందారు లొంగక తప్పిందికాదు. శిస్తులు సగానికి సగం తగ్గాయి. ఇలాగే 1941-42లో అడవిలో కట్టెపుల్లలు తెచ్చుకోగూడదని జమీందారు వాదిస్తే, అనాదిసిద్ధమైన తమ హక్కుల్ని కాపాడుకోటానికి రైతులు మళ్ళీ పోరాటం సాగించారు. అడవిలో అడుగు పెట్టనీయకుండా జమీందారు ఏనుగులతో త్రొక్కించినా, పోలీసులమద్దతు సంపాదించి ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా, రైతాంగం అల్లానే నిలబడ్డారు.

ఈరకంగా రైతుపోరాటాల్లో కాకలుతీరిన ప్రజానీకానికి, రైతుసంఘంపై అచంచలమైన భక్తివిశ్వాసాలేర్పడ్డాయి. హజాంగ్‌జాతి లక్షమందిలోనూ 25 వేలమంది రైతుసంఘ సభ్యులుగా చేరారు. అంటే యుక్తవయస్సువచ్చిన ప్రతి రైతూ సంఘంలో ఉన్నాడు. అందుకనే మహాసభకు ఇంటిల్లిపాదీ కదలివచ్చారు.

ఇలాగే 40 మైళ్ళనుంచి సుసాంగ్ రైతులు మరోమూడు వేలూ, 50 మైళ్ళదూరంలోఉన్న కిశోర్‌గంజ్‌నుంచి 15 వందలూ, ఇంకా జలాల్‌పూర్,దార్జిలింగు, టిపేరా మున్నగు ప్రాంతాలనుంచీ స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ, హిందువులూ, ముస్లింలూ, ఘూర్ఖాలు మొత్తం 15 వేలమందిదాకా కాలి నడకను యాత్రలు చేసికొంటూవచ్చారు.

ఇలా రైతుయాత్రలు "కిసాన్‌నగర్" చేరుకుంటూంటే చుట్టుప్రక్కల పల్లెల్లోని జనసమూహమంతా ఒక మహాప్రవాహంలాగ బయలుదేరి వచ్చింది.

పతాకోత్సవం, ఊరేగింపు

ఉదయం 9 గంటలయ్యేసరికల్లా పతాకోత్సవానికి 25 వేల ప్రజ వచ్చింది. రెపరెపలాడుతున్న ఎర్రజెండాలతో సభాస్థలమంతా మనోహరంగా ఉంది. వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన ప్రతినిధులు తమతమ మాతృభాషల్లో పాటలు పాడుకొంటూ నినాదాలిస్తూ పతాకవందనం చేస్తున్నప్పుడు కిసాన్ సభద్వారా భారతదేశంలోని వివిధ జాతులమధ్యసమ్మేళనం ఎంత గాఢంగా ఏర్పడిందా! అనిపించింది.

పంజాబ్ వృద్ధసింహం బాబాకేసరసింగ్ ఎర్రజెండా నెగురవేశాడు. ఈయన 33 ఏళ్ళనుంచి జైల్లోఉంటూ, రెండుమాసాల క్రితమే విడుదలైవచ్చాడు. లాహోరు కుట్రకేసు సందర్భంలో ప్రభుత్వం ఉరిశిక్ష విధించింది. తర్వాత ద్వీపాంతరవాసశిక్షగా మార్చారు. ఆస్తినంతనూ ప్రభుత్వం స్వాధీనంచేసికొంది. తనజీవితంలో సగభాగాన్ని సామ్రాజ్యవాదుల బందిఖానాలలోనూ, అండమానుల్లోనూ గడిపివచ్చాడు. 70 ఏండ్ల పండుముదుసలి అయినప్పటికీ, అతని ముఖంలో విప్లవాగ్ని ప్రజ్వరిల్లుతూనే ఉంది. గజందారున ఉన్న గడ్డం గాలికి ఊగిసలాడుతూంటే, సర్దుకుంటూ,

"మన భారతదేశంలోపకోటాను కోట్ల రైతాంగపు దాస్యశృంఖలాలను పటాపంచలు చేసేదానికి ఎర్రజెండా నీడను ఐక్యతతో అంతాకలిసి కృషిచేద్దాం. భారత స్వాతంత్ర్య సంపాదనకు ఎంతరక్తం ధారపోయాల్సి వచ్చినా, ఎన్ని ప్రాణాలు బలియివ్వవలసివచ్చినా వెనుకంజవేయం అని యీ జెండా క్రింద ప్రమాణం చేద్దాం. రైతులం, కూలీలం ఐక్యమై ముందుకు సాగిపోదాం." అంటూ ఆ పంజాబు వృద్ధసింహం అగ్నికణాలవంటి ఉత్తేజపూరిత గర్జనలతో ఎర్రజెండా నెగురవేశాడు.

పతాకోత్సవం కాగానే, ఊరేగింపు ప్రారంభమైంది చక్కగా అలంకరించిన ఎడ్లబండిపై సభాపతి ముజఫర్ అహమద్‌ని కూర్చోపెట్టారు. వెనకా, ముందూ వాలంటీరు దళాలు కదం తొక్కుతూ, వరుస పాడుతున్నాయి. బ్యాండు దళాలవారు రైతుగీతాలను పాడుతూ విజయభంకా బజాయిస్తున్నారు 5 వేలమంది ప్రజలు బారులుదీరి వినాదాలిస్తుంటే పట్టణమంతా ప్రతిధ్వనించిపోయింది.

మహాసభ దృశ్యం

ఎనిమిదో తేదీ సాయంత్రం మూడుగంటలయ్యేసరికల్లా వేలకొలది రైతులు చీమలబారుల్లా యింకావస్తూనేవున్నారు. "కిసాన్ నగర" మంతా క్రిక్కిరిసిపోతోంది. వచ్చేపోయే జనానికి త్రొక్కిసలాటలేకుండా ఎక్కడికక్కడ బాటలేర్పాటుచేశారు. మహాసభకు స్త్రీలూ - పురుషులూ లక్షమందికి పైగా వచ్చారని సుప్రసిద్ధ జాతీయ ఆంగ్ల దినపత్రిక 'అమృతబజార్' అంచనా. నాయకులు కూర్చోటానికి ఆరడుగుల ఎత్తున విశాలమైన సభామంటపం ఏర్పాటు చేశారు. 11 యకరాల ఆవరణలో ప్రేక్షకులు ఏమూల కూర్చున్నా నాయకులంతా చక్కగా కన్పడేటానికి వీలుగా ఉంది. వేదికముందు పెద్ద సుత్తీ కొడవలి చిహ్నమూ, అటూ యిటూ దుక్కిదున్నుతూ, నాట్లువేస్తూ, కోతలు కోస్తూ, ధాన్యం నూర్పుస్తున్న రైతుజీవితాన్ని ప్రతిబింబింపచేసే పెద్దపెద్ద చిత్రపువులూ చిత్రించబడ్డాయి.

విశ్వకవి రవీంద్రుని 'జనగణమన' గీతంతో మహాసభ ప్రారంభమైంది. ఆహ్వానసంఘాధ్యక్షుడుకామ్రేడ్ మణిసింహ సభాసదులకు స్వాగతమిచ్చాడు. కామ్రేడ్ మణిసింహ జన్మతః జమీందారీ కుటుంబానికి చెందినవాడైనా 1920నుంచీ స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూ ప్రజలతో కలసిమెలసిపోయాడు. టెర్రరిస్టు ఉద్యమాల్లోకూడ ప్రముఖపాత్ర వహించాడు. 1931 నుంచి 36 దాకా జైళ్ళలో ఉన్నాడు. ఇప్పుడు మైమన్‌సింగ్ జిల్లారైతుసంఘాధ్యక్షుడు. రైతులహక్కుల్ని రక్షించుటకై ఎన్నోసార్లు పోరాటాలు సాగించిన యోధుడు. అందుకనే మైమన్‌సింగ్ జిల్లాలోనిలక్షలకొద్దీప్రజలు అయన్ని ప్రేమిస్తారు. అలాంటి కామ్రేడ్ మణిసింహ మైమన్‌సింగ్ జిల్లా రైతుల తరపున స్వాగతమిస్తూ, బెంగాలు పరిస్థితులను కళ్ళకుకట్టినట్టు వర్ణించాడు.

సభాపతి ముజఫర్ అహమ్మద్ అధ్యక్షపీఠం అలంకరించాడు. (అధ్యక్షోపన్యాసం క్రిందటి సంచికలో ప్రకటించబడింది.) మహాసభ జయప్రదం కావలెనంటూ శ్రీమతి సరోజినీనాయుడు, అలిండియా ట్రేడుయూనియన్‌కాంగ్రెసు ప్రెసిడెంటు మృణాలకాంతిబోసు, బెంగాల్‌రాష్ట్రియముస్లింలీగ్ సెక్రటరీ అబ్దుల్ హషీం, అస్సాం ఎసెంబ్లీ స్పీకరు శ్రీ వసంతకుమారదాస్, మద్రాసు మాజీ కాంగ్రెసుమంత్రి డాక్టరు రాజన్, ముస్లింలీగ్ నాయకుడు డాక్టరు లతీఫ్ మున్నగు ప్రముఖులు పంపిన సందేశాలు చదువబడ్డాయి.


జోషీ ఉపన్యాసం

తర్వాత కరతాళధ్వనుల మధ్య భారత కమ్యూనిస్టుపార్టీ తరపున కామ్రేడ్ పి. సి. జోషీ మహాసభకు సందేశమిస్తూ ఈ మహాసభకు హిందువులు ముస్లిములు అధికంగా వచ్చినందుకూ, రైతుసంఘం దినదినాభివృద్ధి చెందుతూ బ్రహ్మాండమైన ప్రజా సంస్థగా పెంపొందుతున్నందుకూ సంతోషం వెలిబుచ్చాడు. కష్టకాలంలో రైతుల్ని కిసాన్‌సభ ఆదుకొంటూ నిర్వర్తించిన కార్యక్రమమూ,సర్వపక్ష సమ్మతమైన రాజకీయ విధానమూ చాల బాగున్నాయన్నాడు. తర్వాత "ఇవ్వాళ బెంగాలు దేశంలో రాజ్యంచేసేది రాక్షసులు కాని, మానవులుకా"దన్నాడు. "ఈ రాక్షసులు ఎవరంటారేమో, ధనార్జనకై ప్రజల ప్రాణాలను బలికొంటున్న దొంగవ్యాపారులే. ఈనాడు సమాజంలో దొంగతనం చేసేది కేవలం దొంగలేకాదు. లక్షాధికారులూ, కోటీశ్వరులూ, ప్రజల నోటివద్ద ముద్దను హరించే బందిపోటు దొంగలయ్యారు. ఈబందిపోటు దొంగల్ని పట్టుకోటానికి ఏమిలిటరీ క్యాంపులూలేవు. ప్రభుత్వ యంత్రమంతా వీళ్ళ చేతుల్లోనేవుంది. అంచేతనే బెంగాలులో యీ రాక్షసుల రాజ్యం చెలరేగుతోంది. లక్షలాది ప్రజల ప్రాణాలతోచెలగాటాలాడుతున్న ఈరాక్షసుల్ని, బందిపోటుల్ని హతమార్చటానికి అన్ని పక్షాలూ ఐక్యం కావాలి." ముఖ్యంగా రైతుఉద్యమంలో ఐక్యతను నిర్మించుటకు అన్ని పక్షాలూ, ప్రజలూ పూనుకోవాలని కోరారు.

తర్వాత సుప్రసిద్ధ విప్లవకారులు ఠాకూర్ చంద్రసింగ్, అమీర్ హైదర్‌ఖాన్, మణిపూర్ సంస్థాన ప్రజానాయకుడు ఐరావత్ సింగ్, అరకాన్ గెరిల్లానాయకుడు, సిన్యా షైహా, నాదియాజిల్లా కాంగ్రెసు అధ్యక్షుడైన శ్రీ కె. పి. చటోపాధ్యాయ, రాష్ట్ర ముస్లింలీగు జాయింటు కార్యదర్శి షామ్‌సుల్‌హక్, జమయత్ (మిగతా 10 వ పేజీలో)

★


తూర్పు గోదావరిజిల్లా రైతు ఊరేగింపు

తూర్పు గోదావరిజిల్లా రైతుమహాసభ ఒక దృశ్యం


17 వేలమంది పాల్గొన్న పశ్చిమ గోదావరి రైతు మహాసభ ఒక భాగం


10 వేలమంది పాల్గొన్న తూర్పు గోదావరిజిల్లా మహాసభ మరో దృశ్యం


వివిధప్రాంతాల విప్లవయోధులు

(9వ పేజీ తరువాయి) ఉలేమా నాయకుడు. మౌలానా అబ్దుల్‌హమీద్ మున్నగు ప్రముఖులు సందేశాలిస్తూ భారత రైతుల ఏకైకసంస్థ కిసాన్ సభను పక్ష విభేదాలు లేకుండా అందరూ బలపర్చాలని కోరారు.

శ్రీ ఐరావత్‌సింగ్ మణిపూర్ సంస్థానాధిపతి అల్లుడై ఉండి కూడ మణిపూరు ప్రజల హక్కులకై పోరాడిన యోధుడు. సంస్థాన ప్రజలకు సాటిలేని నాయకుడు. ప్రభుత్వం అరెస్టుచేసి మూడేండ్లశిక్ష విధించింది. అదే సమయంలో మణిపూరు సంస్థానం జపానుదాడికి గురిఅయింది. మాతృదేశ రక్షణకై జపానుకు వ్యతిరేకంగా పోరాడవలసిందని జైల్లోనుంచే ఐరావత్‌సింగ్ తన ప్రజలకు పిలుపిచ్చాడు. కాని ప్రభుత్వం వదలలేదు. శిక్షాకాలం పూర్తి అయిన తర్వాత వదలిపెట్టారు. జైల్లో ఉండగానే కమ్యూనిస్టుసాహిత్యం చదివాడు. కమ్యూనిస్టుసిద్ధాంతాలను తెలుసుకున్నాడు. కమ్యూనిస్టుపార్టీలో చేరాడు.

శ్రీ పిన్యాథైహా అరకాన్ దేశస్థుడు. బౌద్ధభిక్షువు. అరకాన్ బౌద్ధభిక్షులసంఘానికి విద్యాశాఖ కార్యదర్శి: అరకాన్ నేషనల్ కాంగ్రెసుకు అధ్యక్షుడు. అరకాన్ ప్రజలకు ఏకైక నాయకుడు. అరకాన్‌లో యీయనపేరెరుగని, యీయన్ని ప్రేమించని గ్రామమేలేదు. 1939 లో యీయనను బర్మా ప్రభుత్వం అరెస్టుచేసింది. 9 నెలల శిక్ష విధించారు. 1939-40-41 సంవత్సరాల్లో బహిరంగంగానూ, రహస్యంగాను బ్రిటిషుసామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా అరకాన్ ప్రజల్ని సంఘటితపరుస్తూ వచ్చాడు. గ్రామగ్రామాన స్వాతంత్ర్య బీజాలను నాటాడు. అరకాన్‌ను జపాన్ ఆక్రమించుకొన్న తర్వాత జపానువాళ్ళతో కలసి కొంతకాలమున్నాడు. కాని త్వరలోనే ప్రజల్ని పీల్చి పిప్పిచేస్తున్న జపానురాక్షసుల పరిపాలన చూచి ఏవగించుకొన్నాడు. పవిత్రమైన స్వాతంత్ర్యసంరక్షణే తన ధర్మమనుకొని, అరకాన్‌జిల్లా దళాలకు నాయకత్వంవహించి, జపానువాళ్ళకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాడు. అట్టి స్వాతంత్ర్యయోధుడు పిన్యాథైహా కిసాన్‌సభకువచ్చి ఉత్తేజకరమైన సందేశమిచ్చాడు.

వస్తుప్రదర్శనాలు

ప్రదర్శనాలలో బహు చక్కటి చిత్రాలూ, వస్తువులూ ఏర్పాటు చేయటమేకాక, ప్రజాజీవితానికి సంబంధించిన చిత్రాలూ, ఛార్టులూ చాలా ఏర్పాటు చేయబడ్డాయి. లక్షలాది ప్రజలను పొట్టపెట్టుకున్న కరువుకు కారణాలను గురించీ, కరువువల్ల నశించిన లక్షలాది బెంగాలుప్రజలను గురించీ, కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. పంటలుపండించిన రైతులే తిండిలేక ఎలా అవస్థపడుతున్నారో, బట్టలుతయారుచేసే చేనేతపారిశ్రామికులు కట్టగుడ్డలేక ఎలా అవస్థపడుతున్నారో పండించిన పంటలనూ, నేసిన బట్టలనూ దొంగవ్యాపారులు ఎలా దాచివేస్తున్నారో, రైతులూ, కార్మికులూ ఐక్యకృషి కొనసాగించినచో తిండీ, బట్టా ఎలా సంపాదించుకోవచ్చునో బొమ్మలద్వారా చక్కగా చూపెట్టారు. బెంగాలులో పొట్టకోసం శీలాన్ని అమ్ముకుంటున్న సోదరీమణుల దుస్థితినీ, పాలకోసం గిలగిల కొట్టుకొంటున్న పసిబిడ్డల దురవస్థలనూ చూపెట్టారు. అంటువ్యాధులు ఎలా చెలరేగుతున్నాయో, వాటిని పోగొట్టుటకు ఏపద్ధతు లవలంబించాలో, బంజరు భూమిని సాగులోకి తీసుకురావటానికి అందరూ ఐక్యతతో ఎలా కృషిచేయాలో తెలియచేసే చిత్తరువులను కూడ ఏర్పాటు చేశారు. వాటిలో ఖుల్నాజిల్లాలో వరదలవల్ల సాగుకు వీలుకాని 25 వేల యెకరాల భూమిని సాగులోకి తీసుకురావటానికి రైతులూ, కూలీలూ ఎలా ఐక్యతతో కట్టలుపోశారో, దానిమూలంగా కొరత ప్రాంతమల్లా అదనపు ప్రాంతమెలా అయిందో తెలియపరుస్తూ నవ కొండపల్లి బొమ్మలవంటి బొమ్మలతో చక్కగా చూపెట్టారు.

రైతునాయకుల చిత్రాలనూ, రైతుఉద్యమం ఎలా అభివృద్ధి పొందుతూందో తెలియపర్చే ఛార్టులనూ కూడ ప్రదర్శనంలో ఏర్పాటుచేశారు.

ఇంతేకాక సోవియట్ ప్రదర్శనమూ, వ్యవసాయ ప్రదర్శనాలు కూడ ఏర్పాటు చేయబడ్డాయి.

ప్రాచీన సాంప్రదాయాలను ప్రతిబింబింపచేసే తివాసీలు, అల్లికపనులు, వెదురుతో తయారుచేసిన రకరకాల బుట్టలూ, చాపలూ, త్రాళ్లూ, అరవైఏళ్ళ ముసలమ్మచే తయారుచేయబడ్డ పక్కల బొమ్మలూ, శాంతినికేతనంవారి లెదర్ వర్క్సు, శంఖులతో తయారుచేసిన వస్తువులు, చిత్రవిచిత్రంగా నేయబడ్డ బట్టలూ ప్రదర్శనానికి ఎంతో శోభను చేకూర్చాయి. వేలకొలది ప్రజలు ప్రతినిత్యం ప్రదర్శనాలు చూస్తూండేవాళ్లు.

ఆరోగ్యము - వైద్యసౌకర్యాలు

మహాసభకు వచ్చిన ప్రేక్షకులకు అంటువ్యాధులు తగలకుండా చూడ్డానికి మార్వారీ రిలీఫ్ సొసైటీ, పీపుల్స్‌రిలీఫ్ కమిటీ మున్నగు సంస్థల తరఫున డాక్టరు బి. కె. బాసు నడిపిన వైద్యదళం చక్కటి ఏర్పాటు చేసింది. "కిసాన్ నగర్" సమీపంలోనే 'మాగ్రానది' ఒడ్డున ప్రత్యేకమైన హాస్పిటలు ఏర్పర్చారు. స్థానిక వైద్యసంఘంవారు కూడ సంపూర్ణ సహకారం చేశారు. సభ జరుగుతున్న రెండు రోజుల్లోనూ ఎక్కడ, ఎవరికి, ఏవిధమైన సుస్తీచేసిందన్నా సరే, మెడికల్ దళంవారు పరుగెత్తుకు వచ్చేవారు. రోగులను కంటిరెప్పను కాపాడినట్టుగా కాపాడారు. కామ్రేడ్ సుందరయ్య ఆరోగ్య ప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ "మానవసేవయే పరమ లక్ష్యంగాగల మార్వాడీ రిలీఫ్‌సొసైటీ, బెంగాల్ రిలీఫ్‌కమిటీలలాంటి సంస్థలు కిసాన్‌సభ సందర్భంలో తమ సోదర రైతులకు సహాయపడ వలెననే సహజ భ్రాతృభావముతో వైద్యసదుపాయాల నేర్పాటు చేసినందుకు అభినందనాలు" తెలిపాడు.

వలంటీర్లు - వంటశాల

మహాసభకు ఏర్పాట్లన్నీ ఒకఎత్తు, వంట యేర్పాట్లు ఒకయెత్తు. దొంగవ్యాపారం జోరుగా సాగుతున్న ప్రాంతంలో, అందులోనూ ఆహారపదార్థాల ధరలు పెరిగిఉన్న చోట్ల, బియ్యం సంపాదించటం ఎంత కష్టమో ఆలోచించండి. కాని రైతుసంఘం మైమన్‌సింగుజిల్లాలో బలీయమైన సంస్థగా పెంపొందటంవల్ల ఒడుదుడుకులు లేకుండా పని సాఫీగాజరిగిపోయింది. చుట్టుప్రక్కల ప్రజలు కూడ రోజూ అరటిఆకుల కట్టలు, కూరలతట్టలు, నెత్తినపెట్టుకొని రైతు గీతాలు పాడుకుంటూ, బారులుతీరి వచ్చే దృశ్యాలు ఎంతో గాఢాభిమానాన్ని వెల్లడిచేశాయి. మొత్తం 60 వేలమంది భోజనం చేశారు.



గన్నవరం తాలూకా రైతుమహాసభ



ప. గో. మహాసభ రైతువాలంటీరు ర్యాలీ

వంటశాలల్లో పనిచేసిన వాలంటీర్లూ, వంటశాలకు ప్రధాన బాధ్యులైన కామ్రేడ్సు రవి, కోశావంగులూ ప్రశంసనీయమైన కృషిచేశారు. వంటశాలల్లో పనిచేసిన హజాంగ్ వలంటీర్లు నిద్రాహారాలు లేకుండ రాత్రింబగళ్ళు కృషి చేశారు. కామ్రేడ్సు రవి, కోశాశింగులకు కంటికి కునుకు లేదంటే ఏమాత్రమూ అతిశయోక్తి లేదు. ఈ యిరువురు కామ్రేడ్సు టెర్రరిస్టులుగా స్వాతంత్ర్య పోరాటంలో అడుగుపెట్టారు ఇరువురికీ ప్రభుత్వం ద్వీపాంతరవాసశిక్ష విధించింది. ఈ మధ్యనే విడుదలై వచ్చారు. విడుదలైనదగ్గర నుంచీ రైతుసంఘాలలో పనిచేస్తూ రైతునాయకులుగా రాణిస్తున్నారు. ఇరువురూ కమ్యూనిస్టులే.

స్త్రీలూ, పురుషులూ మొత్తం 5 వేలమంది వాలంటీర్లుగా పనిచేశారు. ఇందులో హజాంగ్ స్త్రీలే ఎక్కువ. 70 మైళ్లు నడిచివచ్చి, వెంటనే వాలంటీరు పనికి పూనుకోటం, విసుగు-విరామం లేకుండా, ఏపనిబడితే ఆపని రోజుకు 15 గంటల దాకా చేయటం, చూస్తే కొండజాతుల వాళ్ళైనా రైతుసంఘంపై ఎంతగా అభిమానం ఉందో అనిపించింది. డార్జిలింగునుంచి వచ్చిన ఘుర్ఖా వాలంటీర్లు కూడ ఇలాగే ఆదర్శంగా పనిచేశారు. వర్షం కురుస్తున్నా, ఉరుములు ఉరుముతున్నా, తమ డ్యూటీని నిర్వర్తించటంలో బద్ధకించినవారు హజాంగ్, ఘూర్ఖాలలో, ఒక్కరు కన్పడలేదు.

వాలంటీరుదళాధిపతి కామ్రేడ్ కోశారాయి ఇతనుమొదట్లో టెర్రరిస్టు. 7 సంవత్సరాల కఠినశిక్ష విధించారు. తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. బెంగాలు రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కమిటీలో సభ్యుడు. మైమన్‌సింగ్ జిల్లాకమిటీకి కార్యదర్శి. స్త్రీ వలంటీరు దళాలకు ఈయన భార్య నాయకత్వం వహించింది.

వైజ్ఞానిక ప్రదర్శనాలు

సభ జరుగుతున్న రెండురోజులూ రాత్రిపూట వైజ్ఞానిక ప్రదర్శనాలు యేర్పాటుచేయబడ్డాయి. ప్రాచీనకాలంనుంచి ప్రచారంలో ఉన్న పద్ధతులలో ప్రజాజీవితాన్ని ప్రతిబింబింపచేస్తున్న పాటలతోనూ, వేషాలతోనూ, నృత్యాలతోనూ, ఫిడేల్, దోతార్ మున్నగు వాయిద్యాలతోనూ బెంగాలు, పంజాబు, అస్సాం, మణిపూర్, యు. పి. ప్రాంతాల వైజ్ఞానికదళాలు ప్రజాజీవితాన్ని పరవశుల్ని చేశాయి. కామ్రేడ్ ఐరావత్‌సింగ్ నాయకత్వాన మణిపూర్‌దళం ప్రదర్శించిన కోలం నృత్యమూ, బల్లెములతో డాన్సు చాల చక్కగా ఉన్నాయి. గ్రామీణ నృత్యానికి అసలు మణిపూర్ సంస్థానం పెట్టిందిపేరు. ఏ శృంగార రసాన్ని ఒలకించుటకో, రాజులను రంజింపచేయుటానికో ప్రదర్శింపబడే పద్ధతులలో ప్రజాజీవితాన్ని ప్రతిబింబింపచేసే విషయాలను ప్రవేశపెట్టాడు కామ్రేడ్ ఐరావత్‌సింగ్. అందేత మణిపూర్ దళంవారి నృత్యం చాలాబాగుంది.

తర్వాత రంగపూర్ దళానికి చెందిన కామ్రేడ్ టాగార్ అధికారియొక్క "దోతారా" వాయిద్యంకూడ ఎంతో మనోరంజకంగా ఉంది. కామ్రేడ్ టాగార్ భారతదేశంలో అగ్రశ్రేణికిచెందిన వైణికుడు. పుట్టుగుడ్డి అయినప్పటికీ, ప్రజాసామాన్యంలో ఉత్తేజాన్ని కల్గించే జాతీయ గీతాలనూ, రైతుగీతాలనూ, "దోతారా"పై వాయిస్తూ శ్రోతల్ని తన్మయుల చేశాడు

చిటగాంగునుంచి వచ్చిన రమేశ్‌సీల్ యొక్క ఆశుకవిత్వం కూడ ప్రజల మన్ననలకు పాత్ర (మిగతా 11వ పేజీలో)

★ రాష్ట్రాలలో

సంయుక్త మంత్రివర్గాలేర్పడాలి

అ. భా. రైతుమహాసభ తీర్మానాలు

"గాంధీజీ, తాను పోరాటాన్ని ప్రారంభించదలచుటలేదని పదేపదే చెప్పుతున్నా, సరిహద్దు రాష్ట్రంలో కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడ్డా, కాంగ్రెసువాదులనేకులు నిర్మాణ కార్యక్రమానికి పూనుకున్నా, కాంగ్రెసునాయకుల నింకా జైళ్ళలో నిర్బంధించియుంచడం అక్రమం. కాంగ్రెసు - లీగులమధ్య ఐక్యత లేదనే సాకు భులాభాయి - లియాఖత్ ఆలీఖాన్‌గార్ల ఒడంబడికతో ఎగిరి పోయింది. కాబట్టి రాజకీయ ఖైదీలనందరిని విడుదల చేయాలి. అప్పుడే కేంద్రంలో సంయుక్త మంత్రివర్గమూ, రాష్ట్రాలలో ప్రజావిశ్వాసాన్ని చూరగొన్న మంత్రివర్గాలూ ఏర్పడుతాయి. శాన్‌ఫ్రాన్సిస్కో సమావేశానికి నిజమగు భారత ప్రతినిధులు అప్పుడే వెళ్లగల్గుతారని యీ మహాసభ అభిప్రాయపడుచున్నది.

"సింధు అస్సాం మంత్రివర్గాలు ఇటీవల చాలామంది కాంగ్రెసునాయకులను విడుదల చేయటం ముదావహం. తక్కినవారి నందరినీ కూడా వెంటనే విడుదల చేయాలి. జైళ్లనుండి విడుదలైన కాంగ్రెసు అసెంబ్లీ సభ్యులు, మంత్రివర్గం యేర్పర్చుటకు ప్రయత్నాలుగావించటాన్ని యీ మహాసభ బలపర్చుతుంది. ఇతర ప్రజా పక్షాల సహకారాన్ని ఈమంత్రివర్గాలు సంపాదించునట్లూ, లంచగొండితనాన్ని, దొంగవ్యాపారాన్ని రూపుమాపుటకూ ఆహార సమస్యను పరిష్కరించుటకూ, ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించుటకై ఇవి పాటుబడునట్లూ ప్రయత్నించగోర్తాము.

"భులాభాయి లియాకత్ ఆలీ గార్లమధ్య జరిగిన ఒడంబడికను బలపర్చుతూ అంతటితో ఆగక స్వయంనిర్ణయ సూత్రంపై ఒక ఒడంబడికకువచ్చి, శాశ్వతమైన సహకారాన్ని ఏర్పరచమని కాంగ్రెసు - లీగు నాయకులను కోరుతున్నాము. ఇందులకై ఎక్కడ సంభాషణలు విఫలమైనాయో అక్కడనుండి తిరిగి ప్రారంభం కావాలని వాంఛిస్తున్నాము. ఈ విధంగానే ప్రతిష్ఠంభనను కొనసాగించతలచే అమెరీ, మూడీలఎత్తులను భగ్నంకావించగలమని యీ మహాసభ అభిప్రాయపడుతోంది."

ఈతీర్మానం సామ్రాజ్యవాదుల కుట్రలను భగ్నం గావించటానికి, ఆర్థిక అల్లకల్లోలాన్ని పరిజేయుటకు, దొంగవ్యాపారాన్ని, లంచగొండి తనాన్ని రూపుమాపుటకూ, మంత్రివర్గాలు ఎట్లు సాధనంకాగలవో తెలియజేసింది.

స్వామీజీపై తీర్మానం

"ప్రధాన కార్యదర్శి మొదలైనవారిపై శిక్షాచర్య గైకొనుటకు స్వామీజీకి అధికారం లేదు. అట్లు చర్యగైకొనుట నియమావళికి విరుద్ధం. తాను చేసిన అక్రమాన్ని సమర్థించడానికై సెంట్రల్‌ఆఫీసు, బెంగాల్‌రాష్ట్ర రైతుసంఘం పాకిస్థానుగూర్చి ప్రచారం చేశాయన్నాడు. కాని ఇది పచ్చిఅబద్ధం. బెంగాలులోని 2 జిల్లా రైతుసంఘాలు స్వయంనిర్ణయ సూత్రాన్ని గూర్చిన పాలసీని పునరాలోచించమని అ. భా. కి. సభను కోరుతూ సిఫార్సు చేశాయి. అప్పటి పాలసీకి విరుద్ధంగా ప్రచారము చేయనంతవరకూ, అధీనసంఘాలు సిఫార్సు తీర్మానాలను చేయటం ప్రజాతంత్ర లక్షణం. దీనిని గుర్తించక, ఒకవేళ ఇవితప్పు చేశాయనుకున్నా, సి. కె. సి. దృష్టికితేక శిక్షాచర్యను తీసికొనుట పూర్తిగాఅక్రమం. పైగా తనచర్య తప్పని ఖండించిన సి.కె.సి.ని కూడా సస్పెండు చేయటం, బీహారు మినహా యితర అన్ని రాష్ట్రాల రైతుసంఘాలను రద్దుచేయటం మరింత అక్రమం. ఈ విధంగా రైతుసంఘాల కార్యక్రమానికి అంతరాయం కల్గించజూస్తూ, తన అధ్యక్షపదవికి కూడా స్వామీజీ రాజీనామా యిచ్చాడు. కాని తిరిగి తాను ఉపసంహరించుకొన్నాననీ, తానొక్కడే అఖిలభారత రైతుసంఘంగా వ్యవహరిస్తున్నాననీ, తెల్పటం స్వామీజీకి అర్హమైనదికాదు.

"అఖిలభారత రైతుసంఘ నిర్మాతలలో ఒకరగు స్వామీజీ ఇట్టి చర్యలకు పూనుకోవటం, ఇతరులవలెనే తానుకూడా కమ్యూనిస్టు "భూతా"న్ని లేవదీయటం. రైతుఉద్యమానికి శ్రేయస్కరంకాదు. కమ్యూనిస్టులు పాకిస్థాను ప్రచారానికై రైతుసంఘాన్ని ఉపయోగించారన్నదికల్ల. నిజానికి స్వామీజీయే పాకిస్థానుకు వ్యతిరేకంగా ఉపన్యాసాలిచ్చి రైతుఉద్యమంలోవున్న ముస్లిం సోదరులకు నొప్పి కల్గించాడు. గాంధీజీ, కాంగ్రెసువాదులందరూ అంగీకరించినంతవరకైనా స్వయం నిర్ణయసూత్రాన్నిగూర్చి స్వామీజీ అంగీకరించలేదు. ఈయన వ్యతిరేకతను గుర్తించియే అ. భా. రై. సంఘంలో కమ్యూనిస్టులు పాకిస్తానుగూర్చి ఒత్తిడి చేయలేదు. ఇట్టి సందర్భంలో నెపమెంచ వేయటం ఆశ్చర్యకరం.

"స్వామీజీ తన పొరపాట్లను గుర్తించి, అఖిలభారత రైతుమహాసభ ఆదేశాలను శిరసావహించి, తిరిగి ఈ సంఘంలోకే వస్తారని ఆశిస్తోంది. స్వామీజీని కలుపుని ఈ తీర్మానాన్ని అంగీకరించి ఆయన తిరిగి అ. భా. కి. సభలోకి వచ్చునట్లు చేయుటకై ప్రధానకార్యదర్శికి అధికార మీయడమైనది"

ఆహారసమస్య

"ప్రభుత్వం ఆహారసమస్యా పరిష్కారానికి ఒకప్లానును అంగీకరించినను ఆచరణలో అన్నిచోట్ల అప్లానును అమలు పెట్టటంలేదు. ఈప్లానును జయప్రదంచేయడానికి ముఖ్యావసరాలు రెండు. (1) రైతులకు న్యాయమగు ధరను గ్యారంటీయిస్తూ వారివద్ద మిగులు ధాన్యాన్ని ప్రభుత్వమే సూటిగా కొనటం (2) గ్రాము, పట్టణ లన్నింటిలోనూ రేషనింగును ప్రవేశపెట్టటం.

"బొంబాయి రాష్ట్రంలోనూ, మద్రాసు రాష్ట్రంలో కొన్ని తరుగు జిల్లాలలోనూ, మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్‌సంస్థానములలోనూ మాత్రమే ఈప్లాను అవలంబించబడుచున్నది. ఇతర ప్రభుత్వాలు అచరణలో పెట్టుటకు నిరాకరిస్తున్నాయి. ధాన్యాన్ని సేకరించడానికి అమ్మటానికి కూడా పూర్తిగా వ్యాపారులమీదనే ఆధారపడి వుంటున్నాయి.

"ధాన్యసేకరణ, రేషనింగువున్న ప్రాంతాలను లేనిప్రాంతాలతో పోల్చిచూస్తే పైప్లాను యొక్క వుపయోగం బోధపడగలదు, ప్లాను అచరణలోవున్న ప్రాంతాలలో (1) రైతుల ధాన్యానికి ధరల గ్యారంటీ వున్నది. (2) మిగులు ధాన్యము దొంగవ్యాపారంలోకి పోక సరిగా వినియోగపడగలదు. (3) ప్రజలందరకూ తిండికి గ్యారంటీవున్నది. ఈ ప్లాను లేనిచోట (1) ధాన్యంధరలు వ్యాపారుల చిత్తంపై ఆధారపడి వుంటున్నవి. ఉదా: అస్సాంలో కంట్రోలు ధర మణుగు 13 7-0-0లు వుంటే, రైతుకు షాహుకారు యిచ్చేది 2-8-0 మాత్రం (2) రేషనింగు ప్రాంతాలు ధాన్యం సప్లయికి గ్యారంటీలేక ఒడుదుడుకులలో పడుతున్నవి. (3) దొంగ వ్యాపారంలోకి ధాన్యం విశేషంగా పోతున్నది.

"కాబట్టి మిగులుధాన్యాన్నంతటినీ సరసమగు ధరలకు రైతులకిస్తూ ప్రభుత్వమే కొనేటట్లు, ఈ విధానము నంగీకరించులోగా కనీసం కొంతభాగమునైనా కొనేటట్లు అందోళన చేయాలి. రైతులవద్ద కొనేధరలకూ, ప్రజల కమ్మేధరలకూ మధ్య గల వ్యత్యాసాన్ని తగ్గించాలి. మరీబీదలగు ప్రజలకు చవుక అంగళ్ళను పెట్టాలి. రేషనింగు ప్రాంతాలలో మామూలుధరలకన్న తక్కువ ధరకు వీరికి సప్లయిచేయాలి."

అధికాహారోత్పత్తి

"దేశమంతటా కరువుకాటకాలింకా తీవ్రమౌతున్న సమయంలో, జపానుపై తిరుగుదండయాత్ర ప్రారంభం కానున్న సమయంలో, మన ఆర్థిక జీవనంపై ఒత్తిడి మరింత అధికమౌతోంది. కాబట్టి అధికాహారోత్పత్తి విషయంలో రైతులు మరింతకృషిని గావించాలి. నిరుడు బెంగాలులోనూ, ఆంధ్రలోనూ ఇందువిషయమై విశేషమగు కృషి జరిగింది. కాని ఇంకనూ దీనిని తీవ్రతరం చేయాలి. ఇందుకుగల ఆటంకాలను ప్రభుత్వం తొలగించాలి. యు. పి. పంజాబు, బెంగాలు, మలబారు మొదలగు రాష్ట్రాలలో జమీందార్లు రైతులను భూములనుండి వెళ్లగొట్టు చర్యలను మాన్పించాలి. బెంగాల్ కరువులో భూములను పోగొట్టుకున్నవారికి తిరిగి భూముల నిప్పించుటకై చేయబడ్డ ఆర్డినెన్సును అమలుజర్పాలి.

"అధికాహారోత్పత్తిని గావించుటకై ప్రభుత్వంచేసే రూల్సును, ఇచ్చే సౌకర్యాలనూ రైతుసంఘం వర్కర్లు తెలిసికొంటూ వీటిలోని లోట్లను సవరించుటకూ ఆందోళనజేస్తూ అధికాహారోత్పత్తికి కృషినిగావించాలి. ఆ విధంగా చేయటంవల్లనే ఆంధ్రలో ప్రభుత్వ శాఖలు రైతుసంఘాల సహకారంతో తమ ఆర్డర్లను అమలుజర్పుటకు పూనుకున్నాయి. రైతుసంఘాలు ఇనుము, ఎరువులు మొదలైన వాటిలో దొంగవ్యాపారాన్ని ఎదుర్కొనగల్గినాయి. ఈనాము భూములు, జమీందారీ చెర్వులమరమ్మతులు, జమీందారీబంజర్లసాగు మున్నగు వాటివిషయంలో హక్కులు సంపాదించ గల్గినవి. రైతులు-కూలీలమధ్య సామరస్యాన్ని నెలకొల్పగల్గాయి. కాబట్టి ప్రభుత్వం కల్పించే సదుపాయాల నుపయోగించుకొని ప్రజలకందరకూ తిండిని సమకూర్చుటకై అధికాహారోత్పత్తికి పూనుకోవాలి.

"ఈ తీర్మానాల ప్రకారం తమ కర్తవ్యాలను నిర్వహించాలంటే ఈనాడు దేశభక్తులందరిమధ్య ఐకమత్యం అవసరం. పోటీ సంఘాలుపెట్టే పనినుండి వారు విరమించి అఖిలభారత కిసాన్‌సభలోజేరి కృషిజేయాలి. అందులకై వారిని ఆహ్వానిస్తూ ఒక తీర్మానం జేయబడింది. అంతేకాదు; ఇప్పటికే కొందరు కాంగ్రెసు-ముస్లింలీగు దేశభక్తులు రైతుసంఘాలలోజేరి పనిచేస్తూవున్నారు. ఇంకనూ ఎక్కువమంది జేరి కృషిచేయుటకున్నూ, అన్నిరాష్ట్రాలలోనూ సంఘ నిర్మాణ పద్ధతుల నొకేరీతిన నడుపుటకున్నూ నిబంధనావళిలో యీ క్రింది ముఖ్యమగు మార్పులు చేయబడ్డాయి.

1. అఖిలభారత కిసాన్‌సభ నిర్మాణస్వరూపము ఇట్లా వుంటుంది. 15000 జనాభాకల్గిన ప్రాంతంలో 100 గురు సభ్యులు జేరినచో ప్రాథమిక రైతుసంఘం ఏర్పడును. పైన జిల్లా, రాష్ట్ర, అ. భా. రై. సంఘాలుంటాయి ప్రతి ప్రాథమిక రైతుసంఘమూ డెలిగేట్లను రాష్ట్రరైతుసంఘానికి పంపుతుంది. అవసరమైతే జిల్లాసంఘం క్రింద తాలూకా సంఘాలనూ, ప్రాథమిక సంఘాలక్రింద గ్రామ సంఘాలనూ పెట్టుకోవచ్చును. కాని అ.భా.కి. సభ ఎన్నికలలో వీటికి తావులేదు.

2. రాజకీయ తీర్మానాలు 100కి 75 మెజారిటీతో నెగ్గాలి."

ప్రతినిధుల సమావేశానికి సరిహద్దురాష్ట్రం మినహా మిగతా అన్ని రాష్ట్రాలనుంచి 536 మంది ప్రతినిధులూ, 121 మంది అ. భారత కిసాన్ కౌన్సిలు సభ్యులూ హాజరయ్యారు. వివిధరాష్ట్రాల అనుభవాలను సమీక్షచేస్తూ బంకింబాబు, నంబూద్రిపాద్, సుందరయ్య భవానీసేన్, జడ్. ఏ. అహమ్మద్ మున్నగు ప్రముఖులు ప్రసంగించారు.

(10వ పేజీ తరువాయి) మైంది. మన తెలుగుదేశంలో శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారిలాంటి శతావధానులూ, ఆశుకవులూ ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై తమ దృష్టిని లగ్నం చేయటంలేదు. ఆ పండిత రమేశ్‌సీల్ అలాకాక, వృద్ధుడైనప్పటికీ తన కవితాధోరణిని ప్రజల్ని జాగృతిపర్చుటకు ప్రయోగించవలెననే భావంతో రైతు ఉద్యమాన్ని గురించి, క్షామపరిస్థితులను గురించీ బెంగాలీ భాషలో చక్కటి కవిత్వం చెపుతూ ప్రచారం చేస్తున్నాడు. పణిబరుయా, షేక్ గోంహానీ, లంబోదర్ అనే మరోముగ్గురు వంత పాడుతుంటారు. ప్రజాజీవితానికి సంబంధించిన ఎంతటి క్లిష్టసమస్యలనైనా సిద్ధాంత, పూర్వపక్ష, ఉత్తరపక్షాలతో సామాన్య ప్రజలకు కూడ అర్థమయ్యేశైలిలో భాషలో చక్కగా వర్ణిస్తూ రమేశ్‌సీల్, ప్రతికక్షుల వాదాన్ని తుత్తునియలు చేస్తాడు. అందుకనే రమేశ్‌సీల్ పండితుని కవితాగోష్ఠి అంటే, బెంగాలు ప్రజలు చెవులు కోసుకుంటారు.

తర్వాత రంగపూర్ దళానికి చెందిన 'లక్ష్మీదీ' అనే పదేళ్ళపిల్ల కొండజాతుల నృత్యంతో హావభావాలనూ, హస్తవిన్యాసాది భంగిమలనూ రసవత్తరంగా ఒప్పిస్తూ ప్రేక్షకుల్ని ముగ్ధులచేసింది.

హుస్సేన్ మరణగాధనుగూర్చి మహమ్మదీయులు పాడేపద్ధతిలో కరువువల్ల మరణిస్తున్న ప్రజల్ని వర్ణిస్తూ, వారిని రక్షించుటకై గాంధీ - జిన్నాలు కలవాలని ప్రబోధిస్తూ శ్రీనివరణ పండితుని 'జోతా'పాట కూడా చాల బాగుంది. ఇంటిమీద కప్పువేస్తూ పాడే పాట పక్కీలో ప్రస్తుత దేశపరిస్థితులను వర్ణిస్తూ తక్కా స్త్రీల దళం అభినయంచేస్తూ పాడినపాట కూడ బాగుంది.

ఇతరరాష్ట్రాల వైజ్ఞానిక దళాల్లో పంజాబు దళంవారి "మట్టికొడవలి నృత్యం" బాగుంది.

ఠాకూర్ చంద్రసింగ్ ఉజ్వలసందేశం

ఈ నెల 16 వ తేదీని గుంటూరుజిల్లా రైతు మహాసభ సందర్భంలో 60 వేల మంది ప్రజలయెదుట ఠాకూర్ చంద్రసింగ్‌గారిలా ఉపన్యసించారు :

సోదరీ సోదరులారా !

"నా జీవితవిశేషాలను గురించి తెలిసికోవాలని మీకు కుతూహలంవుంటుంది. క్లుప్తంగా చెబుతాను. నేనుకూడా రైతుకుటుంబంనుండే వచ్చాను. కొద్దిపాటి భూమిని నేను సాగు చేసేవాణ్ణి. కాని కొన్నిశేర్ల ధాన్యంకంటే ఎక్కువ పండేదికాదు. పోనీ, ఆభూమైనా మాదికాదు. అదొక జమీందారుది. జమీందార్లక్రింద బానిసత్వం అంటే ఏమిటో నాకు చిన్నతనంలోనే తెలిసివచ్చింది. గాలి, వెలుతురు, నీరు - వీటిపై మనకు హక్కు ఎలావుందో, అలాగే భూమిపైకూడా కష్టపడి పనిచేసేవారికే హక్కుండాలని అనుకుంటూ ఉండేవాణ్ణి. స్వతంత్రంగా బ్రతకాలని అనుకున్నాను. పరాయిదాస్యాల పాలయ్యాను.

"సైన్యంలోచేరాను. సైన్యంలో అనేక విద్యలు, పద్ధతులు, నేర్చుకున్నాను. 15 సంవత్సరాలు సైనికజీవితం గడిపాను. కాని అక్కడకూడా దాస్యం తప్పలేదు. ఆసైన్యం మన జాతీయసైన్యం కాదు. స్వతంత్ర సైన్యంకాదు. జమీందారు తన పొలాన్ని మరో జమీందారుకు అమ్ముకున్నట్లే, ఒక పెట్టుబడిదారుడు మరో పెట్టుబడిదారునికి తన కార్ఖానాలను అమ్ముకున్నట్లే, మన సైన్యాలు కూడా ఒక ప్రభుత్వంనుండి మరో ప్రభుత్వానికి అమ్ముడుపోయే వస్తువులులాగా తయారు చేస్తున్నారు. కాని సైన్యంలో కూడ దేశభక్తి స్వాతంత్ర్యేచ్ఛ లేకపోలేదు.

"1930లో దేశమంతటా స్వాతంత్రోద్యమం ప్రజ్వరిల్లింది. ఆ రోజుల్లో పెషావరులో నిరాయుధులైన ప్రజలపై తుపాకులు కాల్చమని నాపై యుద్యోగి ఆజ్ఞాపించాడు. నేను కాల్చ నిరాకరించాను. పెషావరులో ప్రజలు ముస్లింలనీ, ముస్లింలు హిందువులపై అత్యాచారాలుచేస్తున్నారనీ ఏమేమోచెప్పి, హిందూ ముస్లిం విభేదాలను రెచ్చగొట్ట దలచారు. కాని,నేనా కుతంత్రం గ్రహించాను. నాకురిశిక్ష విధించుతామని బెదిరించారు. దానికి స్వాగతమిచ్చాను.నాపటాలంకూడ నాలాగానేప్రవర్తించింది. దేశమంతటా మీలాంటి ప్రజానీకం ఆందోళనగావించి, నాకు ఉరిశిక్ష తప్పించింది. ఆ రోజుల్లో పార్లమెంటులో మార్గ్‌నాల్డు ఒక ప్రకటన చేశాడు. "గార్వాలీ సైనికులు బ్రిటిష్ సామ్రాజ్య రక్షణకోసం ఎంతోరక్తం ధారవోశారు. అందుచే తిరుగబడ్డ ఈగార్వాలీ సైనికుని (చంద్రసింగ్‌ను) ఉరితీయడం భావ్యంకాదు" అంటూ తానేదో ఔదార్యం ప్రకటించినట్లు నటించాడు. కాని నాకు ఉరిశిక్ష తప్పించింది మార్గ్‌నాల్డు కాదు. భారత ప్రజాశక్తియే నన్ను కాపాడింది. ("ఠాకూర్ చంద్రసింగ్ జిందాబాద్!" అని కేకలు)

"ఈనాడుకూడా నాలో సైనికరక్తం ప్రవహించుతోంది. నేను ఫాసిస్టులపై యుద్ధం చేయడానికి సిద్ధమే. వివిధ రంగాలలో ఈనాడు 8 వేలమంది గార్వాలీ సైనికులు ఫాసిస్టు ముష్కరులతో యుద్ధం చేస్తున్నారని విని సంతోషించాను. అగార్వాలీ సైనికకుటుంబాల నుత్సాహపరచాలని నాకెంతో ఇచ్ఛవుంది. అవకాశముంటే, నేనుకూడా అపనే చేయాలనివుంది. కాని ప్రభుత్వానికి మతిలేదు. నన్ను గార్వాలీ ప్రాంతాలకు వెళ్ళకూడదని నిషేధించింది. నాహృదయం తెలియని ఈ ప్రభుత్వ చర్య ఎంత సిగ్గుమాలినదో మీరే ఊహించుకోండి. (కరతాళధ్వనులు)

"ఇక నాజీవితంలో రెండవదశ జైలుజీవితం. జైలులో అనేక ఇబ్బందులు, కష్టాలుఉండే మాట నిజమే. కాని నేనవి లెక్కచేయలేదు. రాజకీయ ఖైదీలనుండి నేననేక పాఠాలు నేర్చుకొన్నాను; విషయాలు అవగతం చేసుకొన్నాను. ఈనాడు ప్రజాసేవకులతో భుజం భుజంగల్పి నిలబడగల ధైర్యం వచ్చిందంటే వారి అనురాగంవల్లనే. నాకర్తవ్యం ఏమిటో నానిర్దిష్టమార్గమేమిటో స్పష్టంగా గ్రహించగలిగాను. "ప్రపంచంలోని కష్టజీవులంతా ఏకం కావాలి" అన్న మార్క్స్ సందేశం నాకు మంత్రంలా పట్టుబడింది. నాబొందిలో ప్రాణాలున్నంతవరకు రైతుకూలీలకు సేవ జేస్తాను. వారి సేవలోనే ప్రాణాలర్పిస్తాను. (హర్షధ్వనులు)

"ఈరోజున కొంతమంది, రైతుసంఘాలలో చీలికలు తెస్తున్నారని వింటున్నాను. వారు పోటీ సంఘాలు పెడుతున్నారట. ఇది చాల శోచనీయమైన విషయం. కుల మత, జాతి విభేదం లేకండా రైతులందరూ అఖిలభారత రైతుసంఘంలో సభ్యులుగా చేరవచ్చు. రంగాగారు పోటీసభలు పెట్టడంలో అర్థం ఏమిటి? జీవితమంతా దేశంకోసం త్యాగంచేసి, చివరకు ఉరిశిక్షలకు కూడ సిద్ధమైన యోధానుయోధు లెందరో ఈనాడు అఖిలభారత రైతుమహాసభలో పనిచేస్తున్నప్పుడు, పోటీసంఘాలను పెట్టడం అంటే, అలాంటి యోధుల్ని కాలదన్నడమన్నమాట. ఇంతేకాదు. ఆంధ్రలో సుందరయ్య, వాసు లాంటి రైతు సేవకులు, స్వార్థత్యాగులు. ఎందరో యువకులున్నారు. వారి నందరినీ పోగొట్టుకొని రంగాగారు చేసే దేమిటో నా కర్థంకావడంలేదు."

కళలు జీవితంలో ★ చొచ్చుకపోతున్నాయి ★

ఇసుకవేస్తే రాలకుండా జనం. ఏభై వేలమంది చెవులప్పగించి వింటున్నారు. ప్రజాసేవే పరమావధిగా అహోరాత్రాలూ పాటుపడుతూన్న యువతీ యువకులు

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
...."

అని మొదలు పెట్టిన దివ్యగీతం ఏభై వేల హృదయాలలో గింగురు పెడుతోంది. ప్రజల హృదయంలో ప్రవేశించి దివ్యసందేశాన్ని ప్రయోగించింది. ముప్పయి యేళ్ళనుంచి పుస్తకాల్లో మూలుగుతూన్న ది ప్రజాకవి గురజాడ వారి గేయం. రైతుమహాసభలో దీనిపాడిన వైజ్ఞానికదళం అభినందనీయం.

ఇంచుమించు కోడికూతవేళ వరకూ ఏభై వేల ప్రేక్షకులముందు రైతుమహాసభ రెండు రోజులూ వైజ్ఞానిక ప్రదర్శనాలు డాక్టరు రాజారావునాయకత్వాన జరిగాయి.విద్యార్థులు, మధ్యతరగతిమేధావులు మొదలైనవారితో బాటు రైతాంగమంతా ఆటపాటల్ని హర్షధ్వానాలతో అభినందించింది. వాటిలోని ప్రబోధాన్ని స్వీకరించింది. నాటకం, వీధిభాగవతం, బుర్రకథలు, నృత్యాలు, పాటలలో లీనమైప్రజలు ఆనందించారు.

★

నాజరు దళం 'కష్టజీవి' అనే బుర్రకథ చెబుతోంది. జమీందారు దుండగాలు, రైతుల బాధలు కథానాయకుని వీరమరణం ప్రేక్షకుల కళ్ళయెదుటనుంచి నడచిపోతున్నాయి. జమీందారు దుండగాలకు బలిఅయిపోయిన కొడుకును తలుచుకొని కథానాయకుని తల్లి దుఃఖాన్నిచెపుతూంటే ప్రేక్షకుల గుండె చెరువైపోయింది. తమ నాయకుణ్ణి హింసపెట్టుకున్న జమీందారుపై లంఘించనున్న రైతుల క్రోధావేశాన్ని వర్ణిస్తుంటే ప్రేక్షకుల రక్తం ఉడుకెత్తిపోయింది. జలపాతంలాగ మారుమ్రోగిపోతూన్న నాజరుపాటకు అంతా ముగ్ధులైపోయారు. తన కథాచమత్కృతితో కంటతడి పెట్టించేడు. గుండెల్లో మంటలు రగిలించేడు 50 వేల ప్రజానీకానికి నాజరు. కళలు ఎంత పదునైనవి!

రెండవరోజున 'వీరేశలింగం'బుర్రకథలో చక్కని హాస్యం తొణికిసలాడింది. 'పండిత వితలడవాడు ఖండనా, ప్రజాభాష పోషా'అని వంతపాడుతూ నవయుగ నిర్మాత వీరేశలింగంగారి రసవత్తరమైన జీవితచరిత్రను ఉమామహేశ్వరరావు దళం వివరించింది. తెలతెల్లవారే వరకూ దీక్షగా విన్నారు, రైతాంగమంతా.

వైజ్ఞానిక కార్యక్రమంలో గమనించదగ్గది యింకొకటి-వీధిభాగవతం, 'హిట్లరు పతనం' అన్నది. 'వెడలె హిట్లరు పతకూ'అని లగువులు వేసుకొంటూ హిట్లరు, ముస్సోలినీ, టోజోలు ప్రవేశించి తమ ప్రతాపాన్ని చెప్పుకుంటారు. క్రమేపీ శృంగభంగం మొదలవుతుంది. దుష్టత్రయం ఒకరికొకరు పట్టుకొని విలపిస్తారు.

"రష్యదేశాన యున్న రాయబారి
ఎర్రసేన దలాదలార్ యింతయుండు"

అందనా వేయలేక నన్ ముంచేసిట కొంపకూలెను. శత్రుల కొర్కెడీరె అంటూ హిట్లరు దిగులు పడతాడు. ముస్సోలినీ టోజోలు ఒకొక్కరే జారిపోతారు. ఎర్రసైనికులు హిట్లర్ని వెన్నాడి హతమార్చుతారు. నేటి రాజకీయాల్ని యింత చక్కటి కళారూపంలోపెట్టి ప్రజాహృదయానికి సుబోధకం చేసిన యీ విజ్ఞాన ప్రచారకులు మన కళలను ప్రజాహృదయంలోనికి తీసుకుపోతున్నారంటే అనందించని వారెవరు?

ఇదేవిధంగా 'బతకమ్మ' నృత్యం వైజ్ఞానిక కార్యక్రమంలో చాలా ఆకర్షణీయమైనది. నిజామాంధ్ర గ్రామాల్లో స్త్రీలు పండగపర్వాలకు యీ నృత్యాన్నిచేసి, తమ కళాఉత్సాహలను ప్రదర్శిస్తుంటారు. ఈ కళారూపాన్ని దేశసైనికులైన వైజ్ఞానికదళం సోదరీమణులు దేశభక్తిప్రబోధానికి వినియోగించేరు. కరువు నృత్యంలో, కరువుకాటకాలనే రాక్షసులకు తిండిదొంగ అనే మహారాక్షసితోడై ఎలా ప్రజల ప్రాణాల బలిగొన్నారో చూపించారు. ఈనృత్యాన్ని తగ్గించి ఇంకా కొంతమెరుగులు పెడితే మరింత ఆకర్షణీయంగా వుంటుంది.

బానిసలోనూ, ప్రదర్శించిన తీయనోస్తూ సమిష్టి వ్యవసాయ నృత్యం తెలుగువారంతా గర్వింపతగ్గది అనిచెబితే అతిశయోక్తికాదు. 'తొలిమబ్బు మెరసి' 'తొలకరికురిసి'నప్పటి నుంచీ రైతులు దేశాన్ని అవరించుకున్న అకలిమంటలను తీర్చేవరకూ వ్యవసాయపు విధానాన్నీ, కర్షకుల కర్తవ్యాన్నీ, అత్యద్భుతంగా నృత్యగానాలతో యిందులో ప్రదర్శించబడింది. దుక్కులు దున్నడం, నాటులు వేయడం, కలుపుతీయడం, కోతలు కోయడం, కుప్పలు వేయడం మొదలైనవన్నీ చక్కని నృత్యగానాలతో చూపబడ్డాయి. ప్రపంచానికి అన్నదాతలైన రైతులు పుష్కలంగా పండిన తమ పంటలను చూసి,

"రైతుకూలీ రక్తమందు
రాజనాల పంటపండె
తిండికొరతే తీరిపోసుండె
ఓ కూలిరైతు అన్నలారా
పొలిగటుగు వరియబడుకండోయ్"

అని ఆనంద నృత్యం చేస్తారు. పాటలు రాసి స్వరాలు వేసిన కోగంటి గోపాల కృష్ణయ్య, నాజరు, నృత్యరూపము పెట్టిన డాక్టరు రాజారావు యెంతటి ప్రశంసకయిన అర్హులు.

గోపాలం పిడేలుతో పాడిన 'స్టాలినో ఏ ఎర్రసైన్యం' ఉత్తరవిశాఖ కరువునుగురించి పాడినపాటా శ్రోతల్ని ముగ్ధులను చేసింది. కాని పాటల కూర్పులోవున్న వెలితి సరిదిద్దుకుంటే యివి యింకా హృదయంగమంగా ఉంటాయనడానికి సందేహంలేదు.

రెండవ రోజున ప్రదర్శింపబడిన 'ముందడుగు' అన్న నాటకంకూడా చాలా చక్కనిదని చెప్పక తీరదు. కథ యించుమించు 'కష్టజీవి' పక్కనే నడిచింది. పాత్రపోషణ, సంభాషణలు సాఫీగా నడిచేయి. కాని కొన్ని రంగాలు మరీ చిన్నవైపోయేయి. రెండు మూడు రంగాల్లో ప్రదర్శించిన సంఘటనల్నే ఒక రంగంలో సమకూర్చుకోవడం అసాధ్యం కాదు.

కొన్ని చిన్నచిన్న లోపాలున్నప్పటికీ నటులందరూ సమర్థతతో సహజంగా నటించేరు. ఆంధ్రనాటక రంగంలో పాత్రహృదయాన్నెరిగి నటించే మన కొద్దిమంది నటుల ప్రక్కను స్థానం సంపాదించుకున్నారు అద్బయ్యగారు.

రైతుమహాసభ వైజ్ఞానిక కార్యక్రమము లనీ, పునరుజ్జీవిస్తున్న మన కళా చైతన్యాన్ని తెలుపుతాయి. ప్రజలను వెలివేసిన కళల్ని తాము చేసిన తప్పు తెలుసుకొని దిద్దుకుంటున్నయని స్పష్టమవుతూంది ప్రేక్షకులందరికీ. దేశసేవే నిత్యవ్యాసంగం గాగల యీ వైజ్ఞానికమండలి ప్రజావిజ్ఞానాన్ని శీఘ్రవంతముగా పెంపొంద చేయగలదనీ, ఆంధ్ర ప్రజాహృదయానికి విశేషంగా తోడ్పడి కళలకు ఉన్నతస్థానాన్ని చేకూర్చగలదనీ ఆశిస్తున్నాం.

లక్షమంది ప్రజల తీర్పుకి బద్ధులమవుదాం

(5 వ పేజీ తరువాయి) అహోరాత్రాలు ప్రజలకోసం పాటుబడుతున్నారు. ప్రజాసంస్థలను నిర్మించి, వాటిని బలపరుస్తున్నారు. కాంగ్రెస్ స్థాపించిన సుసంప్రదాయాలను ముందుకు తీసుకుపోతున్నారు ఇలాంటి ఈరెండుసంస్థల మధ్య కక్షలు పెరగడమంటే, గ్రామజీవనం అల్లకల్లోలం అవడమన్న మాటే నని మనవి చేశాను. ఈ దుస్థితికి దారితీయవద్దు. ఐక్యతా మార్గానికి రండని ఎన్నోసార్లుప్రార్థించాము. మొన్నమొన్నటి సంగతి. జిల్లాకాంగ్రెసునాయకుల్లో ప్రముఖులు కల్లూరి చంద్రమౌళిగారు. ఇంత గొప్ప జిల్లా మహాసభలో వారు లేకపోతే ఎలాఅని, ఆహ్వాన సంఘాధ్యక్షులు అమ్మయ్యగారు వారివద్దకువెళ్ళి ఆహ్వానించారు. వారిచ్చిన జవాబు చూడండి: "రోజూ తిట్టిపోస్తున్నాను. సిగ్గులేదా? ఏ మొహం పెట్టుకొని వచ్చావు పిలవడానికి?" అని అన్నారు.

చంద్రమౌళి ద్రోహం

ఎరువులు సక్రమంగా సప్లయిచేయించడానికి రైతుసంఘ సభ్యులు, కమ్యూనిస్టులు ఎంత కష్టపడి పనిచేశారో మీకు తెలుసు. కాని, చంద్రమౌళిగారు ఏంచేశారో చూడండి. ఈయన మీకు వీసమెత్తు ఎరువునయినా సప్లయిచేయించలేదు. పైగా తన ఎరువుల షాపు ద్వారా దొంగవ్యాపారం సాగించారు. అధికలాభాల కోసం రైతుల రక్తాన్ని జుర్రుతున్నాడు. అయితే, ఇంతవరకు ఈయన్నెందుకు బయటపెట్టలేదని మీరడగవచ్చు. ఈయనచేస్తున్నద్రోహం తనకొక్కనికే సిగ్గుచేటు కాదు. అతన్ని కనిపెంచిన కాంగ్రెసు మహాసంస్థ కంతటికీ సిగ్గుచేటు; భారతదేశానికే సిగ్గుచేటు - మీకూ, మాకూ కూడా సిగ్గుచేటు. ప్రజల మధ్యకు ఇలాంటివారిని తెచ్చి పనిచేయిస్తే బాగుపడగలరని ఆశించాము. కాని ఆ ఆశలు అడియాసలయాయి. ప్రజల కోసం పనిచేయండని మేముచేసిన ప్రార్థనలన్నీ వమ్మయాయి. 1,70,000 సభ్యత్వంగల మీ రైతుసంఘాన్ని విచ్ఛిన్నంచేయ పూనుకున్నారు.

మీ గుంటూరు జిల్లాలోనే 1200 మంది కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, మరో 1200 మంది రైతుసంఘ సేవకులు పనిచేస్తున్నారు. వీళ్ళల్లో దొంగ వ్యాపారం సాగిస్తున్నవారి నొక్కరినయినాచూపించండి. కమ్యూనిస్టుల్లో అలాంటివారి నొక్కరినయినా పట్టియీవేదికపైకి తీసుకురండి: ఈక్షణంలో అతన్ని పార్టీనుంచి తొలగించి, "ద్రోహీ! దేశానికీ, పవిత్రమైన పార్టీకెండాకు కళంకం తెచ్చావని మీ ఎదుటనే అతని ముఖాన ఉమ్మివేస్తాను. కాని మీరు అలా ఒక్కర్నికూడా చూపించలేరు. ఎందువల్ల? వీరంతా చిత్తశుద్ధిగల ప్రజాసేవకులు - మీ బిడ్డల్లో మణిపూసలు. చంద్రమౌళిగారు గౌరవనీయుడైనకాంగ్రెసు నాయకుడే. కాని, వచ్చిన చిక్కేమిటంటే, ప్రజాసేవకాయన ఏనాడో నీళ్ళొదలారు. ప్రజాసేవే జీవితంగా గడుపుతున్న మీబిడ్డల్ని అనరాని మాట్లాడుతున్నారు. అవిధంగా మీ ఉద్యమాన్ని బలహీనపరిచి, మీ గొంతుకోయడానికి పూనుకున్నారు.

మీ బిడ్డలమయినమమ్మల్ని తిట్టడమంటే, మిమ్మల్ని దూషించడమన్నమాటే. మీ చేయూతతో మేము నిర్మిస్తున్న ఈ సంఘాలను విచ్ఛిన్నంచేయ తలపెట్టడమంటే, మీ గొంతు కోయడానికి పూనుకోవడమన్నమాటే.

ఇలా మమ్మల్ని అడిపోస్తున్నవారంతా దేశభక్తులే. నిర్మాణ కార్యక్రమం తమ ఆశయమని వీరు బాకాలూదుతారు. సత్యవ్రతులమని తెగచెప్పుకుంటారు. కాని,క్రియలో వీరు తలపెట్టిన కార్యక్రమమేమిటి? ఉన్న ప్రజాసంస్థలను విచ్ఛిన్నంచేసి, ప్రజాబలాన్ని కుంటుపరచడం. ఇక నిత్యజీవితంలో వీరి సత్యవ్రతం ఏమిటి? మాపై లేనిపోని పచ్చి అబద్ధాలు వేలకుపైగా ప్రచారం చేయడం. వీళ్ల ప్రచారంలో ఏమాత్రం సత్యమున్నా, మేము విచారించేవాళ్ళం కాము. మా తప్పులు దిద్దుకోడానికి ప్రయత్నించేవాళ్ళం.

గర్వపడడానికి బదులు

వీళ్ళ పచ్చిఅబద్ధాల్లో మచ్చుతునక ఒకటి- మేము ప్రభుత్వం దగ్గర్నుంచి డబ్బు తీసుకుంటున్నామనడం. ఈ కాంగ్రెసు నాయకులు పెద్దలు. మాకన్నా ఎంతో కాలం ముందునుండీ స్వాతంత్ర్య సమరంలో పాల్గొంటూ, కాకలుదీరిన యోధులు. వీరికి నా దొక మనవి. ఆంధ్రదేశంలోని కాంగ్రెసువాదుల్లో తమ ఆస్తినంతటినీ ఉద్యమానికి అర్పించిన వారెందరో లెక్కపెట్టండి. ఆ వరసనే, ఆంధ్ర కమ్యూనిస్టుల్లో తమ ఆస్తినంతటినీ అమ్మి ఉద్యమాని కిచ్చినవారిని లెక్కపెట్టండి. అప్పుడు మీగుండెమీద చేయిపెట్టుకొని చెప్పండి - మేము ప్రభుత్వం డబ్బు తిని బ్రతుకుతున్నామో, లేక ప్రజాసేవకుల త్యాగాలపై ఆధారపడిఉన్నామో!

1920, 30 జాతీయోద్యమ రోజుల్లో కాంగ్రెసువారు ప్రభుత్వం డబ్బు తింటున్నారని ఆడిపోసిన ప్రజా ద్రోహులు ఎందరో వున్నారు. ఉదాహరణకు తిలక్‌నిధి విషయంలో జరిగిన దుష్ప్రచారం జ్ఞప్తికి తెచ్చుకోండి. అనాడదెంత అసత్య ప్రచారమో ఈనాడు కాంగ్రెసు నాయకులు మమ్మల్ని గురించి చేస్తున్న ప్రచారం అంత అసత్యం. ఇది మీ కందరికీ తెలుసు. చిత్రం ఏమిటంటే, ఈ ప్రచారం పచ్చిఅబద్ధాల మూట అని ఈ కాంగ్రెసు నాయకులకూ బాగా తెలుసు

వచ్చిన చిక్కేమిటంటే, ఈ కాంగ్రెసు నాయకులు గత పదేళ్ళుగ ప్రజల్లోకివెళ్లి పని చేయడంలేదు. ప్రజాసేవను వీరు మరచిపోయారు.ప్రజల్లోకివెళ్ళినట్లయితే కమ్యూనిస్టుల కెక్కడనుంచి డబ్బు వస్తుందో తెలుసుకునేవారు. ఇరవైఏళ్ళనాటి పూర్వపుణ్యంమీద ఆధారపడి ఉన్నారీనాయకులు. ఈనాడు వీరు చేస్తున్నదంతా ఇళ్ళల్లో కూర్చొని కమ్యూనిస్టులను, రైతుసంఘ సేవకులను అనరాని మాటలనడం, నీచమైన దుష్ప్రచారానికి ఒడిగట్టడం.

ఆంధ్ర స్త్రీలపై అపవాదు

ఈ నాయకులకు అత్యంత ప్రియమైన మరో పచ్చిఅబద్ధం ఉంది. ఇటీవల బందరులో జరిగిన విద్యార్థి కాంగ్రెసు సభలో ఉపన్యసిస్తూ రంగా ఏమన్నాడో విన్నారా? స్త్రీలను సంఘాల్లోకితెచ్చి వారిని పాడుచేస్తున్నామట. కమ్యూనిస్టులు తమ ఉద్యమాభివృద్ధికి స్త్రీల శీలాన్ని కూడా ఉపయోగిస్తున్నారట. ఈ ఉద్యమాల్లో పాల్గొంటున్న స్త్రీలు నీతినియమాలులేని వట్టి కులటలయిపోతున్నారట.

ఈ మహాసభను చూడండి. ఇక్కడకు వచ్చిన ఇన్నివేలమంది ప్రజానీకంలో దాదాపు నాలుగోవంతు స్త్రీలున్నారు. రంగావేసిన అఘనింద వీరందరి నెత్తిపైని పడుతుంది. మీ తల్లులు, మీ అక్కచెల్లెండ్రు, మీ ప్రియతముల నిలా బూతులు తిడుతున్న ఇతన్ని దేశభక్తుడని నేననను. కారుకూతలు కూసే వట్టితుంటరిగా లెక్కకడతాను. ఇతను వేస్తున్న నిందలు కమ్యూనిస్టుపార్టీకి, పి. సి. జోషీకి కాదు తగులుతుంట. యావత్తు ఆంధ్రదేశాన్నే ఇతను అగౌరవ పరుస్తున్నాడు; ఆంధ్ర నారీ లోకాన్నే అపవాదు పాల్జేస్తున్నాడు. ("సిగ్గు సిగ్గు" అని కేకలు)

కాంగ్రెసు ఉద్యమం మహోన్నత స్థాయికి పోతున్నరోజుల్లో ఎందరో స్త్రీలు ముందుకు వచ్చి, ఆఉద్యమాల్లో పాల్గొన్నారు. జస్టిస్ పార్టీవారు, అభివృద్ధి నిరోధకులు, ఛాదసులు వారినిగురించికారుకూతలు కూసేవారు. ఈనాడు - 20 యేళ్ళ అనుభవంతో జాతీయోద్యమం సానదేరిన ఈనాడు—రంగా ఆలాంటి కారుకూతలే కూస్తున్నాడు. ఇలాంటివాడు జాతీయోద్యమంతో పాటు అభివృద్ధిపొందుతూన్న నాయకులని ఎవరయినా అనగలరా? నానాటికి పతనమయిపోతూ, చివరకు సోదర ప్రజల మీదే కారుకూతలకు ఒడిగట్టిన నీచుని నాలి.ఇలాంటివారి పాడునోళ్ళను మూయించవలసినబాధ్యత మీపై ఉంది.

మీగ్రామాలకు ఎవరయినా తుంటరులు వచ్చి మీ స్త్రీలను ఇలా అనరాని మాటలంటూ ఉంటే, ఏమిచేస్తారు? లాఠీతీసి తల పగలగొడతారు. కాని అలాంటి కూతలే కూస్తున్న ఈ నాయకులకు అగతి పట్టించలేదు. ఓర్పువహించాం. ఎందువల్ల? మా మహిళా కార్మేడ్సుపట్ల అభిమానం తక్కువయి కాదు, గౌరవం లేకకాదు. వీరూ మన దేశంలో ఉండవలసినవారే. నలుగురూ 'ఛీ' అంటే, వీరు బుద్ధితెచ్చుకుంటారనే నమ్మకం మాకింకా ఉంది. కాబట్టే ఇంతవరకు ఓర్పు వహించాం. (మిగతా 14 వ పేజీలో)

కడియాల గోపాలరావుగారి అధ్యక్షోపన్యాసం

(7 వ పేజీ తరువాయి) సంఘాలకు ఎక్కడలేని ప్రాధాన్యతకల్పించడమూ, యదార్థప్రజా ఉద్యమాలను మరుగుపరచడం జరుగుతోంది. రాష్ట్రంలోవున్న ప్రజాఉద్యమాల ప్రతిబింబం పత్రికల్లో కన్పించడంలేదు. ఇది పత్రికా సాంప్రదాయాలకు విరుద్ధం.

ఆంధ్ర కాంగ్రెసు నాయకులలో హెచ్చుమంది జైళ్ళనుంచివిడుదలై వచ్చారు. వీరంతా కాంగ్రెసు అసెంబ్లీపేరుతో ఒక సంఘంగా ఏర్పడ్డారు.

ఆంధ్రలో 10 సంవత్సరముల నుంచీ ప్రజాసంస్థలుండగా ప్రత్యామ్నాయంగా పోటీసంస్థలు పెట్టాలని, ఉపసంఘాలు నియమించారు. పోటీసంఘాలను ప్రోత్సహిస్తున్నారు.

ప్రజా ఉద్యమాలను నిర్మించడం కాంగ్రెస్ బాధ్యతేకాని, దురదృష్టవశాత్తు కాంగ్రెస్ అసెంబ్లీలు ప్రజాసంఘాలకు పోటీగా సంఘాలుపెట్టి ఉద్యమాలను విచ్ఛిన్నంచేయడానికి కార్యక్రమం తీసుకున్నాయి. కాంగ్రెస్ అసెంబ్లీ నాయకులు కాంగ్రెసు సత్సాంప్రదాయాలకు వ్యతిరేకంగా తీసుకున్న యీ వైఖరిని ఆంధ్రరైతాంగము ప్రతిఘటిస్తుంది.

దేశాన్ని ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపట్ల నాయకులు తమ శక్తిని కేంద్రీకరించాలి. కేంద్రశాసనసభలో కాంగ్రెసు — లీగు ఐక్యతతో బ్రిటిష్‌ప్రభుత్వాన్ని ఎలాంటి దావుదెబ్బలు కొట్టవచ్చునో ఋజువైంది. కేంద్రశాసనసభలోని ఘట్టాలు దేశప్రజల్లోను ప్రపంచ ప్రజల్లోనూ నూతన ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నాయి. వేవెల్ గాథరాసది,లండన్ పరుగెత్తాడు. దేశంలోఏర్పడిన ప్రతిష్టంభనకు పరిహద్దురాష్ట్రంలోఏర్పడిన కాంగ్రెస్ మంత్రివర్గం తొలిదెబ్బ కొట్టింది. కేంద్రశాసనసభలో కాంగ్రెస్, లీగులు కలసి పనిచేయడం వల్ల కలిగిన విజయాలను కాంగ్రెసువాదులు గుర్తించాలి. ప్రతి రాష్ట్రంలోను మిశ్రమ మంత్రివర్గాన్ని ఏర్పాటుచేయాలి. అప్పుడే బ్రిటిష్‌ప్రభుత్వాన్ని తొలగదీసి జాతీయప్రభుత్వాన్ని నిర్మించడానికి అవకాశం కల్గుతుంది.

జపాన్ వ్యతిరేక యుద్ధవ్యూహంలో మన దేశం కీలకస్థానం వహిస్తోంది. అందుచే ప్రపంచ ప్రజలు శాన్‌ఫ్రాన్‌సిస్కో సమావేశానికిముందే మన జాతీయ నాయకులను విడుదలచేయాలని బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నారు. శాన్‌ఫ్రాన్‌సిస్కో సమావేశంలో భవిష్యత్ ప్రపంచ నిర్మాణాన్ని గురించి చర్చించబడుతుంది. ప్రపంచంలో ప్రజలు సాధించిన విజయాలను రక్షించడానికి అన్ని దేశాల స్వాతంత్రాన్ని కాపాడడానికి ఒక అంతర్జాతీయ సంస్థ ఏర్పాటుకాబోతోంది. ఇట్టి అనుకూల పరిస్థితుల్లో మన దేశంలోకూడా మన బాధ్యతను నెరవేర్చాలి. ప్రతిరాష్ట్రంలో కాంగ్రెసు - లీగు ఐక్యతతో మిశ్రమమంత్రివర్గాలు ఏర్పడాలి. కేంద్రంలో జాతీయ ప్రభుత్వ స్థాపనకు కృషి చేయాలి. మనలో ఐకమత్యంలేదని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు చెప్పే సాకుకు తావులేకుండా చేయాలి. జరుగనున్న శాన్‌ఫ్రాన్‌సిస్కోసమావేశానికి ప్రజాప్రతినిధులను పంపాలి. భారతదేశ స్వాతంత్ర్యాన్ని సాధించాలి.

నేటి సమస్యలు

మీ జిల్లా సంఘం పరిష్కరించవలసినన సమస్యలు ఎన్నోవున్నాయి. మెట్టప్రాంతాల్లో అహారసమస్యను పరిష్కరించడానికి వెంటనే ప్రయత్నించాలి. మీ జిల్లాలో మెట్ట ధాన్యాలకొరత ఎక్కువగావుంది. వకాలంలో చాలినన్ని ధాన్యం దిగుమతి చేసుకోవడంలేదు. వరిధాన్యాల సరఫరా లోపభూయిష్టంగావుంది. వెంటనే జిల్లాసంఘం సమగ్రమైన ప్లాన్ తయారుచేసి, ప్రజా సమీకరణచేసి, ప్రభుత్వాన్ని కదిలించాలి. లేనిచో 2, 3 మాసాల్లో మెట్టప్రాంతాల్లో కరువుపరిస్థితు లేర్పడవచ్చు

పి. సి. జోషి ఉపన్యాసం

(13 వ పేజీ తరువాయి)

వీళ్ళు ఎంత నీచానికి ఒడిగట్టారో చెప్ప టానికి 'వెంగమ్మ' నాటకం ఒక నిదర్శనం. అందులో సుందరయ్యమీద ఆరోపించని అసహ్యాకరమైన నిందలేదు. ఎందుకు వీరింత నీచానికి పాల్పడుతున్నారు ? మరో విధంగా కమ్యూనిస్టు పార్టీని ఎదుర్కోలేరు కాబట్టే. కమ్యూనిస్టుపార్టీ అనుసరిస్తున్నది దేశభక్తి యుతమైన పాలసీ. అది తప్పు అని వీరుప్రజ లకు నచ్చచెప్పలేకపోయారు. ఇక ప్రజలకు మాపై రోతకలిగిస్తే తమ కార్యం నెరవేరు తుందని ఇలాంటి నీచప్రచారం ప్రారంభిం చారు. కాని, దీని ఫలితమేమిటి ? ప్రజలకు మాపైని రోతపుట్టలేదు సరిగదా, ఈ నాయ కులు ఎంతవరకు పతనమయారో నానాటికి బయటపడుతూంది.

కమ్యూనిస్టులు ప్రజాసేవకులు. వారిని ప్రజలనుండి దూరంచేయడం ఎవరికీ సాధ్యం కాదు. వారి నెదుర్కోవడమంటే, ప్రజలనే ఎదుర్కోవడమన్న మాట.

ప్రజాద్రోహులు

ఇదంతా చెప్పవలసి వచ్చినందుకు నా కెంతో అయిష్టంగాఉంది. ఈ గొడవంతా మీ ముందుపెట్టే వాడినేకాదు. కాని ఈనాడు ఈ నాయకులను మీముందు దూర్పారబట్టవల సిన అవసరం వచ్చింది. వీరిలో దేశభక్తి ఏకోశానాలేదు. కాంగ్రెసు స్థాపించిన మహో న్నత సాంప్రదాయాలు వీరిలో మచ్చుకైనా మిగిలిలేవు - ఈవిషయం మీ ఎదుటపెట్ట వలసిన అవసరం ఏర్పడింది.

ఒక ఏడాదిపాటు వీరిచేష్టలను సహించాం. ఈ కుతంత్రాలు కట్టిపెట్టి ప్రజాసేవకు కలసి రండని లెక్కలేనన్నిసార్లు ప్రార్థించాం. ఈ ప్రార్థనలను మా బలహీనతకు నిదర్శనాలుగ వారు లెక్కగట్టారు. మా లోపాలను కప్పి పుచ్చుకోవడం కోసమే ఇలా ప్రాధేయపడు తున్నామని భావించారు. ఐక్యకృషిద్వారానే ప్రజలకు మేలుచేయగలమనే జ్ఞానం వారికి లేకపోయింది. మాప్రార్థనలను కాలదన్నారు. విచ్ఛిన్న కార్యక్రమం తలపెట్టారు. ప్రజా బలాన్ని కుంటుపరచి, ప్రజలకు ద్రోహం చేయడానికి తెగిస్తున్నారు. మాతో రాజకీయ భేదాభిప్రాయాలుంటే మేము సహిస్తాము. చర్చలద్వారా వాటిని తొలగించడానికి పాటు పడేవాళ్ళం. అలాంటి దేదీలేకపోయినా, వారి దుష్ప్రచారాన్ని సహించాం. మా సర్వశక్తు లను ప్రయోగించి వారి నెదుర్కోలేదు.కాని, నేడు వారు గ్రామజీవితాన్నే అల్లకల్లోలంచేయ పూనుకుంటున్నారు. దీనిని మేమిక యేమా త్రం సహించము. 1,70,000 సభ్యత్వం గల మీరైతు సంఘానికి పోటీసంఘం పెట్టబో తున్నారు. రైతు మాతలను, రైతు సోదరీ మణులను అపవాదుల పాల్జేసి ఈతుంటరి మూక ప్రజాసంస్థలనేమి స్థాపించగలదు?అది కలలోని మాట.

లక్షమంది ఎదుట నిలబడదాం

ఇక వీరి ప్రయత్నాల ఫలితం ఏమవు తుందో చూడండి. రాష్ట్రంలో వారిపక్షంవారూ ఉన్నారు, మా పక్షంవారూ ఉన్నారు. ఏపక్షా నికి చెందనివారుకూడా వేలకొలది ఉన్నారు. కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీల తగాదాలు వీరిని నిస్పృహతో ముంచివేస్తాయి. అంతే గాదు, గ్రామాల్లో ప్రతికుటుంబంలోను కొం దరు కాంగ్రెసు పక్షంవారున్నారు; మరికొం దరు కమ్యూనిస్టుపక్షంవారున్నారు. పోటీ సంఘాల పనాదంవల్ల ప్రతికుటుంబంలోను అంతఃకలహాలు బయలుదేరక తప్పవు. అంటే, గ్రామజీవనంతోపాటు కుటుంబజీవనం కూడా అల్లకల్లోలంకావడానికి ఈ నాయకుల చేష్టలు దారితీస్తున్నాయి. ఇంతకన్నా ప్రజా ద్రోహం ఇంకొకటుండదు. ఇంతేకాదు. అన్నదాతయైన రైతునే స్వలాభపరాయణుని గాను, తిండిదొంగగాను చేయ తలపెట్టారు. బస్తాధాన్యం ధర రు. 12 ఉండాలని వీరుచేసే వినాదంయొక్క అర్థం ఇదే. తక్కినవర్త కులు, పరిశ్రమదారులుకూడా ఇలాంటి వినా దాలే లేవదీస్తే ఇక ప్రజాజీవనం ఏంకావాలి? మమ్మల్ని మీనుండి దూరంచేయడానికి, మీ సంఘశక్తిని విచ్ఛిన్నం చేయడానికి అన్ని తంత్రాలు పన్నారు. ప్రభుత్వంవద్ద డబ్బు తీసుకుంటున్నామన్నారు. ప్రీం కిలాన్ని చెడగొడుతున్నామన్నారు; రైతుల్నే తిండి దొంగలుగ చేయయత్నించారు. కాని రైతుల్లో ఉన్న దేశభక్తి, ప్రజాసేవా తత్పరత ముందు ఇవన్నీ పనికిరాలేదు. దినదినం, మన ప్రజల్లో ఉన్న బ్రిటిషు సామ్రాజ్యవ్యతిరేకత మాపైకి మళ్ళించడానికి చూదారు. మేము ప్రభుత్వ ఏజంట్లమన్నారు; అందుకే మాటాడితే ఏరు వుల మొదలైనవాటి పేరుచెప్పి, మిమ్మల్ని ప్రభుత్వపు కాళ్ళవద్ద కీడ్చుతున్నామంటు న్నారు. మీరే చూడండి, ఇలా అంటున్న కాంగ్రెసువాదుల్లో అనేకులు దొంగవ్యాపారా నికి మద్దతుగా నిల్చి, ప్రజలనుండి దవం గుంజి, తమ అవసరాలను తీర్చుకోడానికి ప్రభుత్వోద్యోగులకు లంచాలుమేపుతున్నారు. ఈరకమే మమ్మల్ని దుమ్మెత్తిపోయడం. ఈ రకమే గాంధీతాత చెవినిల్లుకట్టుకొని అసత్యాలను వల్లించడం. గాంధీ పేరుతోకూడ వీళ్ళు మాపై రాళ్ళు రువ్వుతున్నారు. కాని గాంధీజీ వీళ్ళకేమి చెప్పారో మాకు తెలుసు. వీళ్ళు కూస్తున్న ఈ కారుకూత లతో గాంధీజీ ఏమాత్రం ఏకీభవించడం లేదని నేను బాధ్యతగల వ్యక్తిగా మీతో చెబుతున్నాను. "మీరంటున్నదంతా నిజ మయితే మీ సభ్యజల ఎదుటే అదంతా విప్పి చెప్పకూడదా ?" అని గాంధీజీ వీళ్ళతో మొహం వాచేలా అన్నారు.

మీ సంఘశక్తి విచ్ఛిన్నం కాకుండా కాపాడ దీక్షబూనాం.

అందుచేతనే వారికి చిత్తశుద్ధితో ఒక సూచన చేస్తున్నాను. కృష్ణాజిల్లాలోగాని, గుంటూరుజిల్లాలో గాని ఎక్కడయినాసరే ఒక లక్షమంది ప్రజలతో మహాసభ ఏర్పాటు చేస్తాం. ఆ సభికులలో మీరు మీపాలసీని వివరించండి, మేము మా పాలసీని వివరి స్తాము. ఏది మంచిదని ప్రజలు నిర్ణయిస్తే దానిని మారుమాటాడకుండా అందరం శిరసా వహిద్దాము. ఐక్యతతో ప్రజాసేవకు సాగి రండని ఇదే నా కట్టకడపటి విజ్ఞప్తి. ప్రజల యందు మాకు విశ్వాసముంది - దేశానికిమేలు కూర్చే నిర్ణయం చేయగలరనే నమ్మకం ఉంది. అందుకే ఈసూచన చేస్తున్నాం. వారికి ఆ నమ్మకం, విశ్వాసం ఉంటే రమ్మనండి.

ప్రధాన సమస్య

ఈసారికూడా వారు రాకపోతే ఇకవారినీ, వారి విచ్ఛిన్నకర పోకడలనూ ఎదుర్కోక తప్పదు. అన్నిటికన్నా ప్రధాన సమస్య దేశ స్వాతంత్ర్యసమస్య. ప్రజలనుబాధిస్తున్న దుర్భ రబాధలను తొలగించడం ప్రధానం. దేశదా స్యాన్ని, ప్రజల బాధలను ఇంకా దుర్భరం చేసే పోకడలు పోతున్నారు కాళేశ్వరరావు రంగా, చంద్రమౌళి వగైరాలు. కమ్యూనిస్టుల పైనున్న ద్వేషం కొద్దీ, ప్రజా ద్రోహులయిన చల్లపల్లి జమీందారు, సి. వి. రెడ్డి మొదలైన దొంగవ్యాపారులను తమకు అండగా తీసు కొంటున్నారు. ఈపోరణే ఇంకా సాగుతే పవిత్ర కాంగ్రెసుమహాసంస్థ కేగతిపడుతుందో ఊహించడానికే భయంగా ఉంది. గ్రామ గ్రామాన ఈ విచ్ఛిన్నకారులను, ఈ ప్రజా ద్రోహులను ఎదుర్కొని పోరాడకతప్పదు. పోరాడుతాం. ఇది రెండు పక్షాలమధ్య పోరా టంకాదు. దేశద్రోహకర శక్తులకు, ప్రజా స్వాతంత్ర్య శక్తులమధ్య పోరాటం. ఇది ఒక రూపంలో స్వాతంత్ర్యపోరాటం. ఈ పోరాట ములో మీరు, మీ సంఘ సేవకులు తప్పక విజయం సాధిస్తారు. ఇందుకు సందేహంలేదు. చూడండి, ఒక ఏడాదిగా వారెన్నిపన్నాగాలు పన్నినా, ఎంత వ్యతిరేక ప్రచారం చేసినా మీ అఖిలభారత రైతుసంఘం 5 లక్షలనుండి 8 లక్షలకు పెరిగింది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం ఒక లక్షనుండి 1,70,000 కు పెరిగింది. ఇలా దినదినాభివృద్ధి పొందుతూన్న ప్రజాశక్తిని విచ్ఛిన్నపరచరు రంగా, కాళేశ్వరరావులు తమ విచ్ఛిన్న కార్యక్రమాన్ని మార్చుకోక పోతే, జీవితంలో ఎన్నడూ ఎరుగని పాఠాలు నేర్చుకోగలరు. మీరు రైతుసంఘాల నింకా విరివిగా స్థాపించండి. వాటి నాయకత్వాన నిర్మాణాత్మకకృషి చేయండి. ఈకృషిని చూచి చిత్తవైకల్యంలేని కాంగ్రెసువాదులంతా మీ ఉద్యమంవైపు ఆకర్షింపబడతారు. మీసంఘ శక్తిని అభివృద్ధి చేసుకోండి. దాని అండతో గ్రామజీవితాన్ని సుఖవంతం చేసుకోండి. విద్య వ్యాపకంకు ఎక్కడా స్థానంలేకుండా చేయండి, మీ సంఘాలు, మీకు సంఘసేవ చేస్తున్న కమ్యూనిస్టుపార్టీలు ఉక్కుకోటలు. వీటిని పగలకొరకాలనుకున్నవారివల్ల విరుగు తాయి. కాని ఒకరివల్ల విరగడం మాకిష్టంలేదు. అందరం ఏకమై మన దాసిక సంకెళ్ళను పగలకొరకాలనే మాకోరిక. మా కర్తవ్యంద్రు లయిన మీరు, మీ నిర్మాణాత్మక కృషి ద్వారా ఈ ఐక్యతకు దారితీయాలి. తగాదా లను పోగొట్టి కాంగ్రెసు, కమ్యూనిస్టులను ఒక్కటాటిమీదికి తేవాలి. బ్రిటిష్యాండమైన మీ శక్తికి ఎదురుండదు. దానిని విచ్ఛిన్నం చేయ కంపెట్టిన, మీ ప్రేమ నాదిపోస్తున్న రంగా, కాళేశ్వరరావులవంటి ఆనాగరక పరు తువ్యక్తులే మద్దిగరిపిపోతారు.

తీర్మానాలు

(6 వ పేజీ తరువాయి) ప్రాంతాల్లో చెరువుల మరమ్మతులను పూర్తిచేయించాలి.

ఇతర తీర్మానాలు

కృష్ణ లంకల రైతులు చిలగడం వగైరా తోటలకు మొక్కనాటినప్పుడు ఒకొక్క పాదుకు పోలెడుసీరు ఉపయోగించుకున్నం దుకుగాను యకరానికి రూ 5—4—0 నీటి తీరువా విధించటం అన్యాయమనీ, వెంటనే దాన్ని రద్దుచేయ వలెననీ ప్రభుత్వాన్ని కోరారు.

మరోతీర్మానంలో లంకల్లో విరిగిపోయిన భూములకు శిస్తు రద్దుచేయించాలనీ, మరల ఆ భూమి రైతుకు స్వాధీనపడ్డప్పుడే శిస్తు విధించాలనీ, లంకల్లో భూమి విరిగిపోయి, యితరభూములు లేనట్టివారికి పోరంబోకలను సాగుకివ్వాలనీ, భూమి తేలినప్పుడు స్కెచ్చి ప్రకారం ప్రభుత్వ ఖర్చులపై సర్వేచేయించి ఆయా రైతులకు వప్పజెప్పాలని తీర్మానించారు.

రైతాంగ శ్రేయస్సుకై కృషి చేస్తున్న 'ప్రజాశక్తి' పత్రికను దినపత్రికగా మార్చుట కనుమతి యివ్వవలసిందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

మరోతీర్మానంలో పొగాకు ఉత్పత్తిదారులు సరాసరి విదేశాలకు తమ సరుకును ఎగు మతి చేసికొనేందుకుగాను కోఆపరేటివ్ సొసైటీ స్థాపన కనుమతించాల్సినదిగా ప్రభు త్వాన్ని కోరారు.

బెజవాడలో రైల్వే పోలీసు దౌష్ట్యం

నైజాంఇలాకా మధిర తాలూకా మన వోలు కాపురస్థుడు గుండుపల్లి హనుమంత రావుగారిలా రాస్తున్నారు :

"నేను 23-4-46 వ తేదీని ఎసుపాలెంకు టిక్కెట్లు తీసుకొనవలెనని బెజవాడ రైలు స్టేషనుకు వెళ్ళితిని. అక్కడ జనసమ్మర్దంతో బుక్కింగు దగ్గర వత్తిడి చాలా ఎక్కువగా ఉంది. మధిర తాలూకా తక్కెళ్ళపాడుగ్రామ కాపురస్థుడు చెరుకూరి కోటయ్యగారు, వారి తాలూకు యిద్దరు ఆడవారు బెజవాడ రైలు స్టేషనులో టిక్కెట్లకోసం చాలా యిబ్బంది పడుతున్నారు. వత్తిడివల్ల ఆయన ఆడవారిని సామానుతో వదలిపెట్టి టిక్కెట్లు కొనడా నికి వెళ్ళలేదు. అక్కడవున్న నెం. 506 పోలీసు కానిస్టేబుల్‌తో, నేను టిక్కెట్లు తెచ్చుకొనే వరకూ ఆడవారిని, సామానును కనిపెట్టి ఉండమని అడిగినాడు. జవాను, తనకు రు. 1-8-0 ఇస్తే చూస్తానని చెప్పాడు. ఇంతలోనేను, కోటయ్యగారిని ఎరిగిన వాడిని, బంధువును, అగుటవల్ల ఆయన నాతో టిక్కెట్లు తెచ్చిపెట్టమని చెప్పి, డబ్బులు యిచ్చారు. టిక్కెట్లు తేవడానికి నేను బుక్కింగు వద్దకు వెళ్ళితిని. నెం. 506 జవాను నావద్దకు వచ్చి, టిక్కెట్లు తేవడానికి వీలులేదని, తెస్తే, రు. 5 లు నా వద్ద వసూలుచేయబడునని, బెదరించాడు. వారి డబ్బులు వారికి యిచ్చివేస్తే, రు 1-8-0 వారివద్ద గవర్నమెంటువన్ను వసూలు చేయ బడుతుందనికూడా చెప్పాడు. నేను జవానుతో సరే రు. 1-8-0 ఇస్తాను; రసీదు ఇవ్వమని అడిగినాను. వెంటనే, నెం. 506 పోలీసు రైల్వే పోలీసు స్టేషనుకు నన్ను తీసుకు వెళ్ళాడు. రసీదు అడిగినందుకు రు. 10 లు జరిమానా విధించాడు నామీద ; ఇవ్వకపోతే కదలనీయనన్నాడు. నాదగ్గర రు 10 లు బలవంతంగా తీసుకొని, వదలిపెట్టారు."

తక్షణమే రైల్వే అధికారులు గుంటుపల్లి హనుమంతరావుగారి వద్ద బలవంతంగా వసూలుచేసిన రు 10 లు తిరిగి యిప్పించి వేసి, నెం 506 పోలీసు జవానుమీద కఠిన చర్య తీసుకోవలసియుంది.

సవరణ

18—4—45 తేదీ "ప్రజాశక్తి"లో "రౌడీ లకు కాంగ్రెసువాదుల ప్రోత్సాహం అనేశీర్షిక క్రింద బుద్ధిరాజు రాజభూషణరావుగారుకూడా రౌడీల యిండ్లకువెళ్ళి, వారిని పరామర్శించి నట్లు, పోలీసుస్టేషనుకు వెళ్ళి రిపోర్టుచేయ మన్నట్లుగా ప్రకటించబడింది. రాజభూషణ రావుగారు రౌడీలను చేరదీయలేదు. ఈపొర పాటుకు చదువరులు క్షమింపవలెను.

అధ్యక్షుని ప్రవర్తనపట్ల ప్రజల అసంతృప్తి

(16 వ పేజీ తరువాయి) చేయడానికి నూలు మిల్లులైనా కావాలి. అసలు మిల్లులే అవుసరం లేదనడంవల్ల రంగాముఠావారు ఆంధ్రాభ్యు దయానికే వ్యతిరేకులనేది తేటతెల్లమవు తోంది. ఈ 17 వ తీర్మానం లిస్టులో వుంది గాని విషయనిర్ణయ సభలో ప్రతిపాదించ లేదు. కాని "ఆంధ్రప్రభ" లో యిది ప్యాసయి నట్లుగా ప్రకటించుకొన్నారు.

ఈ తీర్మానాల చర్చలో కమ్యూనిస్టు సోద రులు అని ఎలా ప్రజాశ్రేయస్సుకు విరుద్ధమై నవో తెలుపలేదు. వాటిని వ్యతిరేకించి, తమ దృక్పథాన్ని తెలుపడం వారి కర్తవ్యం. వారలా చేయకపోవడం శోచనీయం. ప్రజ లకు విరుద్ధమైన తీర్మానాలను ఎదిరించక పోవడం పొరబాటు.

ఎన్నికలు

పై తీర్మానాలు అయినప్పటికి రాత్రి 10 గంటలు దాటింది. సభమరునాటికి వాయిదా వేయమని కమ్యూనిస్టులు సూచించారు. అలా చేయక అధ్యక్షుడు ఎన్నికలుప్రారంభించాడు. నామినేషన్లకు తెలిపిన అసమ్మతికి సమ జాయిషీ చెప్పకుండానే, నిరంకుశత్వంగా త్రోసివేశాడు. 15 మందిని కార్యనిర్వాహక సంఘానికి సూచించుతూ ఒక లిస్టు చదువ బడింది.

దానిలో అనేకమంది దొంగవ్యాపారం సాగించేవారున్నారు. కృష్ణాజిల్లానుంచి ఎన్ను కోబడిన ప్రతినిధులనుండి ఎవరినీ తీసికో లేదు. దొంగవ్యాపారానికి కేసుపెట్టబడిన భట్టు కుమారస్వామిగారిని వర్కింగ్ కమిటీ లోకి తీసుకున్నారు. ఇలాంటి వర్తకులు, మాస్టర్ వీవర్సు హెచ్చుమంది ఉన్నారు. ధాయలసీమనుంచి ఒకరినికూడా తీసుకోలేదు.

ఈ లిస్టు చదువగానే, కమ్యూనిస్టులు కొన్నిపేర్లు సూచించారు. అధ్యక్షుడు, సక్ర మంగా ఎన్నికలు జరుపకుండానే సభను పూర్తిచేశామంటూ లేచారు. కమ్యూనిస్టులు అభ్యంతరాలు చెప్పినా వినిపించుకోలేదు. తక్కిన తీర్మానాలను చర్చించడానికి మరు నాడు విషయనిర్ణయసభనుపిలువమనికోరినా, నిరాకరించాడు. అందుచే విషయనిర్ణయసభ గందరగోళంగా ముగిసింది.

మహాసభ

రాత్రి వాన, గాలి వచ్చి వాలంటీర్లకుఏర్పా ట్లలో కొంత ఇబ్బంది గలుగజేసింది.అందుచే ఊరేగింపు 11 గంటలకు ప్రారంభమయింది. అధ్యక్షులైన రమాకాంతరావుగారిని, ప్రారం భకులైన శ్రీమన్నారాయణ అగర్వాలాగారిని పూలపల్లకీ అమర్చిన బండిలో ఆసీనుల్నిచేసి ఊరేగించారు. సుమారు 8 వేలుదాకాప్రజలు పాల్గొన్నారు. 500 స్త్రీలు,బాలబాలికలు రంగు రంగుల దుస్తులలో పాటలు పాడుతూ ఊరే గింపులో నడుస్తూంటే, చూడ ముచ్చటగా వుంది.

తమిళనాడులో పోటీ చేనేతసంఘ నాయ కులైన కె. యస్. గోపాలస్వామిగారుజెండా ఎగురవేశారు. కాంగ్రెసు పతాకముపై మగ్గాన్ని వేశారు. ఈ జెండాను ఎగురవేస్తూ గోపాలస్వామిగారు నాటినుంచి ఆజెండా అంతర్జాతీయ జెండా అయిందని సెలవి చ్చారు ; బాలికలు "ఎగురవేయ్ భారత భువిపై నేతపతాకం" అనే పాటపాడారు.

వార్ధా వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ అగర్వాలాగారు ప్రారంభోపన్యాసం చేశారు. పూర్వం భారతదేశం స్వయం సమృద్ధిగా వుండేదన్నారు. యంత్రాలపోటీ వచ్చాక చేనేతపరిశ్రమ నశించిపోతున్నా యన్నారు. కొన్ని రకాల బట్టలను చేమగ్గాలకు ప్రత్యేకించి, యీ పరిశ్రమకు రక్షణ యివ్వాలన్నారు.

తరువాత ఆహ్వానసంఘాధ్యక్షులు తమ ఉపన్యాసాన్ని చదివి వినిపించారు. ప్రతినిధు లను ఆహ్వానించుతున్న గోదావరిజిల్లాలోనే చేనేత ఉద్యమం ప్రారంభమయిందనీ, యిలాంటి మహాసభ 6 యేండ్ల తరువాత జరుపుతున్నందులకు సంతోషాన్ని వెల్లడిం చారు.

అధ్యక్షోపన్యాసం

దామెర్ల రమాకాంతరావుగారు తరువాత అధ్య క్షోపన్యాసాన్ని చదివారు. వీరు చేనేత పరి శ్రమను ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. తీర్మానాలలో ద్యోతకమైన వైరుధ్యమే వీరి ఉపన్యాసంలోకూడవుంది. ఒకవైపున చేనేత పరిశ్రమ వడుకునూలుపై ఆధారపడాలని రంగాగారి నినాదాన్ని వల్లిం చారు. రెండోవైపున సన్నని నూలును చేమగ్గాలకు సప్లయి చేయాలని కోరారు. తమకు కావలసిన రంగులు, నూలు, పట్టు వగైరా అన్నీ కంట్రోలు ధరలకు కావాలని కోరారు. కాని చేనేతబట్టను మధ్యదళారీలకు అధికలాభాలు లేకుండాచేసి, బట్టల కరువుతో బాధపడుతున్న బీదప్రజలకు నిర్ణీతధరలకు అందజేయాలనే వాదనను వ్యతిరేకించారు.

కార్యదర్శి ప్రగడ కోటయ్యగారు తమ నివేదికను చదివారు. దీనిలో కూడ కొత్త విషయాలేమీ లేవు. రంగాగారిని గురించిన పొగడ్తలు అదనం. పైవారు చెప్పిన సమస్య లనే తిరిగి ఉదహరించారు. వరుసగా ఉప న్యాసాలు వింటూంటే, శ్రోతలు ఉత్సాహం పొందలేదు. విసుగుజనించి లేచిపోసాగారు. కార్యదర్శి రిపోర్టుతో 14 వ తేదీ మహాసభ ముగిసింది.

రాత్రి వైజ్ఞానిక కార్యక్రమం సాగింది. రామచంద్రపురం దళం బుర్రకథ చెప్పారు. ఇతరులు పాటలు పాడారు.

15 వ తేదీ సభ

16 వ తేదీ సాయంకాలం 6 గంటలకు మహాసభ మరల సమావేశమయింది. సభలో సుమారు 8 వేలకు పైగా వుంటారు.

అక్కల కోటయ్యగారు రాజకీయ తీర్మా నాన్ని ఉపపాదించుతూ చక్కగా ఉపన్యసిం చారు. కరువుకాటకాల నివారణకు జాతీయ నాయకుల విడుదల, జాతీయ ప్రభుత్వం ఎలా అవసరమో వివరించారు. తరువాత దాడి అప్పలస్వామిగారు దీమూరు, అస్తి పురికోతలు రద్దుచేయాలనే తీర్మానాన్ని ఉప పాదించుతూ, ఉద్రేకంగా ఉపన్యసించారు. ఈ తీర్మానాలు ఏకగ్రీవంగా అంగీకరించ బడ్డాయి.

సభికులలోనుంచి పుత్సల సత్యనారాయణ గారిని మాట్లాడించాలని డిమాండు వచ్చింది. అధ్యక్షుడు రమాకాంతరావుగారు పనేమీ వీలులేదంటూ, వాలంటీర్లే యీ పని చేస్తున్నా రని విర్రిమిత్తంగా ఆక్షేపించారు. వాలంటీరు లెవ్వరైనా అధ్యక్షులవారు అన్యాయంగా వాలం టీరులను నిందించుతున్నారనీ, ప్రజాకోర్కె గానీ, తామేమనా, బాధ్యులం, కావనీ చెప్పి, ఆ రిమార్కును ఉపసంహరించు కోమని కోరారు. అధ్యక్షుడు చిర్రిబిగిసి, వీల్లేద న్నారు. దానిపై పుత్సల సత్యనారాయణ గారు వేదికపైకివెళ్ళి వాలంటీర్లను సవిన యముగా క్షమాపణ కోరారు. ప్రజలను సర్దమని వారిని ప్రార్థించారు. రమాకాంత రావుగారు స్థాయికోల్పోయి, కోపంతో, ఆలా మాటాడటానికి సత్యనారాయణగార్కి అధి కారంలేదని అరిచారు. అపుడే శాంతించు చున్న సభికులను రెచ్చగొట్టారు. ప్రజలు అలజడిగా లేచినిలబడి, అధ్యక్షుడు తన మాటలను ఉపసంహరించు కోవలసిందని కేకలువేయ సాగారు.

ఈ గందరగోళంలో కార్యదర్శి ప్రగడ కోటయ్యగారు తీర్మానాల కాగితాలను తిరుగ వేశారు. అధ్యక్షుడు సభ ముగిసిందనిలేచారు. ఇదంతా నిరంకుశత్వమని కేకలుమిన్ను ముట్టాయి.

అధ్యక్ష కార్యదర్శులు కబురు పంపించి పోలీసువారి కాపలా క్రింద వేదికనుంచి దిగారు. మోటారుకారుపై రైలుకు వెంచే శారు.

తరువాత, పుత్సల సత్యనారాయణగారు వేదికపైకి వెళ్ళారు. ప్రజలను శాంతంగా వుండాలని కోరారు. ఎచటివారచట ప్రజలు కూర్చున్నారు. సభలో చీమ చిటుక్కుమన్నా వినపించేటంత శాంతంగావుంది. సత్యనారా యణగారు విషయ నిర్ణయసభలో జరిగిన సంగతులు వివరించారు. నాయకులైన రమా కాంతరావు,ప్రగడ కోటయ్యగార్లు ఎలారెండు రోజులనుంచి అసభ్యంగాను, నిరంకుశత్వం గానూ ప్రవర్తించారో తెలిపారు. వేలకొలది ఒకచోట సమావేశమయినపుడు ఆరోగ్య నియమాలు అందరం అనుసరించాలి. భోజ నాల అనంతరం విస్తళ్ళ వేయడానికి చేసిన ఏర్పాట్లను పైవారు ఉల్లంఘించారని, దారి చూపుతున్న వాలంటీరుని తిట్టి, విస్తరి అత నిపై విసరారనిచెప్పారు.గాంధీజీ నిర్మాణకార్య క్రమంఅనుసరించుతున్నామనుకునేవారుయిలా తొందరపడటం తగదు. నియమాలను పెద్దలే త్రోసిపుచ్చితే మహాసభలను సక్రమంగా జరు పుట ఎలా అసాధ్యమో తెలిపారు.

మిరాజ్‌కర్ ఉపన్యాసం

ఇదే సమయానికి బట్టలకంట్రోలు బోర్డు సభ్యుడు, ట్రేడుయూనియన్ కాంగ్రెస్ ఉపా ధ్యక్షుడు అయిన కామ్రేడ్ మిరాజ్‌కర్ వచ్చారు. నేడు ప్రజలను ఎదుర్కొంటున్న బట్టల కరువును గురించి, నేతకార్మికుల దేశ భక్తియుతమైన కర్తవ్యాన్ని గురించి గంభీరో పన్యాసమిచ్చారు. బట్టలకరువువల్ల బాధపడు తున్న ప్రజలకుబట్టలను తయారుచేసిఇస్తున్న కార్మికులు గొప్పదేశభక్తులన్నారు. మనదేశ ములో చేమగ్గాలద్వారా 150 కోట్ల గజాలగుడ్డ తయారవుతూందన్నారు, అవగా 7 కోట్ల ప్రజలకు చేనేతకార్మికులు గుడ్డసప్లయి చేస్తు న్నారు. ఇలాంటి ప్రజా శ్రేయస్కరమైన కర్తవ్యాన్ని నెరవేర్చుతున్న చేనేతకార్మికుల యిబ్బందులను తొలగించడానికి ప్రజలంతా సాయం చేయాలన్నారు.

మద్రాసు రాష్ట్రమందలి చేనేతమగ్గాలకు 28 వేల బేళ్ళ నూలుకావాలి. కాని 21 వేల బేళ్ళమాత్రమే వస్తున్నాయి. అందువల్ల నూలు తగినంత దొరుకుట లేదన్నారు, కొదువను కూడా సప్లయిచేయాలని తామెలా కంట్రోలు బోర్డుకోపోరాడుతున్నారో మిరాజకర్ గారు తెలి పారు.ఇపుడు బోర్డులో అధికసంఖ్యాకులుమిల్లు యజమానులు, వర్తకులనీ, వారు బట్టలను ప్రజలకు కంట్రోలు ధరలకు అందజేయ డానికి అనేక ఆటంకాలు పెడుతున్నారనీ తెలిపారు. ప్రజాప్రతినిధులు హెచ్చుమంది బోర్డులో వుండాలని ప్రజలు ఆందోళన చేయాలన్నారు. తామెలా దొంగవ్యాపారస్తు లైన పదంపట్టి సింఘానియా వంటివారిని బట్ట బయలుచేసి, కంట్రోలు బోర్డునుంచి తొలగిం చిందీ వివరించారు. చేనేతపరిశ్రమ రక్షణకు ప్రత్యేక కంట్రోలుబోర్డు వుండాలనే ప్రజాం దోళన జయించిందనీ, త్వరలోనే నియమించ బడుతుందనీ చెప్పారు. అధికంగా బట్టలునేసి, ప్రజలకు అందజేసి,తమ దేశభక్తిని చాటాలని చేనేత పారిశ్రామికులను ప్రబోధించారు. కరతాళధ్వనులతో మహాసభ ముగిసింది.

మిరాజకర్ వేదికనుంచి దిగునప్పటికి ఒక తాతగారు సంతోషంతోవచ్చి అభినందిం చారు. "ఈ రెండురోజుల్లోను నాకు ఆనందం కలిగించింది మిరాజకర్ ఉపన్యాసమొకటే" నన్నారు. మరునాడు రైలులో ప్రయాణం చేస్తూంటే, ఒక ప్రయాణీకుడు (నర్సా పురము) మహాసభలో నేతగాండ్రకు కూలి గ్యారంటీచేస్తూ తీర్మానం చేశారా?అని ప్రశ్నిం చాడు. ప్రతినిధులు లేదన్నారు.ఆయన, యీ సభలు వృధాఅనీ, సామాన్యులకు నూలు, రంగులు అందజేయడానికంటేవ్యాపారస్తులు, మాస్టర్ వీవర్సు ప్రయోజనాలను చూస్తున్నా యనీ ఆక్షేపించారు. వారిమాటలు నిజమేనని ప్రతినిధులు తలలొంచుకొన్నారు. నాయ కత్వం పైవారి చేతుల్లో వుందనీ, అందుచేతనే మండపేట మహాసభ తగువులకు కారణ మయిందనీ అంగీకరించారు.

సవరణ

★

4-4-45 వ తేదీ సంచికలో "పార్టీనిధి వసూలులో వేలూరు ప్రజల ఉత్సాహం"అను శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించబడింది. మూలాన్ని కుప్తీకరించడంలో తాలూకా పార్టీ కమిటీ సభ్యుడైన కామ్రేడ్ తెలికేపల్లి కృష్ణ మూర్తి తన సర్వస్వాన్ని అమ్మి పార్టీకి రు. 5000లు యిచ్చిన విషయం పొరబాటున వదలివేయబడింది. వ్యాసంలో దీన్ని చేర్చి చదువుకొన వలసిందని పాఠకులకు మనవి.

(2వ పేజీ తరువాయి)ఎక్కడ రైతుమహాసభ జరిగినాసరే, 5 వేల రూపాయలిస్తానని ముందే వాగ్దానం చేశారు.

ఉదయం బళ్ళలో వెళ్ళేవారు బండ్లలోను, రైళ్ళలో వెళ్ళేవారు రైళ్ళలోను, నడిచివెళ్ళే వారు నడిచి, ఎవరి గ్రామాలకువారు విజయ ఢంకా మోగిస్తూ ప్రయాణమై వెళ్ళారు.

ఆంధ్ర రైతాంగం అన్ని ఆవాంతరాలు దాటి, అఖిలభారత రైతుసంఘం యొక్క నాయకత్వాన ఉజ్వల భవిష్యత్తు వైపు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గల మానవ ప్రపం చంవైపు, ఎలా సాగిపోతున్నారో చూచి, ఆనందభరితులమయాము.

పోలీసుల సహాయంతో కాలికి బుద్ధిచెప్పారు

మండపేటసభలో రంగాముఠావారి చర్యలు

మా విలేఖరి

చెన్నరాష్ట్ర చేనేతపారిశ్రామికుల ప్రథమ మహాసభ 6 యేండ్ల క్రితం గుంటూరులో జరిగింది. ఈ మధ్యకాలంలో చేనేత పారిశ్రామికులు అనేకయిక్కట్టుల పాలయ్యారు. నేతగాండ్రకు నూలుదొరకక మగ్గాలు మూలబడ్డాయి. విపరీతమైన ఖరీదులకు దొంగ మార్కెట్టులో నూలు అమ్మబడుటచే సామాన్యులకు అందుబాటులో లేక నానాఅవస్థలు పడ్డారు. రంగులు దొరకక, గంజికి బియ్యం దొరకక, రాత్రిప్పు పనిచేసికోడానికి అవసరమైన కిరసనాయిల్ దొరకక బాధలుపడ్డారు. విశాఖ, రాయలసీమ వంటి కరవు ప్రాంతాలలో ఆహారపదార్థాలు దొరకక బాధపడ్డారు.

ఈకష్టాలను తొలగించుకోడానికి చేనేత పనివారు ఆందోళన చేశారు. రాయబారాలు పంపారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. నూలు సప్లయ్ వగైరా విషయాలలో కొన్ని విజయాలను సాధించారు. కాని వీరు ఇంకా అనేకబాధలు పడుతున్నారు. నూలు అందరి నేతగాండ్రకు సప్లయ్‌గావడంలేదు. రంగులు, సిల్కు, నూలు వగైరాలలో యింకా దొంగ వ్యాపారం సాగుతోంది.

నేడు దేశమంతా బట్టలకరువు వ్యాపించి వుంది. అన్నం తరువాత ప్రధానమైన అవసరం బట్ట. అది దొరకక సామాన్య ప్రజలు బాధపడుతున్నారు. ఈ అవమానం భరించలేక బెంగాలులో కొందరు పోదరీ మణులు ఆత్మహత్య చేసికున్నారనే వార్తలు కూడ మనం వింటున్నాము. అందుచే బట్టలను ఎక్కువగా ఉత్పత్తిచేసి వస్త్రాల కరువును తొలగించాలసిన బాధ్యత, దేశభక్తియుతమైన కర్తవ్యం కూడ చేనేత పారిశ్రామికుల పైన వుంది.

ద్వితీయ మహాసభ

చెన్నరాష్ట్ర చేనేతపారిశ్రామికుల ద్వితీయ మహాసభను తూర్పుగోదావరి జిల్లా చేనేత పారిశ్రామిక సంఘం ఆహ్వానించింది. రామచంద్రపురం తాలూకా మండపేటలో మహాసభను జరపడానికి నిశ్చయించారు. ఆహ్వాన సంఘం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రచారంచేసింది. సుమారు 25 వేల రూపాయల చందాలు వసూలుచేశారు.

4 వేలు ఖర్చిడి విశాలమైన పందిళ్ళు వేశారు. ప్రతినిధులకు క్యాంపులు నిర్మించబడ్డాయి. 900 మంది వాలంటీర్లు సమీకరించబడ్డారు. ఎత్తైయినసభావేదిక నిర్మించబడింది. విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు.

చేనేత పారిశ్రామికుల సంఘంలో అనేక వర్గాలున్నాయి. చేనేతయే వృత్తిగా కలిగిన నేతగాండ్రున్నారు. నేతగాండ్రచే నేయించి వ్యాపారం సాగించే మాస్టర్ వీవర్సు (యజమానులు) వున్నారు. నూలు వ్యాపారం చేసే వర్తకులున్నారు. అంతేగాక వివిధ కులాలకు చెందిన వారున్నారు. పద్మసాలీలు, దేవాంగులు వున్నారు. నేత యే వృత్తిగా కలిగిన హరిజనులు, ముస్లిములుకూడ వున్నారు.

చెన్నరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘంలో యిపుడు నాయకులుగా వున్నవారిలో హెచ్చుమంది మాస్టరు వీవర్సు, వర్తకులు. వీరు స్వయంగా నేతపనిచేయరు. ఇతరులచే నేయించి లాభం పొందుతారు. అందుచే వీరు సామాన్యనేతగాండ్ర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకోరు. తమ స్వంతప్రయోజనాలకే హెచ్చు ప్రాధాన్యత యిస్తున్నారు. ఇంకో అహంభావం కూడా వీరిలోవుంది. నేతయే వృత్తిగా కలిగిన హరిజనులు, ముస్లింలకు వీరు ఉద్యమంలో తగినస్థానం యివ్వడంలేదు. చేనేత పారిశ్రామికుల సంఘంలో రంగాముఠావారు, కమ్యూనిస్టులుకూడ పనిచేస్తున్నారు. రాజకీయంగా చూస్తే రాష్ట్రనాయకత్వం రంగాముఠావారి చేతుల్లో వుంది. వీరు పైనచెప్పినట్లుగా మాస్టరు వీవర్సు, వర్తకుల ప్రయోజనాలకొరకు నిలబడుతున్నారు. సామాన్య నేతగాండ్ర జీతాలను గ్యారంటీ చేయాలనీ, వారికి రక్షణ యివ్వాలనే సంగతి గుర్తించరు. కంట్రోలు రేట్లకు నూలు, రంగులు, కిరొసిన్ వగైరా అందచేయాలనే విషయంలో కమ్యూనిస్టులు వీరితో కలిసి ఆందోళన చేస్తున్నారు. దొంగమార్కెట్టు సాగించే నూలువర్తకులను కమ్యూనిస్టులు బట్టబయలు చేయాలంటారు. రంగాముఠావారు అందుకు వ్యతిరేకులు. ఏమంటే, వీరిలో ముఖ్యులే మాస్టర్ వీవర్సుగానూ, వర్తకులుగానూ వున్నారు. ఉదాహరణకు అధ్యక్ష కార్యదర్శులు, రమాకాంతరావు, ప్రగడ కోటయ్యగార్లు. కొందరుదొంగ వ్యాపారం సాగించే వారున్నారు. ఉదాహరణకు ఆహ్వాన సంఘాధ్యక్షుడైన చిట్టిరత్నంగారిపై దొంగ మార్కెట్టు కేసు జరుగుతోంది. బట్టలధరలను సక్రమంగా నిర్ణయించి మధ్యవ్యాపారస్తులకు అధికలాభాలు లేకుండా, ప్రజలకు అందజేయాలని కమ్యూనిస్టుల వాదన. రంగాముఠావారు అందుకు పూర్తిగా వ్యతిరేకులు. ధరల నిర్ణయమే పనికి రాదంటున్నారు. అలా చేయడంవల్ల వర్తకులు, మాస్టర్ వీవర్సు అయిన వీరి అధికలాభాలకు వీలుండదు. నేతగాండ్రకు న్యాయమైన కూలి గ్యారంటీచేసి రక్షించాలంటున్నారు కమ్యూనిస్టులు. దీనికి కూడ రంగాముఠావారు వ్యతిరేకులు. ముఖ్యమైన విషయాలలో రంగాముఠాకు - కమ్యూనిస్టులకు వున్న తేడాలు వివరించాను. ఇక విషయనిర్ణయ సభకు వెళ్లుదాం.

నామినేటెడ్ ప్రతినిధులు

స్థానికసంఘాలు ప్రతినిధులను ఎన్నుకొని మహాసభకు పంపాలి. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలనుండి యిలా సక్రమంగా ఎన్నుకొన్న ప్రతినిధులు మహాసభకు వచ్చారు. వీరిలో వివిధ గ్రూపులకు చెందినవారున్నారు. గుంటూరు జిల్లాలో కొన్ని ప్రాంతాలనుండి రంగాముఠావారు ఎన్నుకోబడ్డారు. బాపట్ల తాలూకానుండి కమ్యూనిస్టులు ఎన్నుకోబడ్డారు. కాని ఆ జిల్లాసంఘం, రాష్ట్రసంఘం రంగాముఠావారి చేతుల్లోవుంది గదా! ఎన్నుకోబడిన ప్రతినిధులలో కమ్యూనిస్టులను వారు నిరాకరించారు. వారి స్థానే తమ ముఠావారిని నామినేట్ చేసికొన్నారు. ఆవిధంగా గుంటూరుజిల్లా నుంచి 67 గురు తమవారిని దింపుకున్నారు. నెల్లూరు, విశాఖ జిల్లాలలో ఎన్నికలే జరుపలేదు. మాస్టరు వీవర్సును, వర్తకులను, వారి అనుకూలురను ప్రతినిధులుగా రంగాముఠా నామినేట్ చేసికుంది. ఈవిధంగా విశాఖనుంచి 36, నెల్లూరునుంచి 24 గురిని మహాసభకు దించింది. రాయలసీమజిల్లా, అనంతపురంనుండి 1 ప్రతినిధి వచ్చాడు. అనగా, పేరుకు చెన్నరాష్ట్రసభ అయినా, తమిళనాడు, కేరళకు ప్రాతినిధ్యం లేదు. ఆంధ్రలోకూడ రాయలసీమవారు తగినంతమంది రాలేదు.

విషయనిర్ణయసభ

కార్యక్రమం ప్రకారం విషయనిర్ణయసభ 13 వ తేదీ ఉదయం జరగాలి. కార్యదర్శి ప్రగడ కోటయ్యగారు తమ నామినేటెడ్ ప్రతినిధులు రానందున వాయిదావేశారు. వారు వచ్చాక సాయంకాలం 6 గంటలకు ప్రారంభించారు.

అధ్యక్షుడుగా రమాకాంతరావుగారు కూర్చున్నారు. ఎజెండా తెలుపలేదు. వచ్చిన ప్రతినిధుల లిస్టును సరిచూడనైనాలేదు. నామినేషన్లకు అప్పలస్వామిగారు (ఏలూరు) చెప్పినఅభ్యంతరాలను విచారించకుండానే అధ్యక్షుడు త్రోసివేశారు.

తీర్మానాలు ప్రారంభమయ్యాయి. ప్రజలను అన్నవస్త్రముల కరువునుండి కాపాడటానికి, యుద్ధానంతరం శాంతిసౌభాగ్యాలను పెంపొందించడానికి, జైళ్ళలోవున్న జాతీయ నాయకులను విడుదల చేయాలనీ, కేంద్రంలో జాతీయప్రభుత్వం నెలకొల్పాలని మొదటి తీర్మానం కోరుతూంది. ప్రజావాంఛను తెలిపే యీ తీర్మానం ఏకగ్రీవంగా అంగీకరించబడింది. తరువాత ఖద్దరునుప్రోత్సహించాలనీ, వడుకు సహకార సంఘాలు ఏర్పడాలనీ తీర్మానించారు. చేనేత సహకారోద్యమానికి గ్రాంటుచేసిన 5 లక్షలు చాలవనీ, కోటి రూపాయలవరకు హెచ్చించాలనీ కోరారు.

మద్రాసు రాష్ట్రీయ చేనేత సహకార సంఘమునకు అధ్యక్షుడుగా చేనేత పరిశ్రమ ప్రతినిధినే నియమించాలని కోరారు. వాటాదార్లకు యిచ్చేడివిడెండును రు. 6-4-0నుంచి 3-0-0 కు తగ్గించి, అనుబంధ సంఘాలకు బోనసులు యివ్వాలని కోరారు.

నిర్మించబోయే అఖిలభారత చేనేతబోర్డులో మూడింట రెండువంతులు చేనేతప్రతినిధులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం 30 స్థానాలలో 8 మాత్రమే ప్రత్యేకించినందులకు అసంతృప్తి వెల్లడించారు.

సన్న నూలు

నూలు పంపకంలో వున్న లోటులను సూచించి వాటిని సవరించాలని కోరారు. చేనేతమగ్గాలకు సన్ననూలును సప్లయి చేయాలనికోరారు. ఈతీర్మానంలో విదేశాలనుండి దిగుమతిచేసి అయినా సప్లయి చేయుమని కోరారు.

ఈ తీర్మానానికి, రంగాముఠావారు ఉపన్యాసాలలో చేసిన వాదనకూ అనేక వైరుధ్యాలున్నాయి. వడుకునూలుపైన చేనేతఆధారపడినపుడే సుస్థిరంగా వుంటుందని, పతాకోత్సవం జరిపిన కె. ఎస్. గోపాలస్వామిగారు, అధ్యక్షత వహించిన రమాకాంతరావుగారు చెప్పారు. కాని యీతీర్మానంలో సన్ననూలు కావాలనీ, విదేశాలనుంచి దిగుమతిచేసి అయినా సప్లయి చేయాలని కోరారు. ఉపన్యాసాలలో వాదన రంగాగారి కోసం కాబోలు. కాని వడుకునూలు చేనేత పారిశ్రామికుల సమస్యను పరిష్కరించజాలదు. కాబట్టే ఈ తీర్మానం చేయవలసివచ్చింది. వీరు యిప్పటికి అయినా తమ మాటలకూ ఆచరణకూ వున్న తేడా గమనించితే మంచిది.

తరువాత రంగులు, నారపట్టు కంట్రోలు ధరలకు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం చేయబడింది. శాసనసభలలో చేనేత పారిశ్రామికులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కావాలని మరో తీర్మానం చేశారు. రవాణా సౌకర్యాలు కలిగించాలని, కొత్త మగ్గాలకు నూలు సప్లయి చేయాలని తీర్మానించారు.

రక్షణ పేరుతో

విషయనిర్ణయసభలో చేయబడిన పైతీర్మానాలు బట్టలఉత్పత్తిని అభివృద్ధి చేయడానికి, చేనేత పారిశ్రామికుల ఇబ్బందులను తొలగించడానికి సూచవలిస్తున్నాయి.

కాని తరువాత రంగాముఠావారు రెండు తీర్మానాలు (16-17) ప్రవేశపెట్టారు. వీనిలో చేనేత పరిశ్రమకు రక్షణ అనే పేరుతో వీరు మిల్లుబట్టల ఉత్పత్తిని తగ్గించాలని కోరారు. నేడుప్రజలకు బట్టలుచాలక దేశమంతటా హాహాకారాలు చెలరేగినవిషయం అందరెరిగినదేగదా! అలాంటిసమయంలో మిల్లుల ఉత్పత్తిని తగ్గించాలనడం ఎలా ప్రజావిరుద్ధమో చూడండి. పైనఒక తీర్మానంలో ఈపెద్దమనుష్యులే సన్ననూలును విదేశాల నుంచి దిగుమతిచేసి అయినా సప్లయిచేయాలని కోరారు. ఈ తీర్మానంలో దేశీయ మిల్లుల ఉత్పత్తిని తగ్గించాలనీ, దిగుమతులు నిషేధించాలనీ కోరుతున్నారు. వీరికి ప్రజాశ్రేయస్సు అక్కరలేదు. బట్టలకరువు తొలగించడం, సక్రమ ధరలకు ప్రజలకు అందజేయడం అవసరంలేదు. తమకు కావలసిన నూలు, రంగులు వగైరా కంట్రోలురేటుకు కావాలంటున్నారు. అది సక్రమమే. కాని మధ్యవర్తకుల అధికలాభాలు రద్దుచేసి, ప్రజలకుకంట్రోలురేట్లకు అందజేయడం అక్కరలేదంటున్నారు. ఇది అధికలాభాపేక్ష పరులైన వర్తకుల దృక్పథం; ప్రజావ్యతిరేకులైన దొంగవ్యాపారస్తులఆశ. ప్రజానాయకులు, దేశభక్తిగలవారు అనుసరించాలసిన పంథాకాదు.

ఇంతేకాదు. 17 వ తీర్మానంలో వీరు బట్టలమిల్లులు పెట్టడానికి అనుమతి యివ్వరాదని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. మన ఆంధ్రదేశం పరిశ్రమలలో వెనుకబడివుంది. మనం బట్టలకొరకు బొంబాయి, అహమ్మదాబాద్ మిల్లులపై ఆధారపడవలసివస్తూంది. ఆంధ్రలో ప్రత్తి పండుతూంది. కాని బట్ట దిగుమతి చేసికోవలసి వస్తూంది. ఈ స్థితిపోయి, ఆంధ్రరాష్ట్రం స్వయంపోషకంగా వుండాలంటే బట్టలమిల్లు అవసరం. చేనేతకునూలుసప్లయి(18వ పేజీ తరువాయి)

END OF ISSUE